Visit **Dwarkadheeshvastu.com** For

**FREE** Vastu Consultancy, Music, Epics, Devotional Videos Educational Books, Educational Videos, Wallpapers

****

All Music is also available in **CD** format. **CD Cover** can also be print with your Firm Name

****

We also provide this whole Music and Data in **PENDRIVE** and **EXTERNAL HARD DISK.**

Contact : Ankit Mishra ( +91-8010381364, dwarkadheeshvastu@gmail.com )

# Sridakshinamurthy Katha

## Telugu

# కృతజ్ఞతలు

ఈ గ్రంథమునవలోకించి, తమ అమూల్యాభిప్రాయ పత్ర [illegible] దయతో నొసంగిన ప్రముఖ కవి, పండితులకు కృతజ్ఞత, నమస్సు[illegible] ఈ మహాకవుల, ఉద్దండపండితుల అభిప్రాయపత్రములే యీ జన్మలో నే నార్జింప నాకాంక్షించిన నిధి. వీరి ఆశీస్సులే నాకుపెన్నిధి. వీరి రచనల పేర్కొని. వీరి యశస్సును ప్రస్తుతింపబూనుట స్వయంప్రకాశుడగు సూర్యునిజూప కరదీపిక పట్టినట్లగునని భావించితిని.

తమవృత్తియందసమానయశస్వులయి విరామము లభించకయు, ఆధ్యాత్మిక, సాహిత్య అభిరుచుల ప్రస్ఫుటించుచు మానవసంఘము నలరింప యత్నించు యువతర ప్రముఖవైద్యులు Dr. K. రవీంద్రబాబు M. S. & Dr. P. దక్షిణామూర్తి M. D., F. I. C. A. గార్ల అభిప్రాయ పత్రములకు కృతజ్ఞతను, సంతృప్తిని దెలుపుచున్నాను.

తమ అమూల్యకాలము నందొక లేశభాగమును నా గ్రంథావలోకనమునకు కూడ వినియోగించి సౌహార్దముతో తొలిపలుకు (Foreword) వ్రాసిన Prof. శ్రీ K. సచ్చిదానందమూర్తిగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

మఱియు యీ గ్రంథ హృదయమును విశదీకరించుచు అంగ్లమున విస్తరమగు విషయ పరిచయమును (Introduction) వ్రాసి యిచ్చిన శ్రీ R. రామకృష్ణయ్య అడ్వకేట్‌గారికి నా అభినందనలు.

లో చూపుతో నేనెరింగిన శ్రీ దక్షిణామూర్తిగురుని స్తోత్రార్థము లను అక్షరరూపమున వెలయించుటకు వలసిన వెలిచూపును నాకు ప్రసాదించిన నేత్రవైద్య నిష్ణాతులు; రష్యా, అమెరికా యందలి ప్రఖ్యాత వైద్యసంస్థలలో సల్పినకృషిచే విశేషప్రజ్ఞావంతులు, "జ్యోతిప్రదాత" బిరుదాంచితులు డాక్టరు శ్రీ M. V. L. నరసింహారావు, ఒంగోలు, చీమకుర్తి చికిత్సాసంస్థల అధినేతగారికి కృతజ్ఞతాపూర్వక శ్రేయస్కామనలు.

ఈ గ్రంథముద్రణకు నన్ను ప్రేరేపించి, ప్రప్రథమ స్వచ్ఛంద విరాళముల నొసంగి ప్రగతిని ప్రోత్సహించిన వదాన్యులు శ్రీ గుడివాడ హనుమంతరావు, శ్రీ తియ్యగూర సూర్యనారాయణరెడ్డిగార్లకు, వితరణ శీలురగు యితర విరాళదాతలకు నా కృతజ్ఞత, నమస్సులు. మనన పూర్వకములగు నా భావములు గ్రంథరూపముదాల్చుటకు సహకరించిన యీ సన్మిత్రులందరూ ఈ పారమార్థిక సుకృతమున భాగస్వాములేనని తెలుపుకొనుచున్నాను.

భక్తిశ్రద్ధలతో గ్రంథ ముద్రణముపట్ల శ్రమించిన తెనాలి శ్రీనాథ్ ఆర్ట్ ప్రింటర్స్ బృందమువారికి, ముఖచిత్రమును ముచ్చటగా చిత్రించిన స్వర్గీయ శ్రీ గోలి శేషయ్యగారికి, హృదయపూర్వక అభినందనలు.

భవదీయ

L. విజయగోపాలరావు

# విషయ సూచిక

1. Foreword - Professor
*Sri K. Satchidananda Murthy*

2. Introduction by Sri R. Ramakrishnaiah i to viii

3. స్వీయ పరిచయము 1 .... 8

శ్రీ శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి ....

శంకర పీఠాధీశ్వరుల శ్రీముఖము .... 9

అభిజ్ఞుల అభిప్రాయములు 10 .... 42

(ప్రముఖ కవి, పండితులకు సన్మిత్రులకు

కృతజ్ఞతాభివందనములు) ....

ప్రథమ భాగము :

I. శ్రీ దక్షిణామూర్తి స్తోత్రవిశిష్టత .... 43

II. గ్రంథస్థవిషయ పరిచయము :

i) సర్వాత్మత్వ వివరణ – అధికారిభేద విషయము
ఉపయుక్తాంశ సంగ్రహము – జగద్విషయకవాదములు
కార్యకారణములకు భేదమా అభేదమా అనన్యత్వమా ? –
శబ్దసృష్టి జైపవాదములు : జీవతత్త్వ ఈశ్వరతత్త్వ వాదసమీక్ష
జాతీశ్వర నియతేశ్వర వాదములు.

III అద్వైత సిద్ధాన్త ప్రముఖ సూత్రములు.


ద్వితీయ భాగము :

భూమిక 69

మంగళాచరణము : 71

జ్ఞానబోధ శ్లోకాష్టకము

శ్లో. 1 విశ్వందర్పణ 71

ఆత్మపద నిర్వచన 91

అధ్యాస స్వరూపము 97

శ్లో. 2 బీజస్యాంతరివాఙ్కురో 105

త్రిగుణములు (C. F.)

Newton's Laws of motion 109

"శక్తి" విచారణ 110

శ్లో. 3 యస్యైవస్ఫురణం 139

మహావాక్య విషయము 142

శ్లో. 4 నానాచ్ఛిద్రఘటోదర 146

శ్లో. 5 దేహంప్రాణమపీంద్రియాణ్యపి 153

శ్లో. 6 రాహుగ్రస్తదివాకరేందు 160

శ్లో. 7 బాల్యాదిష్వపి 167

శ్లో. 8 విశ్వంపశ్యతి కార్యకారణతయా 172

శ్లో. 9 భూరంభాంస్యనలో నిలోంబర (సగుణభావ ప్రతిపాదకము)

శ్లో. 10 సర్వాత్మత్వమిదం. (ఫలశ్రుతి)

iv పారిభాషిక పదవివరణ 192

# INTRODUCTION

R. RAMAKRISHNAYYA, Advocate,
TENALI.

"Pure intellectual light, fulfilled with love,
Love of the true Good, filled with all delight,
Transcending sweet delight, all sweets above."

Dante (Divine Comedy Paradiso : XXX)

Poetic compositions and philosophical speculations are meant mainly for readers whose comparative freedom from want and from the stultifying necessity to care for the morrow, facilitates a leisurely and steady interest in life, its origins, its future and its ever-present beauties. That is why neither poetry nor philosophy is so very popular. In any case, they cannot compete with the cinema or the novel for the attention of the vast body of the reading public. And yet, even in an age in which intense practical activity is given the first place and poetry and philosophy have no place at all or at the most a remote second place, quite a few among us manage to keep up a lively interest in the study of philosophy as is evident from the stupendous effort made by Dr. L. V. Gopala Rao in furnishing a learned

and yet lucid commentary on what can only be described as a mighty little composition written centuries ago by Sri Adi Sankara.

The average man is delighted by poetry and would feel some what elevated by a study of philosophical writings. But, when it so happens as in the case of Sankara's Dakshinamoorthy Sthothram, a composition cont ains both philosophy and poetry, there is no limit to the wonderment caused by such a delicious compound. That precisely is my own condition as I go on reciting the few slokas again and again, sometimes audibly, more often within myself and always with reverence.

Of all the poets of Europe the one that comes nearest to Sankara in his intuitive grasp of cosmic purpose and beauty, is Dante (Italian poet of the 13th-14th Centuries). But, Dante in pre-eminently a poet in the best European tradition and therefore an artist. That is not how we can describe Sankara. He is a philosopher in the best Hindu tradition. If he wrote poetry, that was because his philosophy needed poetic expression. In him more than in any other writer, poetry and philosophy meet and exhibit a common purpose and achieve a common end.

Poetic intuitions are complementary to, if not a part of philosophical insights. Recent inquiries into the character of scientific achievements have shown almost conclusively that without the intuition which we associate with a poet and without the daring

exhibited in philosophical speculations, there can be no original scientific discovery. So, science, poetry, and philosophy and perhaps even religion, are only different facets of human endeavour, depending more or less on preternatural intelligence. And, there is no doubt that Sankara had this preternatural intelligence to an extraordinary degree. True, his writings do not reveal the same degree of craftsmanship as those of Dante; but, they nevertheless express "the joy of unpremeditated song." Dante needed all the superlative mastery of an uncanny art to put across his message, while the truths discovered by Sankara shine through the transparent medium of a language which obliterates the distinction between matter and manner. It pleases as well as teaches.

Coming now to the very readable commentary supplied by Dr. Gopala Rao which in his affection for me he attributes to the inspiration furnished by me. The truth is that long before we met, each of us had been trying in his own way to re-state our ancient faith in the light of attacks made on it by modern science and also to find out generally if popular science has destroyed popular faith and also if, as has been claimed in some fashionable quarters, the logic of modern science has shattered mankind's most drized philosophical possessions. After we met and began to discuss our respective beliefs and to advance our pet themes and favourite theses, it appeared absolutely inescapable that a serious effort should be made to give a reasonably cogent expression to all the vague ideas and beliefs, hopes and aspirations and the doubts and fears which had made a cockpit of our

inmost selves and were contending for our very souls. Dr. Gopala Rao set about his job with his accustomed energy which would seem wonderful in a young man of thirty. Going through his commentary I have particularly liked his treatment of the principle of polarity as the same concept occurs in various contexts in science and philosophy. While in the Hindu philosophy it is well-known as the Purusha and Prakriti, modern science has made it familiar to us as the attraction between positive and negative electricity. The same or almost the same concept is understood as the combined or simultaneous working of two opposing forces in the philosophy of Hegel and elaborated as dialectical meterialism by Marx and Engels. It is the paradox of all living and non-living matter, and is present in the human spirit, labour and achievement. "He that findeth life shall lose it; and he that loses his life (for my sake) shall find it" is one of the numerous pithy paradoxes of classical and Biblical literature. The Bhagavad Gita abounds in paradoxes of this kind and is itself a huge paradox calling upon us to die so that we may live; that the eternal life of man has to be built, so to say, on a pyramid of human skulls; that there is destruction in creation and creation in destruction. The concept of the paradoxical nature of movement or change, was not unknown to the Hindus. But, their preoccupation was, not with the technique of movement, but with the mystery and magic of time and space, as the two, between them, conspire to cause movement. That indeed is the true philosophical question and all else amounts merely to scratching the surface. It may be true that for the vast majority of us the Magic

of Science is necessary to point out the Magic beyond Science. But, the philosopher's position remains unaltered by Scientific achievements.

I greet Dr. Gopalarao's commentary on 'Dakshinamurty Sthothram' as a welcome addition to our philosophical literature and wish it and the author every success. The need of the hour is to reconcile science with religion and that can be done only by philosophy. Dr. GopalaRao's book is an attempt in that direction.

I have appended, hereunder, more outof enthusiasm than from any sense of incompleteness of Dr. Gopalarao's commentary a bare English rendering of the slokas without, of course, their poetic content which it is impossible (for me at any rate) to convey in English or any other language known to me. Dr. Gopalarao and I would feel amply rewarded if the reader is encouraged to more serious efforts in the same direction.

**GIST OF SLOKAS :**

1. The world is infact what we ourselves make of it; otherwise, like the world of our dreams, it is as unreal as the reflection of a city caught in a mirror ... a mere shadow.

(Here we have the epistemological question tackled with brilliant terseness in two short sentences.)

2. If the plant, with its future flowers and fruits, is already in the seed, and requires only space and time to bring it out, all the myriad manifestations of Nature, looking like so many cunningly painted pictures, exist potentially in the same Magic of Space and Time. But, it stands to reason that the author of this Magic is not subject to its limitations.

(The age-old questions of creation, free-will and determinism are tackled in this sloka with equal brilliance. We hear in it also a distant echo of all the implications of the theory of evolution with its invariant reproduction and natural selection etc.)

3. The Force that has created the universe is also the force animating everything in it; and therefore the Vedic teaching, "Thou art That", needs no further proof. Its realisation will free us from the fear of death (as the force that is in each of us, is it-self the cause of all life and cannot be subject to death.)

4 to 7. The next four slokas deal with the great importance of the various facets and faculties of the 'ego' in all states and stages of life and the identity of purpose revealed in all its faculties and functions-imagination and understanding supported

by emotional enthusiasm. It is the Great flame (Lamp) within each of us but for which the world is empty, dark and meaningless. It is therefore the same as that from which the universe has emerged.

'Thou Art That' is thus self-revealed.

If Sankara were to come back alive in this scientific age - a feat according to legend he performed once in his own time, he would undoubtedly observe that all our scientific achievements are implicit at a level of consciousness which is common to all mankind and which assumes the objective reality of the external world (nature); but that the real destiny of man lies not only in probing the several planets of our tiny solar system but in finding out how this and numerous other stellar systems have conspired to cast a spell on us and to discover by appropriate means the mystery of this great enchantment. Something like this is foreshadowed in the next sloka.

Sloka No. 8. The relations of cause and effect and the realationships of father and son, teacher and disciple, and, master and servant, that we see around us, have no reality behind them. A simultaneous

# స్వీయ పరిచయము

**A.** నామూర్తి భారతీయము; నావేషము పాశ్చాత్యము; నాహృదయము శఙ్కరాంకితము; కృషి ఆంగ్ల ఆంధ్రభాషా క్షేత్రములయందు; అభిరుచి లలితకళలయందు. ఒకప్పుడు రంగస్థల ప్రఖ్యాతనటుడను. నటనకు బహుధా స్వర్ణపతక ప్రశంసాపత్రవిజేతను. రంగస్థల గానమున ప్రతిభావంతుడను. నా గీతములు **1935**లో **Broad Cast** కంపెనీ వారిచే రికార్డు చేయబడినవి. నా రంగస్థల జీవిత విశేషములు **22-9-71** ఆంధ్రప్రభ వారపత్రిక యందును "నాట్యకళ" మాసపత్రిక మార్చి—ఏప్రియల్ **72** సంచికయందును చిత్రింపబడినవి. వృత్తి, కొంతకాలము రంగస్థలనటన తరువాత **42** సం॥ మేరకు ఆంగ్ల ఆయుర్వేద వైద్యచికిత్సయు, అందునను, ప్రసూతి-శస్త్రవైద్యములు నాకభిమానపాత్రములగు శాఖలు. ప్రవృత్తి వేదాంతశాస్త్రమున; అందును ప్రగాఢ భావగాంభీర్య సంభరిత సాత్వికానంద ప్రవంతియగు శాఙ్కరాద్వైత విభాగమున.

నేనెవరినో పోల్చుకుంటిరా? "నేనన" నెవ్వరో తెలిసి కొనుటకే యీ స్తోత్ర విచారణకు గడంగితిని. ఆప్రయత్నము ననే పయనించి పయనించి **73** మైలురాళ్ళు దాటితిని. నేటికి శ్రీ దక్షిణామూర్తి అనుగ్రహ ప్రాప్తిచే ధన్యోస్మియను కొంటిని. నాసుదీర్ఘ మననము, నా మనస్తత్వముగల జిజ్ఞాసువు లకుపకరించకుండునా? అని లేఖినికి పని గల్పించితిని.

ప్రకృతము: నేనెక్కడనుండియో వచ్చిన పండితుడగాను, మనన శక్తియుక్తుడనగు జిజ్ఞాసువునుమాత్రమే. తెనాలి పట్టణ వీధులలో తఱచు మీ దర్శనము జేసికొనుచుండు విజయ గోపాలరావును. బ్రహ్మవిద్యాపారంగతుడు వేంకటసూర్య నారాయణ పితృదేవుడు. యోగిని చిత్రూపిణి మాణిక్యాంబ మాతృదేవత; శ్రీవత్సగోత్రము. జన్మస్థానము కనగాల— కాలము 4-12-1903 కు సరియగు శోభకృతు సం॥ మార్గశిర పూర్ణిమ శుక్రవారము.

పూర్వపు నాటక రంగస్థలమును విడచి ప్రస్తుతము జగన్నాటక రంగస్థలముపై అవతరించితిని. పూర్వము తెరకు ముందునిలిచి నా కళాకౌశలముతో మిమ్ములనానందపరచితిని. ఇప్పుడు, 'తెరతీయగరాదా' అను త్యాగయ్యగారి సూక్తి కనుగుణముగ, అజ్ఞానపు తెరను తొలగించి, 'తెర వెనుక భాగవతమును'అనగా భగవల్లీలలప్రస్తుతించి ప్రదర్శించి, ఒక అవ్యక్త శక్తిమంతుని స్ఫురణకుదెచ్చి, అతని దివ్యకళా కౌశలమెట్టిదో, ఆ యన వన్నెచిన్నె లెట్టివో ప్రదర్శించి మిమ్ముల సాత్వికానంద పరవశుల జేయ నాకాంక్షించి యత్నించితిని. ఉడుత వారధి గట్టలేదు, కాని తన శక్తియుక్తుల సద్వినియోగపరుప ప్రయత్నించి అభిజ్ఞా యోగ్యములగు చారలను శ్రీరాముని కరస్పర్శచే పొందినది. నా యత్నమును అట్టిదియేనని శిష్టులు, పండితులు అగు పెద్దలు తమ సదభిప్రాయ పత్రములతో నన్నాశీర్వదించిరి. వారి ఆశీస్సు

లమోఘము లగుగాక యనియు, విజ్ఞులగుతమ ఆశీస్సులు లభించుగాక యనియు శ్రీ సద్గురు దక్షిణామూర్తిని సంస్తుతించు చున్నాను.

శ్రీ తుమ్మలవారి యీ పద్యము నా కాదర్శసూక్తి.

తప్పు వ్రాయని యొప్పులతప్ప ననుచు
రిత్తమాటలు నే వెల్వరింపఁ జాలఁ
బెద్ద లిది దోస మన్నచో దిద్దుకొందు
నిట నహంకృతి లేదు నా కించుకయును.

B. నా బాల్యము నుండియు పారమార్థిక విషయముల యందాసక్తియుండి, తాత్త్విక చర్చలను శ్రద్ధతో వినుచుండెడివాడను. తత్వశాస్త్ర విషయములు పారిభాషిక సాంకేతిక పదములతో గూడియున్నందున బోధలయందలి విషయములు విశ్వసనీయముగ నుండునన్ని గ్రహింపనేర నైతిని. సాంప్రదాయసిద్ధముగ జెప్పబడు చుండెడి భావములను, శాస్త్రములయందుగల శ్రద్ధ చేతను, బోధకులయందు గల భక్తి చేతను, హృదయంగమముగ నేరకపోయినను "చిత్తము చిత్తమని" యనుచుదృశ్యమగుజగత్తుమిథ్యయనియు దృశ్యమానుషుగాని బ్రహ్మసత్యమనియు భావనాబలమును సమకూర్చుకొన యత్నించుచుండెడి వాడను. మరియు యీ శరీరము స్వేదమలమూత్రములతో గూడియుండునది, బుడగ వలె నశించునది గనుక తుచ్ఛమైనది. దీనివిషయమున శ్రద్ధ

జూపు టనక్షమని, ప్రపంచముదుఃఖమయము,స్వల్పసుఖములు లభించినను అవి క్షణికములు గనుక ప్రపంచ విషయముల యందు శ్రద్ధజూపక, కేవల పరమార్థమునే ధ్యేయముగ పెట్టుకొనవలయునని చెప్పగావిని సంతృప్తుడనగు చుండెడి వాడను.

తరువాత నా వైద్య విద్యలో లభించిన శారీర శాస్త్ర విజ్ఞానము నా కచ్చెరువు గలిగించినది. శరీరమున స్వేద, మల, మూత్రములున్నను, విసర్జింపబడవలసిన వీటిని, యితర స్వచ్ఛదాతువులతో మిళితము గాకుండ విడిపరచి, యే కోశమున నా మలమును భద్రపరచి, వాటిని విసర్జించు ప్రక్రియలు నరముల కూటములకు సమకూర్చుట గమనించగా ఈ శరీర నిర్మాణమెంతటి మేధావి సంకల్పించినదోనని ఉత్తే జితుడనగు చుండెడివాడను. ఇట్లే సూక్ష్మరూపియగు మనసు నకును రాగద్వేష కామక్రోధాది మలములున్నవి. వాటిని తొలగించుకొని చిత్తశుద్ధి పొందుటకు సాధనలు జేసిన, ఆ చిత్త మతీంద్రియ శక్తులనొంది ఘనకార్యముల సాధింప ననువగుచున్నదని గ్రహించితిని. ఈ శరీరమే లేకున్న ఆ మనస్సునకు ఆలంబనమేది? మనస్సే లేనియెడల సాధింపదగిన దేమున్నది.? వైద్యవిద్యార్థి దశయందు శవచ్ఛేదనము చేయుచూ శారీర శాస్త్రమును చదువుచున్నపుడు; యోచించ గలవారికి, సమష్టిరూపమగు నీభౌతిక ప్రపంచ రచన ఎంత భావోత్తేజకముగ నుండునో ఈ వ్యష్టిభౌతిక శరీరరచన కూడ

అంతకు పది యేండ్లు మున్నుగా నిర్మాత రచనా నైపుణ్యమును స్ఫురింపజేసి, మెదడును చైతన్య కిరణములతో ప్రభావితము చేయుచుండెడిది. జ్ఞాతమున కాధారమగు అజ్ఞాతతత్త్వమొకటి యుండి యుండవలెనని స్ఫురింప జేయుచుండెడిది. ఈ విధమగు ఉత్తేజము, ఒకనది కట్టలో నేర్పడిన ఛిద్రము నీటికి బాట గల్పించినయట్లు, ఆలోచనా స్రవంతి కొక బాట కల్పించినది. నది గట్టులోని ఛిద్రము, నీటిబాటచే గండిబడి నట్లు, ఆలోచనాంబువు ప్రసరించి గండినుండిగలుగు ప్రవాహ రూపముగ పరిణమించినది. ఐనను, బోధకులుచెప్పు బ్రహ్మ సత్యం, జగన్మిథ్య, తత్త్వమసి పదముల భావములు హృదయంగమములు గాలేదు. తత్త్వశాస్త్ర గ్రంథములు (కొన్ని తెలుగునకొన్ని ఆంగ్లమున) తెప్పించిస్వయంకృషితో, పూర్వాపరసమన్వయముతో విమర్శాత్మకముగ చదివి సమీక్షించుచుండెడివాడను గానిమనస్సుకు సమాధాన ప్రాప్తికలుగలేదు.

జీవితమున **32** వ మైలురాయి జేరునప్పటికి ఉద్యోగరీత్యా నందివెలుగు గ్రామము జేర అచ్చట శ్రీ మున్నంగి పున్నయ్య పంతులవారి పరిచయ భాగ్యము గలిగినది. వారి పారమార్థిక శక్తిప్రభావముచే ఆ పరిచయము గురుశిష్య రూపముగ పరిణమించినది. అంతేవాసుడ నగునంతవరకు వర్ధిల్లినది. నాలుగు భాషలయందు (సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల, హిందీ)తత్త్వశాస్త్రమునందునిష్ణాతులు, అనుష్ఠానవేదాంతులు అగు శ్రీపంతులువారు తెలిపిన విషయములు దూరదర్శనితో

జూపినట్టుచూపు సమయముల, వారియందు ఆదిశంకరుల దర్శించు చుండెడివాడను. తరువాత మూడు సంవత్సరముల పంట మూట గట్టుకుని, ఆ గ్రామము విడచి పంతులుగారి సాహచర్యమునకు దూరముగా వలసివచ్చెను.

చివరకు 70 వ మైలురాయి చేరునప్పటికి స్వస్థలముగు తెనాలి పట్టణము చేరితిని. ఉద్యోగమునకే గాక వైద్య వృత్తికిని స్వస్తిచెప్పితిని. ఇందుచే గణనీయమగు నంతకాలము తత్త్వశాస్త్ర పఠనమునకే వినియోగింప నవకాశము కలిగినది. ఇచ్చట మా పొరుగు గృహస్తు, వృత్తిచే అడ్వకేటు, పార మార్థిక విషయముల స్వతంత్ర భావములతో సమన్వయించు కుని విషయగ్రహణముజేయు మేధావి, ఆంగ్లమున అమృత ప్రాయముగ నెలయేటి ప్రవాహ సదృశముగ ప్రసంగించి విషయముల విమర్శనాత్మకముగ చర్చించి నవ్యదృక్పథముల అంచులు గోచరించునట్లు వివరింప సమర్థులునగు శ్రీ రూపాకుల రామకృష్ణయ్యగారి పరిచయ భాగ్యము గలిగినది. ఆయన ఒకరోజు దక్షిణామూర్తి స్తోత్రమును యెప్పుడైన జూచి యున్నారా? యని యడిగెను. పుస్తకమున్నది యిచ్చెదను చూచెదననీ చెప్పి 20 సం॥ క్రిందట కొని పెట్టెలో పెట్టిన పుస్తకమునకు వెలుగు జూపించితిని. ఆ పుస్తకమునందలి గూఢముగ నున్న భావములను సిద్ధాంతములను ప్రాకవిశ్చిమ తత్త్వశాస్త్ర పరిధులవరకు ప్రసరించి చూచితిని. ఆసక్తి

అతిశయించినది. మననము పెంపొందినది. ఆ దివ్యభావముల చింతనయందే నిమగ్నుడనైతిని. గోష్ఠికవకాశము లభించి నప్పుడు శ్రీరామకృష్ణయ్యగారు 2000 సం॥ పూర్వమే, ఆధునిక పాశ్చాత్య తత్త్వవిజ్ఞాన పరిధులు విస్తృతముగాక ముందే, బహుసూక్ష్మమగు తత్త్వభావములు శ్రీశంకరులకు స్ఫురించినవని, ఆయన ప్రాగ్దేశజ్యోతియనియు ప్రస్తుతించి ఆజ్యోతి వెలుగునందే మనము గమనము జేయవలసియున్న దని ప్రబోధించుచుండెడివారు. ఆ ప్రబోధఫలితమే యీ మననభావ సంపుటి రూపమగు వివరణ. నా యొనర్చిన కృషితో నా దృక్కోణము నుండి జేసిన విషయగ్రహణాంశ ములే పొందుపరచబడి, చదువరుల మననమునకు సమర్పించ బడినవి. నేను పండితుడనుగాను. కేవల జిజ్ఞాసువును. శ్లోకము లకు టీక పండిత ముఖమున గ్రహించి అన్వయము జేసికొని, తాత్త్వికాంశముల గ్రహించితిని. ప్రజాసామాన్యమునకు తత్త్వశాస్త్రమునందు అభిరుచి గలిగించి వైదిక వాఙ్మయ పఠనమునకు ప్రోత్సహించుటే నా ఆశయము. కనుక ఇందలి విషయములను ఒక జిజ్ఞాసువు యొక్క ఉజ్జ్వల మనన భావ ములుగ పరిగణింపవలయునని — మనన పూర్వకముగనుక నే ఇందు ఘటించిన పునరుక్తి ప్రయోజనకారియనియు విన్న వించుచున్నాను.

నా గురువులు శాస్త్రప్రతిపాదిత విషయముల యథా తథముగ బోధించిరి. వివరణయందలి భావములు స్వీయ

స్వతంత్ర కల్పనా (Imagination) సంపత్తి యుక్తములు. వాటిని ప్రస్ఫుటము జేయుట యందు భంగిభేదము (Difference in the mode of presentation) గన్పించక పోదు. గమనించునో — అట్టిది మీ కంగీకారయోగ్య మగు నెడల నా భావముల నాఘ్రాణము జేసికొని సహజముగనే ధన్యుడనగుదును. కానిచో, మీ విమర్శోత్తుంగ తరంగములచే క్షాళితము జేసికొని ధన్యతనాహ్వాతము జేసికొని తరింతును. సహృదయముతో చదువరులు జేయు సూచనలు నా యభ్యుదయమునకు, పునర్ముద్రణకు, ఇతర రచనల ప్రచురణకు దోహదము జేయగలవని మీ ఆశీర్వచనముల నభిలషించుచున్నాను.

తెనాలి
8-2-89

నమస్తే
విజయ గోపాలరావు

Namama Veda Mataram

Sri Sri Sri

# Jagadguru Pushpagiri Mahasamstanam

**PUSHPAGIRI : : Cuddapah Dt.**

Office :
Bellam Mandi Street
Cuddapah.

Camp : పొన్నూరు
Date : 28-9-1976

శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్యులవారు :

అస్మదత్యంత ప్రియశిష్యులైన శ్రీ లక్కరాజు విజయ గోపాలరావుగారికి వ్రాయించియిచ్చిన నారాయణ స్మరణ పత్రిక : అనన్తరం —

మీరు వ్రాసివినిపించిన శ్రీదక్షిణామూర్తిస్తోత్రమునకు ఆంధ్ర వివరణమును మీ ముఖమునుండియే స్థాలీపులాకముగ వింటిమి. ఈ స్తోత్రమునందలి మొదటి శ్లోకము "మౌన వ్యాఖ్యాప్రకటిత పరబ్రహ్మతత్త్వం" మంగళాచరణరూపమున బాగుగ వివరింపబడినది. అందలి "ఆచార్యేంద్రం" "కర కలిత చిన్ముద్ర" అనుపదములు సాభిప్రాయములు, అందలి గంభీరార్థములు, విపులముగ వివరింపబడినవి. ఇట్లే స్తోత్రము నందలి ప్రతిశ్లోకమునందుగల గంభీరార్థ ప్రతిపాదకములగు

రెండుమూడు పదములను ఎన్నికజేసి వివరించుట పాఠక లోకమునకు మార్గదర్శకమగును.

వీరు వేదాన్తాది శాస్త్రములను ప్రత్యేకించి గురు ముఖమున సాకల్యముగ నభ్యసించకపోయినను, తమ సహజ ప్రతిభచే, పండితలోకమునకు తాను పండితుడను భావము కల్పింపజాలినట్లుగ, విషయవితరణ జరిగినది. వారివాగ్ధాటి అట్టిది. సమయోచిత శాస్త్రీయపరిభాషలును అట్లే దొరలి వచ్చినవి. జైనాది మతస్వరూప స్వభావములను వివరించి అద్వైతశాస్త్రముయొక్క ప్రధానలక్ష్యమును తమ ధ్యేయముగ నిరూపించుకొనిరి. కనుకనే అద్వైతసిద్ధాంతము వారికి అనుభవసిద్ధమైనది.

ఏ వృత్తియందున్నను, ఏ వేషభాషలతో నున్నను, వీరిలక్ష్య మద్వైతమునందే స్థిరపడినది అని చెప్పవచ్చును. వీరు తొలివాక్యములయందు తమ స్వరూప స్వభావములను వివరించుచు, సామాన్య ప్రజానీకమునకు సుబోధకమగునట్లు వివరణ వ్రాయబూనితినని చెప్పుకొనిరి. ఐనను దేహాలీవత్తి దీపన్యాయమున, సర్వలోకోపకారమగునట్లు ఉదాత్తముగనే వ్రాసిరి. వీరి మాయావాదనిరూపణము, గుణత్రయ స్వరూప వివరణము ఆసక్తిజనకముగ శ్రద్ధతో పరిశీలింప సౌభాగ్యము లుగనున్నవి.

నారాయణ స్మరణమ్ ॥

— శ్రీ విద్యానృసింహ భారతీస్వామినః

# అభిజ్ఞుల అభిప్రాయములు

**K. L. N. SANSKRIT COLLEGE**

Sri S. RAMAKOTI SASTRI
*Principal*
Member of Academic Council
Andhra University.

Tenali
D/ 15-12-74

శ్రీ దక్షిణామూర్తి స్తోత్రము వేదాన్తశాస్త్ర ప్రకరణగ్రంథము. ఇది సంస్కృతమున శ్రీ శఙ్కర భగవత్పాదులచే రచింపబడినది. ఉపనిషత్సారము యిందు సంగృహీతము, భాష్యప్రవచన గురునమస్కార సందర్భమున శ్రీ దక్షిణామూర్తిస్తోత్ర పఠనము సంప్రదాయమునకలదు. వివేక, వైరాగ్య, శమదమాది సంపన్నులగు ముముక్షువులకు జ్ఞానోపదేశము చేయనెంచి యవతరించిన పరమేశ్వరుడే శ్రీ దక్షిణామూర్తి. ఇట్టి గురుమూర్తిని స్తుతించి శ్రీ శంకరులు జ్ఞానప్రాప్తికి మార్గదర్శకులైరి.

ఈ స్తోత్రమునకు వివరణమును శ్రీ L. V. గోపాలరావు L.I.M. గారు జిజ్ఞాసు జనోపయోగకరముగా ఆంధ్రభాషలో రచించిరి. ఈ గ్రంథమున హృదయంగమములైన భావములు విశదీకరింపబడినవి. శ్రీ దక్షిణామూర్తి మౌనవ్యాఖ్యలోగల విశేషము, పరమేశ్వరమాయాసృష్టి, త్రిగుణ స్వరూపస్వభావములు, వివర్తవాదము, ఆత్మానుస్మృతి, నిర్గుణస్థితి చక్కగా వివరింపబడినవి. అక్కడక్కడ బోధసౌకర్యమునకై, శైవ, శాక్త సంప్రదాయ విషయముల గ్రహించినను, శాఙ్కరాద్వైతమే

పరమ సిద్ధాంతముగా ప్రతిపాదింపబడినది. శ్రీ గోపాలరావుగారు ఫల శ్రుతియందు, సర్వాత్మభావము, ఈశ్వరత్వము, అష్టమూర్త్యుపాసన ఫలమని వివరించుచు "సిద్ధేః తత్పునరష్టధా పరిణతమ్" నుదానికి అష్ట సిద్ధుల పరముగగాక మరియొకవిధముగా వ్యాఖ్యానొనర్చి యొకకొత్తవెలుగు నిచ్చిరి. మూఢాచారభేషణముల నిరసించుచు, జిజ్ఞాసువుగా సద్గ్రంథపఠన మొనర్చి, మహానుభావుల హృదయభావముల నాకళింపుజేసికొని పరమేశ్వ రానుగ్రహముతో మానవులు కృతార్థులుకావలయునని బోధించిరి.

ఆధునిక విజ్ఞానముతో విలసిల్లుటచే ఈ గ్రంథము యువకవిద్యార్థి లోకముచేకూడ పఠనార్హము. ఆధ్యాత్మవిద్యలో పరిశ్రమమొనర్చి, జిజ్ఞా సువులకు ఉపయోగకరముగ శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమును ఆంధ్ర భాషలో వివరణమొనర్చిన శ్రీ L. V. గోపాలరావుగారికి పరమేశ్వరుడగు శ్రీ దక్షిణామూర్తి గురుదేవుడు, చిరాయురారోగ్యముల ప్రసాదించి ఇంకను ఇట్టి తెలుగు ఆధ్యాత్మగ్రంథముల వెలయింప ననుగ్రహించుగాక.

—(Sd) సూరి రామకోటిశాస్త్రి

తెనాలి 15-12-75

# బ్రహ్మశ్రీ హరి సాంబశివశాస్త్రి M. A. గారి సమీక్ష

(భారతీనిరుక్తి గ్రంథకర్తలగు హరిసోదరులలోనివారు)

శ్రీ దక్షిణామూర్తి స్తోత్రము అద్వైతతత్త్వ జిజ్ఞాసువులకును సాధక లోకమునకును శ్రీ శంకరభగవత్పాదు లనుగ్రహించిన దివ్యస్తోత్ర కుసుమమాలిక. దీనిని కంఠమున ధరించని సాధకలోకముగాని, దీని దివ్యపరిమళముచే పరవశముచెందని రసజ్ఞులుగాని, సామాన్యముగ నుండరు. అట్లు పరవశించినవారిలో శ్రీ డా॥ గోపాలరావుగారొకరు. వీరు వృత్తిచే వైద్యులై — "ప్రథమోదైవ్యో భిషక్" -- అని శ్రుతులయందు కీర్తింపబడెడి మహావైద్యుడగు మహావైద్యుని మరువక, జిజ్ఞాసులై, విరామసమయములందా మహావైద్య పరమేశ్వరతత్త్వమును బరిశీలించుచు చేసిన కృషిఫలితమే వీరి యీ యాంధ్ర వివరణము.

శ్రీ దక్షిణామూర్తి దేవుని మౌనవ్యాఖ్యయొక్క వివరణమే యీ దక్షిణామూర్తిస్తోత్రము -- అనుచూ వీరి యాంధ్రవివరణము సాగినది. ఇది యెంతయో సమంజసముగనున్నది. యోగశాస్త్ర ప్రసిద్ధములైన, యమ-నియమాద్యంగములను, నిదిధ్యాసమున కంగములుగ శ్రీ శంకరులు వివరించిరి. అందు మౌనమొకటి. మౌనమనగా మాట్లాడకుండుట — వాఙ్మయమము-అనిలోకమున ప్రసిద్ధము. వాఙ్మయమముయొక్క అంతరార్థము, పరమప్రయోజనము శ్రీ శంకరులచే అపరోక్షానుభూతియందెట్లు వివరింపబడినది.

1. యతోవాచోని వర్తన్తే అప్రాప్యమనసాసహ ।
యన్మౌనం యోగిభిర్గమ్యం తద్భజే త్సర్వదాబుధః॥

2. వాచో యస్మాన్నివర్తన్తే తద్వక్తుం కేనశక్యతే ।
ప్రపంచో యదివక్తవ్యః సోఽపి శబ్దవివర్జితః ॥
3. ఇతివా తద్భవేన్మౌనం సతాం సహజసంజ్ఞితమ్ ।
గిరాం మౌనం తు బాలానాం ప్రయుక్తం బ్రహ్మవాదిభిః ॥

(అపరోక్షానుభూతి శ్లో 107 – 109)

వాఙ్మనసులు సహప్రవృత్తిగలవి. ఇవి ద్రవ్యాది సవికల్పవస్తువులను మాత్రమే బోధించును. అద్వయాఖండానందరూపమగు పరబ్రహ్మనిర్వికల్పము. కాన, వాఙ్మనసులు సైతము దేనిని ప్రకాశింపజేయనేరక మరలుచున్నవో అదియే బ్రహ్మము. మరియు ప్రపంచము మాయావిలసితమై సదసదతీతమై, యనిర్వాచ్యమగుటచే వాక్కులు ప్రపంచమునుగూడ ప్రకాశింపజేయనేరక మౌనమువహించును. ఇట్టి ప్రపంచముగూడ శబ్దవర్జితమే యగుటజేసి యీ వాఙ్మనముగూడ మౌనమగును. అట్టి మౌనమును వర్ణించుట యెట్లు సాధ్యము ? అట్టి మౌనమును మౌనముతోనే వ్యాఖ్యానించుట మహాత్ముల లక్షణము. శ్రీ దక్షిణామూర్తిదేవుని మౌనవ్యాఖ్యయు అట్టిదే. అట్టి మౌనవ్యాఖ్య వివృత పరబ్రహ్మతత్త్వ స్వరూపవ్యాఖ్యయే శ్రీ దక్షిణామూర్తిస్తోత్రము,

శ్రీ గోపాలరావుగారు సామాన్య పాఠకులకుగూడ సుబోధకమగు రీతిని వివరణముజేయ యత్నించి చాలవరకు కృతార్థులైరి. అద్వైతతత్త్వశాస్త్ర మతిగంభీరము. మననముజేయుకొలది జిజ్ఞాసువుల హృదయములను పులకితములొనర్చుచు, అగాధపులోతులకు గొంపోయి పరవశింపజేయుచుండును. వివిధవాదములతోడి పరిచయములేనిది కార్యకారణభావాదిస్వరూపము సుబోధముగాదు. అందుచే పాఠకుల సౌకర్యార్థము ఆరంభవాదము, పరిణామవాదము, మున్నగువాని సిద్ధాంతమాత్రముగ

సూచించినారు. వీనిని సౌకర్యముగ వివరింపబూనుచో మరల నావివరణ మొక గ్రంథమేయగును.

వీరు వృత్తిచే వైద్యులగుటచే ప్రాచ్యపాశ్చాత్య వైద్యవిజ్ఞాన రహస్యములను, ఆధునిక భౌతికవిజ్ఞాన రహస్యములను, ప్రాచీన భారతీయ సంప్రదాయ విజ్ఞానరహస్యములతో, తులనాత్మక పరిశీలనముచేసి "భౌతికశక్తులకంటె విలక్షణమై తన్నియామక – ఈశ్వరాత్మక చేతన శక్తితత్త్వమొకటి గలదని" తమ యనుభవముద్వారా ఋజువుచేసికొని, నమ్మి, జిజ్ఞాసులై, సంప్రదాయ విజ్ఞానరహస్యముల ప్రోగుజేసికొనిన సాధకులు. వీరి యీ పరిశీలనము, వీరి వివరణమునం దడుగడుగున గాన్పించును.

ఉ॥ సత్యానృత మిథునభావమే లోకవ్యవహారహేతువు. అంతఃకరణములతో తాదాత్మ్యమునొందిన చేతనతత్త్వమే జీవుడు. చేతనతత్త్వము సత్యము; తద్భిన్నముజడము, అసత్యము. ఇట పరస్పర విరుద్ధములైన జడచేతనములకు మిథునభావము – తాదాత్మ్యముగలిగి యొకేవస్తువుగ భాసించుటెట్లు ? ఈ శంకకు పరిహారముగా తప్త – అయోగోళకాది దృష్టాంతములు శాస్త్రమున నీయబడినవి. వీరు Polarity సూత్రముతో సమన్వయపఱచి పరస్పర విరుద్ధధర్మములుగల రెండువస్తువు లొకే వస్తువుగ భాసించుట యుక్త్యనుభవసిద్ధమేననిరి. అందుచే ఇది సర్వాత్మనా సత్యానృత మిథునభావతత్త్వమును దర్శింపజేయు దృష్టాంతముకాదు. అయినను భిన్నధర్మములుగల వస్తువులొకేవస్తువుగా భాసించుటయును తత్త్వమును గ్రహించుటకు కొంతవరకిది దోహదకారి. అందుచే అద్వైత శాస్త్రమున వివరింపబడిన అనిర్వచనీయస్థితి "a Simultaneuos Is" and "Is not" రూపముగా గ్రహింపనగును –– అని వివరించిరని గ్రహింపనగును.

ఆట్లే సాంఖ్యాభిమతప్రకృతి స్వరూపమును వివరించుచు – సత్వరజస్తమోగుణములు, జల-గుడాది పదార్థములయందలి శైత్యమాధుర్యాది గుణములవంటివిగావు. They are univalent elemental ulti-mates (ie) ultimate units of panchabhootas, which in their avyakta or potential state are together known as prakruti or pradhana and in their kinetic State mani-fest as matter. అని యీ రీతిగా ప్రాచీన సంప్రదాయముల నవగాహము చేసికొనుటకు ఆధునిక భౌతిక విజ్ఞానమెట్లు తోడ్పడగలదో వివరించుచు నట నట క్రొత్తమలుపులు త్రిప్పిరి. భౌతికవిజ్ఞాన రహస్యవేత్తలీ విషయములను నెక్కుడు పరిశీలింపగలరు. ఇట్లు క్రొత్తందనము సంతరించుకొనిన వీరి యీ యాంధ్రవివరణము ఆంధ్రులకు లోవెలుగు బాటల ప్రసాదించుగాక !

శ్రీగురుః శంకరః సాక్షాత్ మౌనవ్యాఖ్యావిశారదః ।
గోపాలరాయం తస్మాత్ మౌనవ్యాఖ్యాకృతక్రమమ్ ॥

శోధనగృహ
తెనాలి
5-4-76

(Sd) హా. కి. సాంబశివశాస్త్రి

శ్రీ దక్షిణామూర్తి సద్గురుపరబ్రహ్మణేనమః ।

బ్రాడీపేట.
గుంటూరు

మున్నంగి పున్నయ్య పంతులు
తత్త్వవిజ్ఞాన భిక్షు

23-8-76

# పరిచయము మరియు శుభాశంసనము

డాక్టర్ లక్కరాజు విజయగోపాలరాయ శర్మగారు రచించిన శ్రీ దక్షిణామూర్తిస్తోత్రపు టాంధ్రవ్యాఖ్యానమును సమీక్షించితిని. ఇది విస్తృతము విశదమునై యున్నది.

శ్రీ శంకరభగవత్పాదాచార్య విరచిత వేదాంత ప్రకరణ గ్రంథములలో ఈ స్తోత్రము సారవత్తమమైనదని ప్రాజ్ఞమహాశయుల పరమాశయమై యున్నది. వేదాంత క్షీరసాగరమునుండి ఆవిర్భవించిన అమృతమునకు ఈస్తోత్రము కలశమువంటిదనియు, శ్రీస్వయంప్రకాశయతీంద్రులు భావించిరి. ఆత్మతత్త్వము సర్వప్రాణి హృదంతర్గత సాక్షిభూత ప్రత్యక్పరమేశ్వరుడే యనియు, ఈతడే ఆచార్యరూపమున స్వాత్మేశ్వర ప్రత్యభిజ్ఞానమును మనకు ప్రసాదించుననియు, ఈ స్తోత్రవ్యాజమున శ్రీ శంకర జగదాచార్యులు ఈ పరమార్థ ప్రబోధమును జిజ్ఞాసులోకమున కందించిరనియు శ్రీ సురేశ్వరాచార్యులు సంభావించిరి. ఈ స్తోత్ర వ్యాఖ్యాతలలో శ్రీ స్వయంప్రకాశ యతీంద్రులు, శ్రీ సురేశ్వరాచార్యులున్నూ ప్రముఖులు.

శ్రీ గోపాలరాయ భిషగ్వరుల ఆంధ్రవ్యాఖ్య ప్రోక్తతత్త్వభావ సరణికి అనుగుణముగనే సాగినది. వీరు పెక్కువత్సరముల క్రితము నాయొద్ద యత్కించిత్ తత్త్వవిచార వ్యాసంగమును గావించుకొనిరి.

తదుపరి ఈ విజ్ఞానమును వీరు సంవర్ధనము చేసికొనినారని, వీరి ప్రస్తుత వ్యాఖ్యాగ్రంథమువలన నేను గ్రహించి ముదమొందితిని.

"భిషజే భవరోగిణామ్" అని శ్రీదక్షిణామూర్తి భవరోగ భిషక్కుగా నెన్నబడిరి గదా! ప్రస్తుత వ్యాఖ్యాతృభిషక్కు ఈ మహాధన్వంతరిని ఆశ్రయించు టెంతయు సమంజసమై యున్నది. వాతపిత్తకఫదోషసంభృతములగు శారీరవ్యాధులు అవాంతరములేగాని, ప్రాథమిక రోగమువ్మాత్రము శరీరోత్పత్తియే గదా! అనగా జన్మయే మూలవ్యాధి, లేక మాయాశక్తి సంజనిత భవరోగము. ఏతన్నిర్మూలనమే సర్వులకును ఆవశ్యకము.

"మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినం తు మహేశ్వరమ్" "మాయాశక్తివిలాస -- కల్పితమహావ్యామోహ సంహారిణే" - "మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తితే" - అని చెప్పబడిన చొప్పున మాయావియగు పరమేశ్వర ప్రపత్తివలనగాని, మనకు మాయానివృత్తి కానేరదు.

పరమేశ్వర ప్రపత్తి, మాయాస్వరూప స్వభావములను బాగుగా విచారించి గ్రహించిననేగాని, ఘటిల్లనేరదు. మాయ యనగా లేనిదానిని ఉన్నట్లు కనబరచెడి పారమేశ్వరిశక్తియని భావము. "మాయాకల్పిత దేశకాలకలనా" - "స్వప్నే జాగ్రతివా మాయాపరిభ్రామితః" అనియు ఈ స్తోత్రమునందు మాయాశక్తి బాగుగనే సూచింపబడినది. "శక్తి శక్తిమతోరభేదః" అనున్యాయమున, ఈ మాయాశక్తి పరమేశ్వర స్వరూపమైనదేగాని, విభిన్నతత్త్వ మెంతమాత్రము కానేరదు, ఈ విచారము నీ వ్యాఖ్యాత బాగుగనేఉపపాదించిరి. శైవ శాక్తేయ ప్రక్రియలందు ఈశ్వరావినాభూతమైనదిగా ప్రతిపాదింపబడెడి పరాపరశక్తిని విచారించి అద్వైత వేదాన్తిమతమున పరమేశ్వర స్వరూపాభిన్నమైనదే యని

నిరూపింపబడినది. "నాఽన్యత్కించన విద్యతే విమృశతాం యస్మాత్పరస్మా ద్విభోః"– అని చెప్పబడిన భావమిదియే, కాపిలసాంఖ్యులయొక్క స్వతంత్ర ప్రకృతివాదముగూడ చర్చింపబడి నిరసింపబడినది.

వేదాన్తిమతమున మాయావిచారమును మాయా-మిథ్యాత్వవాదమనియు, అధ్యారోపవాదమనియు పరిభాషింతురు. ఇందు అధిష్ఠానాధ్యారోపతత్త్వ విమర్శప్రముఖమైనది. అధిష్ఠానతత్త్వము ప్రత్యక్పరమేశ్వరుడనియు, అధ్యారోపతత్త్వము జీవేశ్వర జగదాత్మక త్రిపుటియనియు ప్రతిపాదింపబడును. త్రిపుటియందలి ఈశ్వరుడు అధిదైవికుడు, జీవభిన్నుడు. ఈ త్రిపుటి యంతయు మాయాకల్పితమేగాన, మిథ్యాభూతమైనదే; అధిష్ఠానభూత ప్రత్యక్పరమేశ్వరుడే పరమార్థతత్త్వము. మాయావాదము నంగీకరింపని ద్వైతవాదుల తత్త్వప్రక్రియలను నిరసించినగాని, వేదాంతియొక్క అద్వైత బ్రహ్మవాదము స్థిరపడదుగాన, ఈ వ్యాఖ్యాత పరపక్షనిరాసమునుగూడా పొందుపరచినారు. "స్వపక్షసాధన పరపక్షోపాలంభాభ్యాం వస్తునిర్ణయః" అని ఈ విషయమే చెప్పబడినది. ఇచట ద్వైతులనగా శ్రీ శంకరీయులు గానట్టి శ్రీరామానుజీయ,మాధ్వ, వాల్లభ, నింబార్క, గౌరాంగాది సాంప్రదాయులందరు గ్రాహ్యులు.

పరపక్షోపాలంభమునకే ఈ వ్యాఖ్యాత జగద్విషయమున ఆరంభవాద పరిణామవాదములను, జీవవిషయమున అణుపరిణామ మధ్యమ పరిణామవాదములను ఈశ్వరవిషయమున జాతీశ్వరవాదము, నియతేశ్వర వాదము ఉభయలింగివాదము తటస్థేశ్వరవాదము ఉభయకారణవాదము విమర్శించిరి. జీవవిషయమున ఆభాసవాదము, అవచ్ఛేదవాదము ప్రతిబింబ వాదము అను ప్రక్రియాభేదములు విమతస్థులైన ద్వైతులవి కావు, స్వమతప్రక్రియలే.

ఈ వాదభేదములన్నియును జిజ్ఞాసువులయొక్క మేధాసంపత్తి రుచిభేదముల ననుసరించి యేర్పడెడి అధికారి తారతమ్యమునుబట్టి సర్వజ్ఞులగు మునులచే లోకకల్యాణమునకై వ్యవస్థచేయబడినవేగాని రాగద్వేషప్రయుక్తములు గావు. "నిర్విశేషం పరంబ్రహ్మ సాక్షాత్కర్తు మనీశ్వరాః। యే మన్దాస్తేఽనుకంప్యంతే సవిశేష నిరూపణైః॥" -- అని ఈ నానావాదోపపత్తి నిర్దేశింపబడినది శుద్ధాద్వైత ప్రస్థానము నందుకొనజాలునంతదనుక, శేషించిన మార్గములన్నియును తత్తదధికారులకు ఉపకారములే. "ఆరుహ్యభూమి మధరాం ఇతరాధిరోఢుం। శక్నోతి శాస్త్రమపి కారణ కార్యభావమ్"-- అని చెప్పబడినట్లు క్రిందిమెట్టు నెక్కగదా క్రమశః పైపైమెట్ల నెక్కవలసియుందుము. అస్తు.

పర్యవసానమేమన-- ఈ వ్యాఖ్యాత తన రచనను నిపుణముగనే నిర్వహించిరి. ఆంగ్లభాషా పరిచయముగలవారై పాశ్చాత్య తత్వశాస్త్ర సంగతులు గూడ కొంత శ్రవణము చేసియుండుటవలన. అవసరమైనచోట్ల వీరి పరిభాషనుగూడా తులనదృష్ట్యా వ్యాఖ్యాత సూచించినారు. "యస్యదేవే పరాభక్తిర్యథా దేవే తథా గురౌ। తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః॥" అనినరీత్యా వీరికి ఈశ్వరభక్తి, గురుభక్తియు తుల్యముగా నమరియున్నందున, తత్త్వవిద్యయందు చక్కని ప్రతిభానము సమకూరినది. 73 సం।లు వయసున, సమీచీనముముక్ష గలవారై వీరు స్వోద్ధారమునకయ్యే ప్రస్తుత స్తోత్రార్థచింతనమును గావించుకొనిరి. తమవంటి జిజ్ఞాసు సోదరులకుగూడ, నీ విజ్ఞాన ముపకరించునుగాక యనెడి మైత్రభావముతో దీనిని ముద్రాపణము గావింపనున్నారు.

శ్రీ గురుదక్షిణామూర్తి పరమాత్మ ఏతద్వ్యాఖ్యారూప కైంకర్యమును వాత్సల్యముతో స్వీకరించి, గ్రంథమునకు సముచితప్రచారము ననుగ్రహించుటతోబాటు, వ్యాఖ్యాతకు సర్వాభీష్టసిద్ధిని ప్రసాదించుగాక ।

# శ్రీ గొల్లపూడి గోపాలకృష్ణమూర్తిగారు

ఆస్థానవిద్వాన్, శ్రీ శృంగేరి శారదాపీఠము, శృంగేరి.

---

శ్రీ మేధా దక్షిణామూర్తి సద్గురు ప్రత్యగీశ్వరాద్వైతాయ నమః॥

బ్రహ్మశ్రీ వేదమూర్తులు భిషగ్వరేణ్యులు లక్కరాజు విజయ గోపాలరావుగారు భగవదనుగ్రహావిష్టులై శ్రీ ప. ప. సచ్చిదానందేంద్ర సరస్వతియను సర్వతంత్ర స్వతంత్రావతారుల శిష్యులలో చూడామణియగు సర్వవేదాంత తత్త్వమీమాంసా పారంగతులు బ్రహ్మశ్రీ మున్నంగి పున్నయ్య పంతులుగారి నిరంతరానుగ్రహలబ్ధ దివ్యసాన్నిధ్యములో పునీతులై, పూర్ణాద్వైత శ్రవణముచే భరితులై, ఇతరాంగ్ల మంత్రశాస్త్రాది సంపుటీకరణముతో పరమాద్భుతముగా కాశ్మీరశైవ ప్రత్యభిజ్ఞారహస్య రస పరమళములతో శ్రీ దక్షిణామూర్తి గురుభగవానుని సర్వాత్మత్వమును బహువైదగ్ధ్యముతో నిర్వహించినారు—ఈమృదుమధుర భగవద్విచారమును సహృదయులు గురుభక్తులు ఆస్వాదించి ఆత్మైశ్వర్యాద్వైతరూపులు సర్వులు స్వాభావికముగానే అయిఉన్నారనే పూర్ణప్రత్యభిజ్ఞను ఈ గ్రంథ రాజము అనుగ్రహించగలదని నా అనుభవము. ఈ గ్రంథరచనచే వీరు సర్వుల అనుగ్రహపాత్రులగుచున్నారు.

ఇట్లు

(Sd) గొల్లపూడి గోపాలకృష్ణమూర్తిశాస్త్రి
ఆస్థానవిద్వాన్ - శ్రీ శృంగేరీ శారదాపీఠము,
శృంగేరి.

తెనాలి
12-12-76

ఓం తత్ సత్

కథాగానకళాప్రపూర్ణ

## పాతూరి మధుశాస్త్రిగారు, భట్టిప్రోలు.

శ్రీ లక్కరాజు విజయగోపాలరావుగారు తాము స్వయంగాచేసిన అసామాన్య మననఫలితంగా రచించి వెలువరించబోవు శ్రీ దక్షిణామూర్తి స్తోత్ర దర్శనమును వారేచదివి వినిపించగావిని చాలా సంతోషించాను. అందు అద్వితీయావ్యయ ఆత్మేశ్వరతత్త్వ ప్రతిపాదనము మిశ్రభాషా భూషితమై, నాకేకాదు, పాఠకులందరకు మనఃప్రసంగాంగములలో గమ్య స్థానాన్ని మాటిమాటికీ స్ఫురింపచేస్తూ ఆప్తకాములకు కలిగే మనఃశాంతిని కలుగచేస్తుంది. అది వీరిరచనాకౌశలము అనటం అతిశయోక్తికాదు. విషయము మానవజాతికే ఆవశ్యకమైనది. ఈ బోధ్య ప్రబంధమును విశ్వరూపముఖ తత్త్వవిదులెందరో రచించిరికదా, మరల నిబంధింపట మెందుకు అని యెవరైనా అనుకుంటే "దోషోన పునరుక్త్యాస్స్యాద్ భావదార్ఢ్య హితత్ఫలమ్" ఇట్టి ఆధ్యాత్మిక తత్త్వవిషయమున పునఃపునర్నిర్వచనము దోషముకాదు. భావము దృఢమగుట సంభవించి, పాఠకునకు సత్ఫలము కలుగుటయేగాక, పునరుక్తి శుభదాయకమే యగును.

ఏ కాలమున సమాజము ఏ యే విధమగు రచనచే తృప్తిచెందునో తదనుగుణముగా ఈశ్వరప్రేరణ జరిగి ఆ యా కాలసమాజమున రచనలైన సాహిత్యముకూడా అప్పటి యప్పటి విజ్ఞులద్వారా వెలువడుచుండ ననుట నిర్వివాదము.

శంకరభగవత్పాదు లవతరించునప్పటికి బౌద్ధసిద్ధాంతములు మిక్కిలిగా సమాజమున వ్యాప్తములై యున్నవి. అనుమాన ప్రమాణ మాధారముగా బహువిధములైన విప్రతిపత్తులు తలఎత్తి శాస్త్రములయందును హైందవ సంప్రదాయమునందును, వైముఖ్యమేర్పడి, శ్రద్ధాకల్పతరువు ప్రతివాదకంటకలతావృతమై త్రోవ మూతపడినపుడు శబ్ద (వేద) మే పరమప్రమాణముగా, కంటకములను, సిద్ధాంత ఖనిత్రములచే తెగజిమ్మి మానవసమాజము లక్ష్యమును సుఖకరముగ చేరుకొనగల విశాలమార్గ మేర్పరచుట స్వకీయావతార ఫలముగా సంకల్పించి నాల్గుదెసల పీఠముల నిల్పించి, నిరభ్యంతరమగు ముక్తిమార్గము నిర్మించి ప్రపంచ గురుపీఠముగా భారతమున కనారతఖ్యాతి చేకూర్చిరి. భగవత్పాదులు నిర్మించిన మార్గముంజేరుకొని ఆత్మానందభాగ్యము పొందుటకు ఈ శ్రీదక్షిణామూర్తి స్తోత్రము ఒక చక్కని దగ్గరత్రోవవంటిది. దీనియందు అనేక వాదములకు సమాధానములుండి ఈ సాహిత్యము గురుస్తోత్రరూపశాస్త్ర గౌరవము నందినది.

## వివాదములు:

ఏ కార్యము ఏ కారణమున సంభవించునో ఆ కార్య మాకారణమందేయుండును, లయమగును. మృత్తువలన సంభవించిన ఘటము మృత్తునందును, సువర్ణమువలన సంభవించిన అంగుళీయము సువర్ణమునందును లయమగును. ఆ ఘటమునకా మృత్తికయు, అంగుళీయమునకా సువర్ణము ఉపాదానకారణము. అట్లే జగము అణుసంయోగమువలన సంభవించినది. ఆ కార్యమునకది యుపాదానకారణమైనది. ఆ కార్యము తత్కారణాన్వితమైయున్నది. అంతేగాని ఇచట ఈశ్వరప్రసక్తి యెందుకు? "అని వైశేషికులు, న్యాయవాదులును త్రిగుణాత్మక ప్రధానమే జగత్కారణ"మని సాంఖ్యులును తమతమ సిద్ధాంతభేరీలు మ్రోయింపగా

ఆ మార్గ్రమోతలను అద్వితీయాత్మప్రతిపాదక శబ్దప్రమాణ సిద్ధాంతముతో ఆపించి. శాంతినిగూర్చి మౌనవ్యాఖ్యానముతోనే శశ్వత్సుఖ ప్రణాళిక నందించి, ఆకాలమునుండి ఇప్పటివరకేగాక భవిష్యద్యుగములకును, మార్పుజరుగని మార్గమునిర్మించినది శంకరభగవత్పాదులే. ఆ జగద్గురువు రచించిన శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమునకు చిరంజీవి డాక్టర్ శ్రీ లక్కరాజు విజయగోపాలరావుగారు వ్రాసిన వివరణము క్రొత్త వెలుగుతో భాసించుచున్నది. వీరు భట్టిప్రోలులో 10, 11 సంవత్స రములు వైద్యాలయాధికృతులై యున్నప్పుడు వీరియందు ఆధ్యాత్మ తత్వశ్రవణ కుతూహలము కలదని మాత్రమే గ్రహించుటయ్యెనుగాని, తు. చ లు తప్పకుండ సంప్రదాయానుసారము అప్పయాద్వితీయాత్మేశ్వర తత్వబోధక ప్రబంధ రచనానుకూలవచన సంస్కారశక్తి నిగూఢముగా నున్నట్లిపుడీ యాంధ్రవ్యాఖ్యానము విన్నపిదప "ఈశ్వరానుగ్రహాదేవ పుంసామద్వైతవాసనా" యను స్మృతికి వీరి యీరచన ఉదాహరణమైనదిగా తెల్లమైనది. వీరి రచనయందు బహువిధ విప్రతిపత్తులకు సమాధానములు విశదముగానున్నవి. ఇతోధికముగా తత్వానుభవము పొందుటకు వీరికి చిరతరాయురారోగ్య సుఖమేధాసంపద ఈశ్వరకృపవలన కలుగునట్లు సదాశివశక్తిని ప్రార్థించుచున్నాను. వీరి యీ రచితము పఠించువారుధన్యత నందెదరుగాక ;

భట్టిప్రోలు
20-3-77

(Sd). పాతూరి మధుశాస్త్రి

వ్యాకరణ వేదాన్తవిశారద
చిఱ్ఱావూరి అనన్తపద్మనాభశాస్త్రి
అగ్రహారం - పెలూరు,
ప. గో. జిల్లా A. P.

శ్రీ గురుగణేశ శారదాభ్యోనమః

## శ్రీ గురుదక్షిణామూర్త్యష్టక స్వీయమానసోల్లాసాంధ్ర వివరణాభిప్రాయము

శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులు జగద్గురువులు శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్యులవారు - ఉపనిషత్తులకు బ్రహ్మసూత్రములకు, భగవద్గీతలకు, భాష్యములను రచించిరి. సగుణ స్తోత్రములను, నిర్గుణబ్రహ్మ నిరూపణప్రకరణగ్రంథములను రచించిరి. వారిగ్రంథము లన్నింటిలో సగుణ నిర్గుణోభయ బ్రహ్మప్రతిపాదకమగు- శ్రీ దక్షిణామూర్తి స్వరూపమును బోధించు-అష్టకము గొప్పది. అది రత్నపేటిక. ఇందులో పరాభక్తి-బ్రహ్మజ్ఞానము-జీవబ్రహ్మైక్యానుభవము - కలుగుటకు-సర్వవేదాన్త రహస్యములను బోధించిరి. దీనికి "స్వీయమానసోల్లాసము" అను సంస్కృతవివరణమును-రచించిన గ్రంథకర్తలు-మహారాజశ్రీ లక్ష్మీ-రాజా విజయగోపాలరావుగారు. వీరు జ్యోతిషపరీక్షయందు ఉత్తీర్ణులయి వైద్యమందు సిద్ధహస్తులయి 50 సంవత్సరములు శారీరకారోగ్యసంపదను ప్రజలకు

కలిగించినారు. వీరు భవరోగవైద్యులుకూడ యగుటకు అనేక జన్మార్జిత బ్రహ్మవిచారణచే ఈ జన్మలో సహజముగా శుద్ధ బ్రహ్మవిద్యానుభవమునం దత్యంతానురక్తి కలిగినది. పరమహంస పరివ్రాజకాచార్యులు బ్రహ్మానందతీర్థులవారి శిష్యులగు అనంతరాం స్వాములవారి శిష్యులగు బ్ర॥ మున్నంగి పున్నయ్య పంతులుగారివద్ద కొంతకాలం శ్రవణంచేసి సంప్రదాయసిద్ధమగు వేదాన్తరహస్యములను - శ్రీవిద్యా సిద్ధాన్తరహస్యములను,న్యాయవైశేషిక యోగసంప్రదాయములను అనేకస్థలములలో నాంగ్లభాషా వాక్యములతో గూడ కొందఱు పాశ్చాత్యుల భావములను సులభశైలిలో ముముక్షువులకు, వేదాన్తానుభవముకలుగునటుల సహజపాండిత్యానుభవముచే 3 సంవత్సరములునిరంతరకృషిసలిపి, ఆంధ్రప్రజలకు నందజేసిరి. అనేకులు పండితప్రకాండులు విని ఆనందించిరి. ఇది పెద్దవివరణము. దీనిని విని నేనానందించితిని. గాన పండితులు ముముక్షువులయిన యితరులందఱు మననమునుచేసి వారి కృషిని సాఫల్యమొనర్చి ధన్యులగుదురు యనుగాక యని కోరుచున్నాను.

(Sd.) చిఱ్ఱావూరి అనన్తపద్మనాభశాస్త్రి

**Dr. K. RAVINDRA BABU, *M. S.,*** TENALI
Devi Nursing Home. 4-10-76

---

డాక్టరు గోపాలరావుగారు వైద్యవృత్తిలో గత దశాబ్దముగా నా సహచరులు. Medical Association Meetings లో వారి జ్ఞాన తృష్ణ, నిరంతర సందేహనివృత్తికొరకు పాటుపడే మేధస్సు, ఎప్పుడూ ఏదో ఒక కొత్తవిషయం తెలుసుకొనవలెనను కాంక్ష, అదివరకే తెలుసుకొన్న విజ్ఞానముతో ముడిపెట్టవలెననే సమన్వయచింతన, వైద్యవృత్తిని వృత్తిగాగాక జ్ఞానప్రసక్తిగా ఆరాధించే వయోవృద్ధుడైన సహచరునిగాను ఎరుగుదును. పైవాటికేగాక వయస్సుతో ముక్కవోవని మేధాపటిమకు, కలుషమాయని ఆలోచనాశక్తికి వయోనిమిత్తం లేకుండా నావంటివారితో కూడా ఆప్యాయంగా అరమరికలులేకుండా ప్రవర్తించగలిగిన స్నేహప్రవృత్తికి ఆయన అంటే అభిమానం, కించిదసూయకూడా నా హృదిలో స్థానం ఏర్పరచుకున్నవి —

అందరూ ఉద్యోగవిరమణచేసే వయస్సులో, వైద్యశాస్త్రంగురించి రోజూ 14 గంటలు కృషిజేసి చక్కనివ్రాతలో ఆయన వ్రాసిపెట్టుకొన్న వైద్యగ్రంథ సారాంశలుచూచి విస్తుపోయేవాడిని. ఏ విషయం చర్చకు వచ్చినప్పుడైనా చర్చలోపాల్గొనే ఆయన సర్వజ్ఞతకు రిచ్చపోయేవాడిని.

వైద్యం చదవటంకోసం, ధనార్జనకై నటుడై, ఆ నటనలో కూడా గొప్పపేరు సంపాదించినారని, స్త్రీ పురుష పాత్రలలో నవరసాలు ఒప్పించి నాటకరంగంలో ప్రకాశించినారనీ కొంతకాలంక్రితం ప్రభ వార

పత్రికలలో ప్రముఖనటులగురించిన వ్యాసాలలో ఒక వ్యాసం వీరిని గురించి వ్రాసినదాన్ని చదివాను.

గత రెండుమూడు సంవత్సరాలుగా వారు వేదాంతశాస్త్ర పఠనంలో నిమగ్నులై వున్నారనికూడా నాకుతెలుసు. నాటకరంగంలోనూ, తర్వాత వైద్యంలోనూ వారుచేసినకృషి, పొందిన ఫలితము, తెలిసికున్ననాకు వారు 70వ సంవత్సరములో వేదాంతశాస్త్రాధ్యయనం మొదలుపెట్టడం ఈమూడు సంవత్సరములలోనూ అనేక శాస్త్ర గ్రంథాలను ఔపాసనపట్టటము ఎరుగుదును. సహస్రమాస మానసకమలం దాదాపు పూర్తిగావికసించి భాసించుచున్నస్థితిలో వారు బహుతక్కువకాలంలో ఎక్కువగా మనస్సును శరీరాన్ని కష్టపెట్టి వేదాంత జ్ఞానార్జనలో మునిగిపోయారు.

గతవారంలో నేను వేమనపద్యాలపుస్తకం. ఓమార్ ఖయ్యాం "పానశాల" మాక్సిం గోర్కి జీవితచరిత్ర చదవటం జరిగింది. ఏదేశంలో నైనా, ఏ కాలంలోనైనా ఏ మతంలోనైనా ఏ మేధస్సులోనైనా కలిగే "ఆత్మజిజ్ఞాస" ఒకటిగానే కన్పించింది. మానవుడు మృగజీవితంమాని సంస్కారి అయినతరువాత కలిగిన ఈ జిజ్ఞాస ఆరాటపడే మనసుకు ఊరట కల్గించటం మనకుతెలుసు. మానవునిలో దానవత్వాన్ని, పశుత్వాన్ని తగ్గించి మానవత్వాన్ని పెంచేప్రయత్నంలో ఒక ముఖ్య భాగం "దేవుడు_మతము_ఆత్మ" -జిజ్ఞాస ఇత్యాదులు. ఈ ప్రయత్నం ఈ పద్ధతిలోకాకుండా, జ్ఞానసముపార్జనా పద్ధతిలో, దైవం, మతం, పేరు అవసరంలేకుండా మనిషిని 'మనిషి గా' మానవుని మహామానవునిగా చేసేప్రయత్నం అనాదిగా, బహుశా మొదటి ప్రయత్నంతోబాటే మొదలైనది. ఈ రెండుప్రయత్నాలుకూడా మనిషిని మానవునిగాను, ఉత్తమ మానవునిగాను తీర్చిదిద్దటానికి ఉపయోగించే సాధనలే. ఏ మార్గమైనా

లక్ష్యమొకటే. రెండుదారులలోనూ ఉత్తములు. అధములు ప్రయాణించారు. ప్రయాణించుతారుకూడ.

గోపాలరావుగారు తమ ఆధునిక పరిజ్ఞానానికి, వేదాంతశాస్త్ర పరిజ్ఞానానికి మధ్యకట్టిన వారధిలాంటి అందమైనహరివిల్లు ఈ పుస్తకమని నేననుకుంటున్నాను. ఆధ్యాత్మికచింతన ఉన్నవారు లేనివారుకూడా యీ "హరివిల్లును"ను పరికించి ఆనందిస్తారని ఆకాంక్షిస్తున్నాను. ఆత్మాధిష్ఠానక్రమము నిరూపించుటకు చేసిన ప్రయత్నము: స్వస్వరూపము జ్ఞానాజ్ఞానముల ఏకతత్త్వముగనే నిరూపించుటకు "మిధునభావమును" సూచించుట (Polarity) అందుకు ఉదాహరణలు.

(Sd) K. RavindraBabu.

# డా॥ పాటిబండ్ల దక్షిణామూర్తి

M. D., F. I. C. A.,

గీతా నర్సింగ్ హోం

తెనాలి


ది 1-3-77

---

డాక్టరు అక్కిరాజు విజయగోపాలరావుగారు శ్రీ దక్షిణామూర్తి స్తోత్రము నకు రచించిన "స్వీయమానసోల్లాసము" అను వివరణ గ్రంథమును చదువు మహదవకాశము నాకులభించినది. మా పెద్దలు వేదాంత జిజ్ఞాసువులగుటచే, నా బాల్యమునుండియు తత్త్వశాస్త్రపరమైన పారిభాషిక పదములను ఎన్నిటినో వినుచుండెడివాడను. వేదాంతమునందలి జటిలపదములకుగల అర్థమునాకు బోధపడెడిదికాదు. డాక్టరు గోపాలరావుగారి ఈ గ్రంథము చదివిన తరువాత, నాకు చిరపరిచితములైన అనేకపదములను అర్థము చేసికొనగలిగే మహద్భాగ్యము నాకు గలిగినది.

అద్వైతసిద్ధాంత సూత్రములను, పరిణామ, ఆరంభ, వివర్తాది వాదములను డాక్టరుగారు ప్రథమభాగములో వివరించినారు. ద్వితీయ భాగములో దక్షిణామూర్తి స్తోత్ర శ్లోకములను వేదాంతమునందు ఏ మాత్రము అభినివేశము లేని పాఠకులకుసైతము సులభగ్రాహ్యమగు రీతిలో విపులీకరించిరి. సత్త్వరజస్తమో గుణములను, పదార్థము యొక్క చరమరూపస్థితులుగా అభివర్ణించి, అత్యంతాధునికమైన "న్యూటన్" మహాశయుని చలనశక్తి సిద్ధాంతములతో తులనాత్మకముగా వివరించి, విపులీకరించినపద్ధతి అత్యంత శ్లాఘనీయముగాను, మానసోత్తేజకరముగాను ఉన్నది. ఇది డాక్టరుగారి స్వతంత్రభావ ప్రసరణకు ఒక గొప్ప ప్రతీకయని భావించుచున్నాను.

జీవేశ్వర జగత్తత్త్వముల విచారణయే వేదాంతశాస్త్రమునకు కథావస్తువు. ఈ తత్త్వత్రయవిషయక వాదములను వర్గీకరించి వివరించుట

ఈ గ్రంథములోని ప్రత్యేక ఆకర్షణ. ప్రతి శ్లోకమునందును డాక్టరుగారు రెండుపదములను ఎన్నికచేసి, శ్లోకార్థములను హృదయంగమముగా గ్రహించుటకు, ఈ పదములను మననము చేయవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించుట మార్గదర్శకముగ నున్నది.

దక్షిణామూర్తి యనగా నిర్వికల్ప సమాధియందున్న పరమశివుని అవతారమని పురాణములు చెప్పుచున్నవి. అట్లుగాక, నిరాకారము, నిర్గుణము అయిన లోకాతీతశక్తిమంతుడగు పరమాత్మయే శ్రీ దక్షిణా మూర్తి అనియు, జడపదార్థమైన బుద్ధిని ఆలముకున్న మాలిన్యములను, సంస్కారములను జీవుడు తుడిచివేసి, ఆత్మసంయమనము లభింప జేసికొన్నప్పుడు పరమాత్మను సాక్షాత్కరింప జేసికొనవచ్చుననియు ఈ గ్రంథములో సవివరముగా ఉద్ఘాటింపబడినది.

భారతీయ తత్త్వశాస్త్రమును తేటతెల్లముగా తెలిసికొనదలచు కొన్న ప్రతివ్యక్తికి ఈ గ్రంథము అత్యంతోపయోగకరమైన కరదీపికగా భాసిల్లగలదు.

వృత్తిరీత్యా వైద్యులైనను అధికశ్రమకోర్చి, అనేకగ్రంథములను పఠించి, సమన్వయించుకొని తనదైన ప్రత్యేకశైలిలో, తేటతెనుగులో హేతుబద్ధమైన వ్యాఖ్యానసహితముగా అందించిన డా॥ గోపాలరావుగారికి తెలుగువారు ఋణపడియున్నారు. భారతీయేతరులుకూడా భారతీయ వేదాంతసారమును గ్రహించుటకు అనువుగా ఈ గ్రంథమును ఆంగ్లములో కూడ ప్రకటించుట ఉచితము. "HINDU PHILOSOPHY MADE EASY" అనదగిన ఈ గ్రంథమును రచించిన డాక్టరు గోపాలరావుగారు బహుధా ప్రశంసనీయులు, అభినందనీయులు, ధన్యజీవులు. జిజ్ఞాసువులెల్లరు పఠింపదగిన ఈ ఉత్తమగ్రంథమును తెలుగువారికి అందించిన డాక్టరుగారి బృహత్కృషికి వైద్యవృత్తిలో ఉన్న మేమందరము గర్వించుచున్నాము.

(Sd.) పి. దక్షిణామూర్తి

# ఆమోదము

విజయగోపాలరావు కోవిదులు సూక్ష్మ
ఆంధ్రవాణి కలంకృతియై తనర్ప
దక్షిణామూర్తిస్తోత్ర ముదాత్తవచన
రచనకున్ దెచ్చె నర్థమర్మములు చాటి

ప్రజలమేని తెగులు పాపె నిన్నాళ్లు నే
వెజ్జ నేర్మి పేర్మి వెల్లివిరియ
నేఁడు చిత్తరోగ నిర్మూలనక్రియా
నిరతుఁ డగుట పుణ్యభారతుఁడగుట

షష్టి నిండుదనుక సాంసారికవిచార
పరత నుంటు పిదప బ్రహ్మతత్త్వ
దీక్ష నుంటు భారతీయునిచందఁ; ఇగా
విజయుఁ డిది కనెన్ వివేకి యగుట.

అప్పికట్ల,
27-1-1977

(Sd.) తుమ్మల సీతారామమూర్తి

ఓం

# ఆశీస్సు

దర్శనాచార్య, కళాప్రపూర్ణ
డాక్టరు కొండూరు వీరరాఘవాచార్యులు

సీ॥ అద్వైత తత్త్వంబు నామూల చూడంబు
బోధించు దక్షిణామూర్తి గురుని
స్తోత్రరాజమును కస్తోకమనీష వ్యా
ఖ్యాన వివృతులు బ్రహ్మజ్ఞు లెన్న
వ్రాయుటయే కాక వైజ్ఞానిక విశేష
ములతో సమన్వయమ్మును నొనర్చి
అద్యతనాంధ్ర ప్రజామోద భాజనం
బగురీతి వెలయించినట్టి లక్క-

తే॥ గీ॥ రాజ వంశాంబునిధి సోము రమ్యగుణుని
విజయగోపాలరాయని విశ్వనాథు
డింక నుత్తమకృతులు రచించునట్లు
ఉన్నతుని జేసి అనుదిన మోము గాత !

కొండూరు వీరరాఘవాచార్యులు, తెనాలి.

తెనాలి
29-3-1977

పింగళ
శ్రీరామనవమి

# 'Sweeya Maanasollasam'

*by*

**Dr. L. V. Gopala Rao**

— /// —

"The Eastern genius is brought to the fore-front in the back-ground of the Western theories and this, a unique feature, places this commentary on the top of all such commentaries in Telugu."

**R. K. PAGADALA,** ***M. A.,***
*Department of English*
Hindu College, Guntur.

# శ్రీ దక్షిణామూర్తి స్తోత్ర విశిష్ఠత

ఆత్మప్రదక్షిణము లేక్షణము మొదలిడె
నా క్షణమేని విశ్రాంతిఎరుగదీ యవని
రాత్రిందినము లెట్టులారంభమాయనో
అంతమే కనబడదు ఎంతకాలము కేని
ఆకసంబును గనగ ఆశ్చర్యమొదవును
తుది ఏమొ మొదలేమొతోచ దెక్కడగాని
గ్రహతారకాదులే క్రమమున నిల్చెనో
అంతుబట్టదు మనశ్చింత మిగులునెగాని
పంచభూతముల శాసింపజాలినదేదో
బోధపడ దినుమంత బుద్ధికెపుడేని
"నేనంచు నాదంచు నుడువుచుందు నెగాని
నన్ను నేనెరుగని నాకేమితెలియు"

స్వతంత్ర ఉదాత్తభావ సంపన్నుడు శ్రీ మల్లాది శివరామ్‌గారి పై గేయము నన్నెంతయో ఆకర్షించినది. అంతులేని ఆత్మప్రదక్షిణముల జేయుచున్న జగత్తు నెరుగదట. దివారాత్రముల గల్పించు కాలమును, మొదలు తుదితెలియబడని దేశమును (Space and time continuum) ఎఱుగదట: గ్రహములు తారకలు అంతర్గతముగనున్న విశ్వమును, తన మనుగడ కావశ్యకములైయున్న పంచభూతముల శక్తులను నియమించు ఈశ్వరుని, తుదకు వ్యామోహముచే "నేను, నాది, నన్ను" అని భ్రమల జెందుచుండు తనను (జీవుడు) గాని ఎఱుగడట. తానెవరో తనదేదో, తెలియనప్పుడు— జీవేశ్వర జగత్తత్త్వముల నిజస్వరూపమునెట్లు తెలిసి కొనగలనను ఆవేదనను ప్రస్ఫుటము చేయుచున్నదీ గేయము. ఇందుకు సమాధానమే శ్రీ దక్షిణామూర్తి స్తోత్రము.

ప్రకృతము విచారణీయాంశము : ఈ స్తోత్రమునందు విశిష్టత ఏమి ? లోకమున స్తోత్రము లనేకములుగలవు, సర్వజ్ఞుడగు శ్రీ శంకర భగవత్పాదులు వ్రాసినవియే, లక్ష్మీనృసింహ స్తోత్రమువంటివి, అనేకములు గలవు. పరిశీలింపగా అవి రెండుతెరగులుగ తెలియబడుచున్నవి. మొదటి శ్రేణివి సాకారసాలంకృత సుందరమూర్తుల ప్రశంసలు. రెండవశ్రేణివి భావరూప దివ్యతత్త్వ ప్రతిపాదకములు. వీనిని విమర్శించి, భంగి భేదము లను ప్రయోజనములను గ్రహించినగాని విశిష్టతను నిర్ధరింపజాలము. పరికింతము :-

1. సాకార సాలంకృతమూర్తి స్తవములు : స్థూలముగ జెప్పుకొనిన నివి సద్వారకబోధలు. అనగా అజ్ఞాత తత్త్వమునందు మంద, మధ్యమాధి కారులకు, ముందు శ్రద్ధగలిగించుట కుద్దిష్టములు. ధర్మార్థకామములను త్రైవర్గిక మార్గప్రతిపాదకములు. ఇందు శిల్పకళా కౌశలముతో నిర్మింప బడిన ఒకమూర్తియో, చిత్రలేఖనముతో రూపురేఖలు దిద్దబడిన వర్ణ చిత్రమో విషయము (Subject - matter). ఈ రూపురేఖల ననుసరించి బహుధా విశేషణముల దెలుపు అష్టోత్తరములో, సహస్రములో, నామ ములు, లేక పద్యరూపములు, యీ స్తోత్రములు. ఇవి లలితకళాదృష్టితో సాధారణ జనులకు మనోరంజకముగ నుండునట్లు కల్పితములై విల సిల్లును. ఒక మంజులమూర్తి దర్శన నేత్రపర్వమే ప్రథమప్రయోజనము. తరువాత అజ్ఞాన శక్తిమంతుని హృదయమున స్థాపించుకొని, స్మరించు కొనుచు, ఆ ప్రభావముచే, తన నిత్యజీవితమును సరిదిద్దుకొనుటయే లక్ష్యము. ఇట్టి సాలంకృతమూర్తుల దర్శనముచే, వారిసేవచే, వారిసన్నిధి యందుండు కాలపర్యంతమైనను, మనసున కాహార్యము (ఒక్కచో చేర దీయుట) అలరింపు (సంతసము), సాటి భక్తులయందు సోదరభావము సిద్ధింపగలవు. కనుకనే మాన్యములైనవి. ఇట్టిమూర్తుల దర్శనము

సంగీతమువంటిది. "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః" అని నట్లు, బాలురకు, విద్యాహీనులకు, విద్యావంతులకు సర్వులకు, సర్వచేత నములకు సద్యస్సంతస జనకము. ఇందు అంగాంగ సౌష్టవప్రశంస, అలం కార విశేషముల ప్రశంస, ఆ మూర్తులందు భావింపబడు అజ్ఞాత తత్త్వము యొక్క శక్తుల ప్రశంస ప్రధానములు. ఉదాహరణమునకు ఈ క్రింది పద్యమునగల భావము పరిశీలించి గ్రహింతుదము.

కస్తూరీ తిలకం లలాటఫలకే వక్షస్థలే కౌస్తుభం,
నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణం।
సర్వాంగే హరిచందనంచ కలయన్ కంఠేచ ముక్తావళి
గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణిః॥

ఆహా ! ఆ మూర్తి నేత్రపర్వముగ ప్రత్యక్షమే. ముక్కునలంక రించిన ఆ ముత్యమునకెంతగణుతి లభించినది ! కరతలేవేణుం: ఆ వేణుగానము వినిపించుచున్నట్లే యుండును. గోపబాలుర నలరించు చున్నట్లు లేక రాధాదేవిని పరవశింపజేయుచున్నట్లు లేదా విజ్ఞులగువారికి గీతాగానము (భగవద్గీత) జేయుచున్నట్లు స్ఫురించును. ఆతనిమేని హరి చందన గంధము మననాసాపుటముల సుద్దీపింపజేసినట్లే అనిపించును. కరే కంకణం : కంకణమున్న ఆయన కరము మనకు అభయమొసగుచున్నట్లే గన్పించును. గోపస్త్రీల వింజామరా వీచికలు ఆయనకేగాదు — మనకును మలయమారుత స్పర్శసుఖప్రాప్తినిచ్చి మానసోల్లాసకరములుగ స్ఫురించును. ఆహా ! సర్వేంద్రియ సంతర్పణమే ఆ దృశ్యము. జగన్మిథ్య యన విశ్వసింపజాలముగాని ఈ ప్రత్యక్షానుభూతి నెట్లు కాదనజెల్లును ? కనుకనే సంగీతమువలె సద్యస్సంతస జనకము; మన భయముల కభ యము; అల్లంతదూరిమున ఫలప్రాప్తియు గోచరించుచుండును. హే ! కృష్ణా! ముకుందా! మురారే! అని పాడుచు, పరవశించుచు, ఉద్రేకమతి

శయించిన నాట్యముకూడ జేయుదుము. సూక్ష్మమగు మనస్సు సంతోషముచే స్పందించును. స్థూలమగు దేహము ఆ ప్రభావముచే పులకరించును. These are the effects of physical gyrations and Raja-sic mental vibrations in different frequencies. సున్నితమగు మనస్సు కొంతవరకు అజ్ఞాత తత్త్వానుభూతిని అకర్తృకముగ అనుభవించును గాని జ్ఞానసముద్భవముచేత గాదు. మఱికొందరు తమోగుణ ప్రధానులకు క్షుద్రదేవతారాధకులకు మేళతాళముల శబ్దముల నతిశయింపజేసిన శిరఃమెత్తునేగాని శివుని స్ఫురణయైన గలుగదు, ఈ స్థితులను ఆంగ్లమున Emotionalism అందురు. Quite consistently with the predominating factor Rajas or Tamas this gives different of degrees of acquired pleasure to the individuals. This depends to some extent on the cadre of the deities too, as Rama and Krishna or Poleramma to Nancharamma. Yet, in Moorti pooja the roots of both or in wishful thinking. (స్వీయ సుఖాఽకాంక్ష.) ఒక పరీక్షయందో, వ్యాపారమునందో, వ్యవహారమునందో జయము నపేక్షించుటయో లేక స్వీయ యోగక్షేమముల పురస్కరించుకొని స్వామినిస్తుతించి, ఆరాధించి, వాంఛల నివేదించి, పత్రమో, పుష్పమో, ఫలమో సమర్పించి, ఆ సమర్పణమునకు బదులు ఒక ప్రతిఫలము నపేక్షించుటయే ఇందలి కీలకము. కనుక దీనికి స్వార్థమే పాదు, కర్తృత్వమే చెట్టు, భోక్తృత్వమే ఫలము. మానసికవికాసము, సత్వగుణ ప్రవర్తనము, తత్త్వదర్శనాపేక్ష మృగ్యములు.

II ఇక రెండవసరణి స్తోత్రములు : ఇవి దివ్యతత్త్వ ప్రతిపాదకములు. కార్యకారణ విషయక చారుచర్చాపూర్వకములు. సిద్ధాంత నిర్ధరితములు నిశ్శ్రేయ సమార్గదర్శకములు. ఉదాహరణమునకు యీ పద్యమును పరిశీలింపుదము.

శ్రీమద్భాను సహస్రసమండల విభాసీ, సచ్చిదానందమూర్తి
మాయా పరికల్పితాఖిల జగచ్ఛ్రేణీ దయాంభోనిధీ !
స్వామీ ! నీ మహిమంబులా నిగమముల్ వర్ణింపలేవన్నచో
నే మూఢాత్ముడ నేమెరుంగుదును తండ్రీ ! భక్తచింతామణీ !

ఇందలి కథావస్తువు (material) భావరూపమేగాని - నేత్ర పర్వముగాదు. కన్నులు చీకట్లుగ్రమ్మ, చూడశక్యముగాని వేయిసూర్యుల ప్రకాశము, రూపరహితములగు మాయ. సత్తు, చిత్తు, ఆనందము సర్వమూ ఊహాగానమే, భావరూపమే. These are conceptual and abstract entities only. ఇందు సుగంధములేదు. శృంగారము లేదు. సుఖస్పర్శలేదు, సుందరవదనములేదు, ఇది సర్వేంద్రియ మౌనతుల్యముగ నున్నది. రసోత్పత్తిలేదు. ఉత్తేజింపనూ జాలదు. ఓహో ! ఇది నీరసమేనా ? నిర్వేదమేనా ? అనిపించును. శాస్త్రములు ఈ అజ్ఞాతతత్త్వము సాత్వికానంద రసభరితమనుచున్నవే ! ప్రజ్ఞానమననుచున్నవే ! సమన్వయమెట్లు ? ఇందుచేతనే ఈ తత్త్వప్రతిపాదక స్తోత్రములు సాహిత్యమువంటివి. సాహిత్యము తొలిచూపుచేతనే సద్యస్స్వాంతస జనకము గాదు. అది ఆలోచనామృతము. ఈ అమృతము, కొంత శాస్త్రమథనము, ఎంతో విషయమననముచే, లోచూపుగలిగిననే ప్రాప్తించును. ప్రాప్తించెనా అది అవిచ్ఛిన్నస్రపంతియే యగును. దీనిని ఆంగ్లమున Intellectualism అందురు. ఇందు ఉత్తేజములు, ఉద్వేగములు ప్రధానములుగావు. రజస్తమస్సులుగావు దోహదముజేయునవి. ఇందు సత్వగుణ సంవర్ధనమే శరణ్యము. కనుక రంగురంగుల హరివిల్లుగాదు (Rain-bow) ప్రాప్యము సర్వవర్ణముల విలీనము జేసికొనిన పర్యవసించునది తెలుపు. ఆస్వాదింప రసపూరిత మధుర ఫలములుగావు లభించునవి; సర్వరస విలీనపూర్వకమగు సాత్వికానందరసమే లభ్యము. ఇదియు, సత్వగుణ సమృద్ధమందురా !

ఆ సత్త్వమునుకూడ జయించినయడల స్వప్రకాశమే, ప్రజ్ఞానమే అనుభూతి యగునది. (Essential Bliss and Beatitude.)

ఇంతవరకు రెండు సరణులయందు జెప్పబడిన స్తోత్రముల పరిశీలించితిమి. పై విచారణచే రెండు విధములగు మన స్తత్త్వములు గమనీయము.

ఇందుకు ముందుగా నొక ఉపమానము సహకారియగును. ఇద్దరు భక్తులొక శివాలయమునందు స్వామిని దర్శించిరి. మొదటివానికి కేవల భక్తి దప్ప, విద్యగాని, శాస్త్రపరిచయముగాని లేదు. అతడా లింగాకార మును, నాగాభరణమునుజూచి పులకితుడై భక్తిభావ ముప్పొంగ హే! నీలకంఠా! చంద్రశేఖరా! నాగభూషణా! యని కీర్తించుచు, నారికేళ బిల్వ పత్రాదులనర్పించి, "మహాదేవ్" అనుచు ప్రణమిల్లెను. అతని దృష్టిలో మహాదేవ్ నందలి 'మహా' యను పదమునకు వ్యాప్తిరూపమున హిమాలయమంత, శక్తియందు మహారాజుకున్నంత యను భావము గలుగును. అతడు ఇచ్చునది ఒక నారికేళము. కోరునది ఒక ప్రతిఫలము, తన కుటుంబ యోగక్షేమములు, తన ధనధాన్యాదికముల విషయకమై యుండును. కనుక రాగమతిశయించి (attachment gets intensified) స్వార్థమే లక్ష్యమగును.

ఇక రెండవ భక్తుడు విద్యావంతుడు, భౌతికశాస్త్ర పరిచయము గలవాడును. కాంతి ఒక సెకండ్‌కాలమున 1, 86, 364 మైళ్ళు ప్రసరించ గలదని చదివియుండెను. ఈ సంఖ్య ×60×60×24×365 మైళ్ళు ఒక కాంతిసంవత్సరమని తెలిసికొన్నవాడు. ఒక 200" దూరదర్శిని సహాయ ముతో 500 కాంతిసంవత్సరముల దూరమునగల ఒక నక్షత్రమును శాస్త్రజ్ఞులు కనుగొనిరని పత్రికలలో చదివి అహా! ఈ విశ్వమున నెంత

పెద్దదని అచ్చెరువందెను. తరువాత ఇంతటి గొప్పదగు యీ విశ్వము "పాదోస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతందివి" అని చెప్పుచున్నదే శాస్త్రము! మఱి ఆ అమృతస్వరూపుని వ్యాప్తికి పరిధులుగలవా ? బుద్ధి కందని ఎంత బృహత్పదార్థమో అని తలపోయమొదలిడెను. అజ్ఞాత తత్త్వవిచారణయం దాతనిబుద్ధి లగ్నమయ్యెను. 'మహః' అనుపదమునకు వ్యాప్తి అపరిమితమేనని విశ్వసించెను. విశ్వము, అందలి సర్వము, ఆ 'మహః' యందంతర్గతములని ఇది ఒకే వసుధైక కుటుంబమేనని గ్రహించెను. సర్వాత్మత్వభావ మాతని హృదయమున హత్తుకొనెను. భౌతిక శాస్త్రజ్ఞానముకూడ, పారమార్థిక విషయగ్రహణమునకు గొప్ప సహకారిగ అవశ్యకమని, రెండిటికిగల సమరసభావమును గ్రహించుటచే తత్త్వము విశ్వసనీయమగునని తెలిసికొనెను. ఇప్పుడాతనికి ప్రతిఫలాపేక్ష యుండదు. స్వార్థముండదు. సమష్టి శ్రేయస్సునే వాంఛించి ధ్యానించును. ఆతడు కోరునది ఒకేఫలము — సర్వులకు జ్ఞానఫలము.

- ఇక యీ స్తోత్ర విశిష్టతను నిర్ధరింతము -

మొదటికోవకు చేరిన స్తోత్రములు ఒక అజ్ఞాతతత్త్వముయందు శ్రద్ధాజనక మాత్ర ప్రయోజనకరములు, ఐహిక జీవితగమనమును నియమ బద్ధముజేయ దోహదములు. స్వీయలాభ వాంఛాపూరకములు. ప్రకృతి యందలి భిన్నతత్త్వ దర్శకములు.

రెండవకోవకు జేరినది శ్రీ దక్షిణామూర్తి సద్గురుస్తోత్రము. ఇందు పరబ్రహ్మవిధాయినియగు మాయయొక్క స్వరూపస్వభావములు, శక్తులు, తత్కార్యములువివరించి తెలుపు అద్వైతసిద్ధాంత మూలసూత్ర ములు పొందుపరచబడినవి. కనుక నిది స్తోత్ర రూపముగనున్నను,

ప్రబోధచే జ్ఞానసముద్భవముజేయు శాస్త్రమే – ఉపనిషత్సారమే. అనగా "ఒకచో ప్రత్యగాత్మ పనబడునీవే, సర్వాత్మనా, పరమాత్మవు" అని చేయు ప్రబోధము.

కర్తవ్యము : దివ్య తత్త్వజ్ఞానముచే నీ మనసును వికసింప జేయుము. ఒక Prism యొక్క కోణముపై తెల్లని కాంతికిరణములు సంసర్గము జెందినయపుడు సప్తవర్ణములుగ భాసించును. ఆ Prism యొక్క సంసర్గము లేనియపుడు సప్తవర్ణములు ఒకే తెల్లని కిరణముగ స్వస్వరూపమున నుండును. అట్లే పరబ్రహ్మయందే మిధునభావమున యున్న మాయ బ్రహ్మకున్ముఖమైనపుడే ప్రకృతినుండి రూపొంది దృశ్యమానమగు 26 గానీ 36 గానీ తత్త్వములు భాసించుట. మాయ ఉన్ముఖము గానపుడీ సర్వతత్త్వములు (evolutes) విలీనములై అనగా ప్రకాశము నందే విమర్శయు అంతర్గతమై "ఏకమేవాఽద్వితీయం" అను అనుభూతి నిచ్చునను బోధయే యీ స్తోత్ర విశిష్టత.

2 నుండి 9 వరకుగల శ్లోకములు జీవులపై మాయాశక్తి యొక్క ప్రభావమును; జీవేశ్వర జగత్తులయందు గలుగు భ్రాంతి స్వరూపమును, ఉపమానములతో వివరించును. సగుణ నిర్గుణములనబడు ద్వివిధ ఐశ్వర్య సంపన్నుడవు, ప్రత్యగాత్మవగు నీవేయని ప్రస్ఫుటము జేయబడినది సర్వాత్మత్వమగు నిర్గుణమే నామరూపములుగా సగుణవిభూతితో స్ఫూర్తి నిచ్చుచున్నది అని గ్రాహ్యాంశము.

ఈ స్తోత్రభావముల మననము జేయుటకు ముందు దక్షిణామూర్తి యననెట్టివాడు ? ఆయన ఆపేర నెందుచే వ్యవహరింపబడుచుండెను ? అని తెలియుట సముచితము. 1. సాధారణముగ ప్రచారమున నున్న దేమన : దక్షయజ్ఞానంతరము పరాప్రకృతి రూపిణియగు పార్వతి తన భౌతిక శరీరమును విడచిన తరువాత శక్తిరూపిణియగు నామె శివుని యందు లయమై నిష్క్రియముగనుండ, నిర్వికల్ప సమాధియందు దక్షిణ దిక్కున కభిముఖుడై కూర్చుని యున్నవాడు దక్షిణామూర్తియని. శక్తి శక్తిమంతునితో చేరి అద్వయస్థితి నొందినదని గ్రహింపగలము. కనుక నాతడు ఈశ్వరుడు. ఈశ్వరుని స్వరూపశక్తియే పరాశక్తి. 2. దక్షిణ యన బుద్ధియను అర్థము గలదు. ఇంద్రియములచే గాదు, బుద్ధిచే తెలియబడువాడు గనుక దక్షిణామూర్తి యందురు. సరి, కానీ, యీ బుద్ధి జడపదార్థముగదా ? జడమగు సాధనము ద్వారా, జడములకు స్ఫూర్తిని గలిగించు చైతన్యరూపుని దెలియుటెట్లు ? అను శంక గలుగుచున్నది. లోకవ్యవహారమున శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల గ్రహించి యనుభవించునంతవరకే దీని పరిమితి. చైతన్యమును దెలియ వలెనన్నచో యీ బుద్ధికిగల ఆవరణ విక్షేపములను మాలిన్యములను, వాసనలను, సంస్కారములను తుడిచివైచి, దానిని శుద్ధ సత్వప్రధానముగ నొనరించి, ధారణ, ధ్యాన, సమాధుల సంపుటియగు సంయమనమును

జేసినప్పుడాబుద్ధికి అనుభవపూర్వకమగు పరమపదార్థ జ్ఞానము (అపరోక్షానుభూతి) సిద్ధించును. ఆ స్థితియందు యీ బుద్ధి ప్రమాతయుగాదు (తెలుసుకొనువాడు), ప్రమేయమునుగాదు (తెలుసుకొనబడవలసినది), ప్రమాణమునుగాదు (తెలియ నుపకరించు సాధనము. అది త్రిపుటియే లేని పరమాత్మ స్థితి. చైతన్యమునందు చైతన్యమే స్వాత్మారామస్థితిని సాక్షాత్కరించుకున్న నిర్గుణతత్త్వమే దక్షిణామూర్తి. The formless Divine Principle which could only be intuited and experienced is Dakshinamurti.

1. ఈ స్థితియం డాతడు "అసౌ పరమార్థతోఽమూర్తిశ్చ ఆకారవిశేష రహితః" అనగా పరమార్థ దృష్ట్యా ఈతడా నామరూపములు లేని అమూర్త అనిర్వచనీయ పరమాత్మయే. ఇట్టి నిర్గుణ తత్త్వమును దెలియుట యనిన అపరోక్షానుభూతిని పొందుటయే యగును. బోధనా సౌలభ్యము కొఱకు సంయమన సామర్థ్యముగల బుద్ధిచే అపరోక్షముగ ననుభూతు డగువాడు దక్షిణామూర్తి యని స్థూలముగ జెప్పుకొందము.

2. "క్రియాదక్షిణః" అనునట్లు అనాద్యచింత్య మాయాశక్తిచే సృష్టిస్థితి లయముల జేయుటయందు నైపుణ్యము గలవాడు.

3. సర్వజ్ఞుడై, సర్వజీవులకు కర్మ ఫలప్రదాతయై, ఉపాసకాభీష్ట ఫలప్రదు డగుటలో దక్షుడు గనుక దక్షిణామూర్తి యగును. గురుతత్త్వము దైవ తత్త్వమున కన్న భిన్నముగాదు. గనుక నిది గురుస్తుతిగా చెప్పబడెను.

పుణ్యభూమి యని విశ్వసింపబడుచున్న మన భారత దేశమందు బహువిధ సంస్కృతులు సమ్మిశ్రితములై భిన్న భిన్న తత్త్వశాస్త్రము లుద్బుద్ధమై తదనుగుణములగు మతములు ప్రచారమునకు వచ్చెను. ఒక్క అద్వయమతముననే శైవాద్వైతము, శాక్తాద్వైతము, విశిష్టాద్వైతము,

శఙ్కరాద్వైతము అని ప్రధానమగు భిన్న ప్రక్రియలు గన్పించుచున్నవి. అభిప్రాయ భేదములకు ఆచారభేదములే కారణములై కల్లోలముల రేకెత్తించినవి. బాహ్యవేషములగు జుట్టు, కట్టు, బొట్టు, చక్రాంకితాదులు రుద్రాక్షమాలలకే ప్రాధాన్యత లభించినది. ఈ వేషముల తీరుతెన్నుల చేతనే యొకని పారమార్థిక పరిధిని నిర్ణయించుట సాంప్రదాయమైనది. ఏ చిత్తశుద్ధి, ఏ చిత్తశాంతి శాస్త్రమున ఉద్దిష్టములో అట్టివానికి స్థానము లభించుటలేదు. ఉద్వేగములు, ఉద్రేకములు, సంఘర్షణలకు మతములే కారణముగ పరిణమించినవి. అపర దక్షిణామూర్తియగు ఆదిశంకరులు భక్తి, కర్మ, ఉపాసనలకు మిన్నయగు ప్రాధాన్యమును, జ్ఞానమునకు గల్పించి సౌర, శాక్త, గాణాపత్య, శైవ, వైష్ణవ, కాపాలికలను షణ్మతములకు సామరస్యము గల్పించి చూపెను. తత్త్వశాస్త్రమునకు జ్ఞానయోగపరమగు వ్యాఖ్యలను వ్రాసెను. అప్పటికి దేశము బౌద్ధమత సిద్ధాంతములతో ప్రభావితమైయుండ, అందలి క్షణిక విజ్ఞాన, శూన్యవాద ముల విమర్శించి అందలి సూత్రముల కొన్నిటికి, వైదికమత సూత్రము లతో గల సామరస్యమును జూపుటకు మాయావాదమును విస్తృతపఱచి సమన్వయమును సాధించెను. జ్ఞానమార్గముచే ప్రబోధము గలిగించుటకు ఆయన వ్రాసిన మొదలగు ఉద్గ్రంథములలోని సూత్రములనే పది శ్లోకము లలో పొందుపరచి దక్షిణామూర్తి స్తోత్రము నను గ్రహించెను. ఇదియొక గొప్ప చిన్న పుస్తకము. ఇందు మొదటి శ్లోకమున చిన్నయద్దములో గొప్ప నగరము అంతర్గతముగ గన్పించిన యట్లని యిచ్చిన యుపమానము వలె అపారమగు తత్త్వశాస్త్ర మూలసూత్రములను (fundamentals) పది శ్లోకముల పాకెట్ పుస్తకమున నిమడ్చి యిచ్చి, నీవు జ్ఞాననేత్రము గల ముక్కంటివి. పశుపతివి, కాని పశువువుగావు, నీవే సర్వాత్మకుడవని "సర్వాత్మత్వ మహావిభూతి సహితం స్యాదీశ్వరత్వం స్వతః" అని

ఫలశృతియందు ప్రబోధించెను. కనుక నీ స్తోత్రము జ్ఞాన యోగ పరమైనది.

తన సంస్కార ప్రభావముచే విచారణా స్వభావము గలిగిన (inquisitive nature) ఏ మానవునకైననూ పారమార్థిక చింతన గలుగుటకు ప్రథమ కారణము ఇంద్రియ ప్రజ్ఞకు తెలియు నీవస్తుసంపదయే (abundence of the phenomina). ఇది యంతయు చరాచర రూపమున గన్పించు చున్నది. ఊహాతందని యీ మహాద్భుత ప్రకృతి దృశ్యములు, చావుపుట్టుకలు, శక్తి రూప ప్రదర్శకములు, వివిధ సౌందర్య విశేషములు, భయానక దృశ్యములు, ఆశ్చర్యకరమగు శక్తి విలసన విలాసములు (illusory manifestations caused by cosmic energy) వివిధ భావముల రేకెత్తించును. అందు పై వస్తుతత్వ విచారణ. కార్యకారణ విచారణతో ప్రారంభమగును. ముందు భౌతిక దృష్టితో భౌతికశాస్త్ర విశేషజ్ఞానముతో నన్వేషణ జరుపబడును. తరువాత నీ భౌతికశాస్త్ర జ్ఞానమున కందని విషయములు స్ఫురించి పారమార్థికముగ (metaphysical) నాలోచించి జ్ఞాతమునుండి అజ్ఞాతమునకు (from the known to the unknown or from the physical to the metaphysical) పారమార్థికమును గ్రహింప ప్రయత్నించును. అప్పుడు లలితములు సుందరములగు దివ్యభావములచే నుత్తేజితుడై, బుద్ధికందని ఒక మహాశక్తి యునికిని యూహించి, అంగీకరించును. ఇట్లుత్తేజితుడై. జిజ్ఞాసువై ఈ యజ్ఞాత సృష్టికర్తను గురించి స్ఫురించు ప్రగాఢ. లలిత, సుందర భావములనే సుప్రసిద్ధశాస్త్ర పరిశోధకుడు, వ్యాప్తయశస్వి యగు ఐన్‌స్టీన్ తన మాటలలో "The most beautiful and profound emotion a man could feel is the sensation of the mystical" అని చెప్పెను.

"మానవుడు భావానందము పొందుటకు, అత్యంతసుందరము, ప్రగాఢము భావోత్తేజకమునగునది, ఈ అజ్ఞాత శక్తియుక్తుని లీలాస్ఫురణయే" అని యర్థము. కనుక సత్యజ్ఞానస్వరూపమగు తత్త్వదర్శనమే చరమ సౌందర్యము. సత్యం. శివం, సుందరమని భావము. తన పరిణామ లక్షణముల వలన దృశ్యమానవస్తు తత్త్వవిచారణకు సత్యజ్ఞాన ప్రాప్తికి ప్రేరేపించునదగుటచే ప్రకృతిమాత "సత్యజ్ఞాన ప్రసూనాంబ" యని అనఁజెల్లును. "నసృష్టౌ సృష్టి తాత్పర్యం" అని సూత్రభాష్యమున జెప్పినట్లు సృష్టిని గూర్చి తెలిసికొనుటగాదు లక్ష్యము. సృష్టిజ్ఞానముద్వారా సృష్టికి కారణమగు చైతన్యముయొక్క స్ఫూర్తిని పొంది ఆ చైతన్య తత్త్వమును, నేతి నేతి ప్రక్రియచే గ్రహించుటయే లక్ష్యము. ఇట్టి జ్ఞానయోగ రూపమగు నీ స్తోత్రమున ప్రధానముగ బోధింపబడిన విషయము లెవ్వియన :-

1. ప్రతిమానవునికి స్వస్వరూపమగు, అంతర్యామిగ నుండు ప్రత్యగాత్మను - రజస్తమస్సుల ప్రాబల్య పూర్వకములగు ఆవరణ విక్షేపములను, మలినములనుండి శుద్ధపరచుకున్న చిత్తముతో, తన సర్వాత్మత్వము నారూఢము జేసికొనుట.

4. భ్రాంతి జ్ఞానమును వేదాన్తశాస్త్ర జ్ఞాన, అభ్యాస వైరాగ్యములచే తొలగించుకొన్నచో సర్వాత్మత్వము సిద్ధించి, తానే నిర్గుణ స్థితినొందునని, సగుణ నిర్గుణ రూపమగు పరమాత్మయే ప్రత్యగాత్మయని సూత్రప్రాయముగ జెప్పబడెను.

5. అంతఃకరణము సంతర్ముఖముజేసి, మనస్సును బాధింపజేయు నివృత్తి పూర్వకమగు సాధనచే "స్వాత్మానమే వాద్వయమ"ను స్వరూప సిద్ధి గలుగునని బోధించెను.

6. మాయ యొక్కయు. పురుషుని యొక్కయు లక్షణముల జ్ఞానమును పొంది, మాయనుండి విడివడి, ఆత్మేశ్వరత్వమున స్థిరమతియై అనుభూతి పొందుటయే యీ స్తోత్రలక్ష్యము.

ఇంతవరకు అద్వైత సిద్ధాంతమునకు పునాదులు వివర్తవాదము మాయాతత్త్వము అనియు, నిర్గుణ బ్రహ్మయొక్క విభూతియే సగుణ బ్రహ్మయనియు సగుణ నిర్గుణములు తాత్త్వికముగ ఏకరూపమేగాని అన్యములుగావనియు ఈ స్తోత్రమున జెప్పబడినట్లు తెలిసికొంటిమి. ఈ విషయమును గ్రహించి చిత్తశుద్ధికి సాధనచేసి, తత్త్వానుభూతి పొందినవారికి సర్వాత్మకత్వభావము సిద్ధించుననియు తెలిసికొంటిమి. ఈ విషయముల వాగింద్రియము చదివినది, బుద్ధీంద్రియము గ్రహించినది. ఇక సంతృప్తులము గావచ్చునా ? ప్రపంచ విషయములకు సాక్షిమాత్రులమై యథాతథముగ జీవయాత్ర సాగించుటయే నా కర్తవ్యము ? విద్యకు విజ్ఞానమునకు సార్థకత యెట్లు లభించును ? ఒక కాలేజి విద్యార్థి ధ్వనిని గురించి (Sound) ధ్వనియొక్క శక్తుల గురించి (Dynamics of sound). చదివి పట్టభద్రుడాయెననుకొనుడు. ఆ జ్ఞానమును అంతరిక్షమునందలి వ్యోమగాముల హృదయ స్పందన శబ్దముల భూమిమీద

నున్న వారు విని అతని గమనమును, కర్తవ్యమును నియమించ గలుగు నంతవరకు వర్తింప జేసినగదా ధ్వనివిషయకశాస్త్ర జ్ఞానమునకు సార్థకత? కాంతిని గురించిన శక్తి విశేషములు (dynamics of light) నిత్యజీవితమునకు వర్తింపజేసి ఢిల్లీనుండి ప్రసరింపబడిన నృత్య నాటికను మద్రాసు నందున్నవారు T. V. ద్వారా తిలకింప సాధ్యపరచి పూర్వము యోగసిద్ధులకు మాత్రమే సాధ్యమైన దూరశ్రవణ, దూరదర్శనములను యోగశక్తులను (clairvoince and clairaudience) సామాన్య మానవుని దైనందిన జీవిత పరిధిలోనికిదెచ్చి, వారి వినోద విజ్ఞాన ప్రయోజన కార్యములకు వినియోగించినగదా సార్థకత? రేడియో తరంగముల వ్యాప్తిని, ప్రసరణశక్తిని గమనించి పరమాత్మ సర్వవ్యాపకత్వమున కుపమానముగ గ్రహింపగలిగినగదా విజ్ఞానమునకు సార్థకత? విశ్వమొక సాముదాయిక సహకారసంస్థ. అందు మన సహజీవులకు మన మందించగలుగు సహకార పరిమితియే (Quantum of good that we do to others) మనసర్వాత్మకత్వ భావస్థాయికి గీటురాయి, కొలబద్ద. ఇదియే నిష్కామకర్మయను కర్మయోగమునకు మౌలికమగు సూత్రము (Prime principle). జ్ఞానపూర్వకమగు ఇట్టి కర్మయోగమునకు వెలుగు జూపునదియే జ్ఞానయోగము లేక సర్వాత్మత్వము. తాము సాధించి అనుభవించుచూ ఇతరుల సుఖదుఃఖములకు, జ్ఞానాజ్ఞానములకు ఉచ్చనీచ స్థితులకు సాక్షిమాత్రులుగ నుండ నలవడిన వేదాంతులపట్ల సర్వాత్మత్వమూ వర్తించదు, వారి కీశ్వరత్వమూ ప్రాప్తించదనుట ఉపపన్నముగ దోచుచున్నది.

శంకరులు జెప్పిన మిథ్యకు భావమేమి? అలీకమనియా? (శూన్యము) అసత్పదార్థమనియా? లేక వ్యావహారిక సత్యస్థితియనియా? ఈ జగత్తు అష్టమూర్తులుగ స్ఫురించు సగుణబ్రహ్మయే యనియు, చిత్తముశుద్ధిపొంది

బ్రహ్మాకారవృత్తి ప్రోత్సహించుపరకు ఆరాధ్యము ఉపాస్యమేననియు తెలిపిరి. సృష్టిస్థితి లయములచే (molecular combination, state of equilibrium and chemical disintegration) రూపాంతరముల బొందు "పరిణామలక్ష్మి" అగు ప్రకృతిమాత నామరూప భేదములతో వ్యవహరింపబడు దృశ్యమానమే సగుణ బ్రహ్మయని విశ్వసింపనగును. ప్రకృతి : పరిణామసత్యము, సగుణబ్రహ్మ (that which ever changes is the truth as flux). బ్రహ్మ, స్వరూపసత్యము (that which is changeless in its essence and has the very existence in the continuum of space and time is the truth in essence) ఈ మార్పులతీరునే మిథ్యయని ఆయన వ్యవహరించెను. గాని యిదిలేనిది యనిగాని అభూతకల్పన యనిగాని గ్రహింపతగదు. (The changing universe is the visible God.) ఈ భావము నపార్థముచేసుకొని ఆధునికులు కొందరు ఇంద్రియ గోచరమగు ప్రత్యక్షమగు దీనిని లేదనుటచో సబబేమి ? ఆ స్తంభమునకు నీ తల కేకొట్టి చూడు - స్తంభము మిథ్యయగునో తల బద్దలగునో తెలియగలదు అని యపహాళన చేయుచుండగాని, మిథ్యయన మార్పులుజెందు స్వభావము గలది యనిగాని, మాయయన పరమాత్మ తన రచనలజేయు శక్తిరూపక మగు నొక తుంపగనో, శక్తివిశేషమనియో (dynamism) అని గ్రహించుటలేదు. N. B. వేదాంతమున మిథ్య, మాయ యను పదములు పర్యాయపదములుగ వ్యవహారమునకు వచ్చియున్నవి. కాని, ఈ భేదమును మనము గుర్తింపవలసియున్నది. మిథ్య యొక్క అధిష్ఠాన మిట్టిది అజ్ఞాన పరిణామజనిత రూపము లిట్టివి, ఆవరణ విక్షేపశక్తుల ప్రభావమిట్టిది. అని వాటి స్వరూప స్వభావముల గ్రహించిన మనీషాపంచకములో శంకరులు ఈ యవిద్యచే మన శరీరములు వేరుగ గన్పించుచున్నను పీటయందలి పదార్థము పాంచభౌతిక మగుటచేతను ii రజోగుణ

రూపమగు ప్రాణశక్తి అందరియందును సాజాత్యముగలదియే యగుట చేతను iii సర్వాధిష్ఠానమగు కూటస్థచైతన్య మేకరూపమైనట్టి దగుట చేతను. భేదభావమును పెల్లుబుకనివ్వక, సమభావమును పెంపొందించు కొనవలెనని బోధించిరి. జ్ఞానయోగిమాత్రమే చిత్తశుద్ధి, దక్షత. కర్మ కౌశలముగల కర్మయోగి గాగలడనియు, విజ్ఞానపూర్వక కర్మయోగమే సర్వాత్మత్వమునందలి ప్రధానాంశమనియు సంభావించిరి. అష్టమూర్తులు సగుణబ్రహ్మ స్వరూపములని తెలిపి, సగుణ నిర్గుణములకు సామరస్యమును జూపిరి. భౌతికమును అపరోక్షానుభూతి గలుగువరకు పరిత్యజించిన పారమార్థికతగానీ, పారమార్థికదృష్టితో పరిగణింపని భౌతికముగానీ సమ్యగ్దృష్టి నొసంగవని, సమగ్రములుగావని శంకరులు నిర్ధరించిరన ఆయనజెప్పిన 'భూరంభాం స్యవలోనిలోంబర' మను శ్లోకమున విస్పష్టము జేయబడినది. పూర్వాపరముల సమన్వయించుకొన్నగానీ రచయిత హృదయము సుగ్రాహ్యముగాదు. అందును శంకరులు జ్ఞాని, బ్రహ్మవేత్త, యోగసిద్ధుడు, వ్యాసవాల్మీకులతో తుల్యుడగు కవి, సూత్రకారుడును. అయన భావములు సూత్రప్రాయముగ జెప్పబడినను, విచారణకు బూనుకొని వ్రాసిన విస్తరగ్రంథములే యగును.

వేదాంతమున ప్రవృత్తి నివృత్తి మార్గములు రెండునూ జెప్పబడినవి. ధర్మార్థకామములు త్రైవర్గికమార్గము లేక ప్రవృత్తిమార్గమనియు, మోక్షసాధన నివృత్తిమార్గమని తెలిపిరి. ప్రవృత్తిమార్గమున అర్థకామములు చెప్పబడినవి. కానీ, ధర్మమను తూకపుకట్టను (balance Staff) చేబట్టి విధి నిషేధానుసారముగ, తూకముదప్పక అర్థకామముల ననుభవించి తరువాత నివృత్తిమార్గమున, నాలుగవ పురుషార్థమగు మోక్షమును పొంద సాధనచేయవలెనని నిర్దేశించిరి. కనుక మిథ్య, మాయ యను పదముల భావము నపార్థముజేసికొనక దృశ్యమాన ప్రపంచమును చూడ

వలసిన కోణమునుండి జూచి పొందవలసిన యనుభూతుల బొందిననే భౌతిక జీవితము మృదుమధురముగసాగి, భోగానుభవపూర్వక వైరాగ్య లబ్ధిచే (detachment by satiety) సాధించవలసిన పారమార్థికతకు దోహదముగలిగి తత్త్వశాస్త్రమునకు సార్థకత లభించును.

సర్వాత్మకత్వ వివరణ :- ఇక వ్యష్టి సమష్టి పురుషుల పోల్చి చూతము. అనగా మన భౌతికశరీరమును విశ్వరూపుడగు విరాట్పురుషునితో పోల్చుదము.

i ఇరువురి యుపాధులును పాంచభౌతికములే.

ii మాయాశక్తి ప్రభావము లేనియెడల సమష్టి విశ్వరూపుడగు విరాట్పురుషునకు, మాయాశక్తిజనిత రజోగుణ ప్రభావమగు ప్రాణశక్తి యంశములేకున్న వ్యష్టిశరీరమునకు ఉనికియుండదు.

iii వ్యష్టి శరీరమునందు భిన్నభిన్నములుగనుండి వైవిధ్యము జూపు రక్తకణములు, మాంసకణములు, అస్థికణములు, నాడీకణములు మున్నగు జీవరసాయన కణములు కొన్నికోట్లకోట్లు గలవు. దేనిరూపము దానిదే, దేనిక్రియ దానిదే. కానీ యీ కోటానుకోట్ల కణములున్నూ సహకార భావముతో ఐక్యత గలిగియున్నవి. ఇందొకటి లేకున్న రెండవ దానికి ఉనికియుండదు. రక్తకణములు ప్రాణవాయువు. బొగ్గుపులుసుగాలి యొక్క మార్పిడిరూపమగు శ్వాసక్రియను నిర్వహించును (Exchange of Carbon dioxide and Oxygen) ఈ క్రియ జరుగనియెడల సర్వ శరీరమున్నూ నశించును. మన ఆహార సారమునుండి శరీరధాతువుల కవసరమగు పోషకపదార్థముల గుర్తించి, వాటిని అవసరమగు ప్రమాణములలోనే గ్రహించుశక్తి ప్రేగులయందలి కణములకున్నది.

పచనప్రక్రియ జరుగకున్నను. సారములు గ్రహించి సర్వధాతువుల కందించు ప్రక్రియ జరుగకున్ననూ, సర్వధాతువులు, శుష్కించి, కృశించి, నశించును. పోషకములు అవసరమగు కణములచే వాడుకొనబడి, తరువాత కొంతభాగము మలరూపము నొందును. మల, మూత్ర, స్వేద, కఫములు బహిర్గతము చేయబడనిదే సర్వ శరీరమున్ను రోగభూయిష్ఠమగును. ఈ విసర్జనకార్యము వివిధ మలాశయముల యందున్న భిన్న భిన్న కణములశక్తిచే జేయబడును. మెదడునందలి మేరుదండము నందలి గల నరముల కణములు ఆలోచన, విచక్షణ, నిశ్చయము మున్నగు కార్యములేగాక వేడి, నొప్పి మున్నగు స్పర్శలదెలిపి శరీరమును ఆపదలనుండి కాపాడును. ఇట్లు సృష్టిస్వరూపములు, క్రియలు భిన్నభిన్నములుగ నుండినను, క్రియాత్మకముగ సహకరించుకొనుటచేతనే, శరీరము కొన్ని కోటానుకోట్ల కణముల సముదాయమైనను, ఒకే వ్యక్తిగ వ్యవహరింపబడుచున్నది. ఇట్లే వృక్షజాతి విషయమునను సహకారము గలదు. ఎట్లన మనము శ్వాసవిడిచిన తరువాత అందుండి వచ్చు విషతుల్యమగు బొగ్గుపులుసుగాలిని చెట్లు పీల్చుకొని అమృతతుల్యమగు ప్రాణవాయువును మనకందించుచున్నవి. ఈ మార్పిడియే లేనియెడల చెట్లకుగాని, మానవులకుగాని మనుగడ యుండదు. ఇది వ్యష్టికి సమష్టికిగల సమవాయ సంబంధమున కుపమానముగ చాలదా? ఇట్లే యీ ప్రపంచమునగల జంతువులు, వృక్షములు, క్రిమికీటకములు, గ్రహములు, నక్షత్రములు, పరస్పర సహకారముతో మనుగడ సాగించుచు ఒకే విరాట్పురుషుని శరీరమునందలి భిన్న భిన్న కణములుగ పరిగణింపబడినయెడల యీ అష్టమూర్తుల రూపమున స్ఫూర్తినిచ్చుచున్న ఈ విశ్వమంతయు ఒకే ఒక విరాట్పురుషుని ఏకైక శరీర మనుకొనుట ఉపపన్నముగ లేదా? ఈ విధముగ మనవ్యష్టిశరీరమునకును, విరాట్పురుషుని సమష్టి శరీరమునకును సాజాత్య, సారూప్యతలు

గ్రహించినవారికే సర్వాత్మత్వ భావము మనసున హత్తుకొని కర్మయోగ మున కుద్యుక్తులగుదురుగాని, కన్నీటిచుక్కల పరిశీలించు రసాయనశాస్త్రజ్ఞు నకు అందు సోడియం, పొటాషియం, మున్నగు నేవో లవణములు జల మిశ్రితములుగ నున్నట్లు తెలియబడునుగానీ, ఆ కన్నీటివెనుక నిమిత్తము లుగనున్న దుఃఖము, సంతోషము, వేదన మున్నగు యుద్వేగభావములు స్ఫురణకు రావుగదా ! ఇట్టి జడులకు విశ్వమానవప్రేమ, సహకార సం క్షేమములు, పారమార్థికత మృగ్యములే యగును. కనుక శంకరులు జెప్పిన సర్వాత్మత్వము, కేవలసాక్షిమాత్రులుగ వ్యావహారికమున మెలగువారికుపక రింపదు. అది, ఆసాక్షిభావము, కూటస్థస్థితిని విశదీకరించునప్పుడు మాత్ర ముపకరించును. ఇట్లు నాలుగు మహావాక్యములకు "సర్వాత్మత్వస్థితియే" లక్ష్యము, పరమార్థమని, జ్ఞానయోగముచే ప్రబోధింపబడి లౌకికమున కర్మయోగాచరణకు దీక్షబూనుటయే ప్రయోజనముగానీ లౌకిక జీవితదశ యందు ధర్మాఽధర్మములకు సాక్షిమాత్రులమై యుండనేర్చుటగాదు. లోకకళ్యాణము నుద్దేశించిజేయు కర్మాచరణయే చిత్తశుద్ధిదాయకము, పారమార్థిక సాధనయందు కర్మయోగమను నొక సోపానము.

<u>అధికారి భేదవిషయము :</u> ఇంతవరకు జ్ఞానయోగ కర్మయోగ విషయములు విచారించితిమి. <u>ఇక ఉపాసన విషయము:</u> ఉపాసనా ప్రక్రి యల కధికారి భేదవిషయము కొంత చర్చించి చూచుకొందము. ఇది పూజకు పైమెట్టు. జనసామాన్యము ఒక పటమునో, విగ్రహమునో లక్ష్య సిద్ధికొరకు ముందుంచుకొని కాయికముగ, వాచికముగ, గంధపుష్పాదులతో పూజించి యేదో యొక ప్రతిఫలము నర్థింతురు. వీరికన్న విజ్ఞులగువారు బీజాక్షరములతోగూడిన ఒక యంత్రమును గ్రహించి (రేఖారూపమగు నొకభావము) చిన్నదియగు, భౌతికమగు దీనియందు విశ్వవ్యాప్తమగు

గొప్పశక్తిని భావించుకొని స్థాపించి, మానసికముగ నా భావమును అవిచ్ఛిన్నముగ ధ్యానించుట ఉపాసనయని తెలియబడుచున్నది. దీనివలన ఒకని మానసికవికాస పరిమితినిబట్టి మంత్రసిద్ధి ఫలప్రాప్తి గలుగుచున్నదని శాస్త్రములవలన దెలియబడుచున్నది. ప్రకృతము సాధనవిధానములు, అందలి వైవిధ్యములు శాస్త్ర ప్రతిపాదితములుగాని మారుతలలు వేసియున్నట్లు స్ఫురించుచున్నది. నాదృక్కోణమునుండి జూచువారికొక ప్రధానవిషయము గోచరించును. అది యేమన, జగత్తున మన మనుగడ సంఘముతో మనకుగల సంబంధములతోను, సంఘమునం దొకరి శ్రేయస్సు మరియొకరి శ్రేయస్సుతో ముడిబడియుండుటతోడను ఆధారపడియున్నది. ముక్తి అందరాశించు ఐశ్వర్యమే. దానిని సాధించు పనిముట్టు "అంతఃకరణము" ప్రతిదేహియందును గలదు. దాని ప్రసరణ మాత్రము భిన్నదిశలకు అంగలువేయుచూ వోవుచున్నది. ఈ భిన్నదశలకు మార్గము జూపువారు మతాచార్యులు. కొందరు సనాతన మతప్రవక్తలు, మరికొందరు ఆధునాతన మతకర్తలు. ఒకరు ఏకేశ్వరోపాసన, ఇంకొకరు ముక్కోటి దేవతారాధన నిర్దేశించి చెప్పుదురు. ఒకరికి మపంచకము లనబడు మద్య, మైథున, మాంస, మత్స్య, ముద్రలతో ఆరాధన నపేక్షించు దేవి, మరియొకరికి వాటి నిషేధరూపమగు ప్రక్రియలతో ఉపాసింపగోరు శక్తి; ఒకరికి చద్దినైవేద్యమునుగోరు మహాలక్ష్మమ్మయను వేపచెట్టు, మరియొకరికి జంతుబలినిగోరు తమోగుణ ప్రధానమగు నాంచారమ్మపూజ. వారు వారు తమకు వంశపారంపర్యముగ ఆ యా దేవతల ఆరాధనలకే అంకితము గావలయును. ఈ అర్చనా విధానములు ఆచార, అభ్యాసముల బలముతో, సంస్కారములు ప్రభవించి, సాంప్రదాయములై వారి వంశములయందు స్థిరపడి ఆనువంశికముగ శాశ్వతము లగును. పవిత్రవైదిక ధర్మములయందు ధర్మాచరణయందు విశ్వాసము గలవారి సంఖ్య నానాటికి

క్షీణించును. పరమతముల ప్రభావమునకు లోనగుటకు దోహదముగలిగి వాటియం దాకర్షణ పెంపొందుచుండును.

ఈ భిన్నతాత్త్వికపథము లిట్లుండ జగత్తుపై వీటిప్రభావ ప్రాబల్యము లెట్లుండునని యూహించిన-జగత్ అన జరుగుచుండునదని యర్థము. (that which goes on moving (ie) evolving from a lower to a higher state) దీనిని ఆంగ్లమున ఇవల్యూషన్ అందురు. జరుగుటయన నేమి? ఎచ్చటికి? తెనాలినుండి గుంటూరుకో విజయవాడకో గాదు. ఖనిజ, రసాయినిక, క్రిమికీటక, పక్షి, జంతు, మానవులయందు నిద్రాణముగ, నిష్క్రియముగ కొన్నిటియందు, చేతనముగ కొన్నిటియందుండు సాధారణ చైతన్యము (consciousness) క్రమశః హెచ్చు చైతన్యస్థాయిని పొందుచు పైపై భూమికలకు జరుగుటయే. Rising from a lower dorment state to a higher and higher intelligent and a well organised State (ie) to wards perfection is the process of evolution. చైతన్యస్థాయి అభివృద్ధిని అనుసరించి ఉత్తమోత్తమములగు సత్వగుణ ప్రధానములగు ఉపాధుల నభిమానించుటయే జగత్తు జరుగుననుట యందలి భావము. పుట్టుట, చచ్చుట యందలి రహస్యప్రయోజన మిదియే. ఇట్లు పరిణమించి పరిణమించి శుద్ధ చైతన్యస్థితిని, సత్యమును పొందుటయే భారతీయ తత్త్వశాస్త్ర లక్ష్యము. ఈ లక్ష్యము సర్వమానవులకు అనువగు అవసరమగు సత్యమే. తత్-త్వం- అసి అను మహావాక్యమునగల "త్వం" పద పరిధియందు ప్రతిమానవుడును యున్నాడు. పరిధినుండి కొందరు మానవులను త్రోసిపుచ్చిన ఆ పద మర్థహీనమే యగును. ఈ త్రోసిపుచ్చబడినవారే మందాధికారు లనబడుచున్నారు. మందాధికారులైనవారును మరి కొంతకాలము అభ్యాసముతో విషయగ్రహణము జేయగలరుగాని

మార్గములే భిన్నలక్ష్యములతో నుండ మోక్షప్రాప్తి ఎన్నటికి ? ఒకరికి ప్రతీకోపాసన, (idolatry) ఇంకొకరికి వృక్షజంతుపూజ (zooletry) మరికొందరికి సమాధి ఆరాధన (మస్తాన్ దరగా, బ్రహ్మంగారి సమాధి, సాయిబాబాసమాధి మున్నగువాటి ఆరాధన (toombetry) యిట్లు శాస్త్రము గాకపోయిననూ, మతాచార్యులు నిర్దేశించి బోధించుటచే—రాజస తామ సగుణవర్ధకముగ అధికారిభేదము గలుగునేమోగాని (అనగా ఉత్తమరాజ సుడుగనో, అత్యుత్తమ తామసుడుగనో అధికారిభేదము పొందగలడుగానీ) ఉత్తమ సాత్త్వికుడుగ రూపొంద నవకాశములు గోచరించుటలేదు. అతని ప్రగతి ఆ దిశలకే, అతని యధికారిత్వము ఆ భావములయందేగానీ సాత్త్విక మార్గములకు మరలజాలదు. సర్వులకు ఒకే బాటయగు వైదిక పథముననే సాధనల నిర్దేశించిన, తన ప్రగతినిబట్టి తన అధికారస్థాయిని సాధకుడే సాధించుకొన నవకాశము లభింపగలదు. అభిలాషయే అధికారిని జేయునుగానీ ఒకరిచ్చిన అధికారస్థాయియందు ఆ వ్యక్తికి ఆసక్తి చిత్త శుద్ధితో గలుగకపోవచ్చును. క్షుత్పిపాసల నెవ్వరడ్డగించగలరు ? తదితర ఉద్వేగముల నెవ్వ రవరోధింపగలరు ? అవి పరిధుల నతిక్రమించుటే సత్యమని, వరదలను చెలియలికట్ట లవరోధింప లేకపోవుటయే యుదా హరణ. ఈ సత్యమును మనము గ్రహించియుండినయడల యీనాడు వైదికధర్మ మింతకన్న బహుజనాదరణీయముగ, హెచ్చు సంఖ్యాబల ముతో, విశ్వసనీయమగు నొక మహాశక్తిరూపమున నుండియుండెడి దేమో ! ఒక్క విషయము పరమసత్యము. మానవుడు అవరోధముల నతిక్రమించి, పురోగమించి, ప్రగతి సాధించుచునే యుండును. ఉత్త మోత్తమ భూమికల నందుకొనుచునే యుండును. నందనార్ ఏజాతి మొల్ల దేకులము, వేమన కేమతము, శంకరున కేద్వైపము ? కాలచక్ర పరిభ్రమణజనిత పరిణామవిశేషముచే కొన్ని శతాబ్దముల తరువాత

నైననూ జడములుగ స్ఫురించు ఖనిజములయందలి సామాన్య చైతన్య మున్నూ పైపై స్థాయిలకు పరిణమించి ప్రభవించును. జనసామాన్యము యొక్క చైతన్యస్థాయి కొన్నివేలసంవత్సరముల పూర్వమున్న స్థాయికన్న పరిణామ ప్రక్రియచే యీనాడుచ్చస్థాయికివచ్చిన విషయము గమనార్హము, గణనీయము. కనుక ప్రస్తుతము వికసించియున్న విజ్ఞానస్థాయిని సమీ క్షించి ఒకే ఋజుమార్గము నెల్లరకుజూపి తరతమ భేదములతో వారివారి శక్త్యనుసారము తత్త్వజ్ఞానము నందరు గ్రహించి తరింపనసువగు నూత్న వ్యవస్థను రూపొందించు టవసరమేమోనని నాకు స్ఫురించుచున్నది.

అద్వైతం కే చిదిచ్ఛంతి । ద్వైతమిచ్ఛంతి చాపరే ।
సమం తత్త్వం న జానంతి । ద్వైతాద్వైత వివర్జితమ్ ॥

కొంద రద్వైతమునే వాంఛింతురు. కొందరు ద్వైతమునే వాంఛింతురు. కానీ ఉభయవర్జితమైన సమ (బ్రహ్మ) తత్త్వము నిరీక్షింప (గమనింప) నేరరుగదాయని దత్తాత్రేయులు అవధూతగీతయందు ఆక్రోశించెను. మాండూక్యోపనిషత్తు కూడ యీ భావమును పోషించుట గమనార్హము.

న నిరోధో న చోత్పత్తిః । న బద్ధో న చ సాధకః ।
న ముముక్షుః న వైముక్తిః । యిత్యేషా పరమార్థతా॥
(గౌడపాదాచార్యుల కారిక)

మతకర్తలు శాస్త్రకారులు నా యీ భావమును విచారించి న్యాయము చేకూర్చునెడల 'సర్వాత్మత్వము' ఎల్లరకు సిద్ధించి తరించగలరని విశ్వ సించుచున్నాను.

నమామ వేదమాతరం

## ఈ స్తోత్రభావముల గ్రహించుట కుపకరించు విషయ సంగ్రహము :

ఇహ పర సాధకమగు శాస్త్రము వేదాంతము. ఇది ప్రథమమున ఉపనిషత్తులయందు చెప్పబడియుండెను. తరువాత బ్రహ్మసూత్రముల యందు భగవద్గీతయందు పేర్కొనబడెను. ఈ మూడింటికి సాముదాయిక నామము ప్రస్థానత్రయము. వీటికి ద్వైత, అద్వైత, విశిష్టాఽద్వైత, ఆర్య సామాజికాది మతాచార్యులు పెక్కురు వారివారి దృక్పథానుసారము వ్యాఖ్యలు వ్రాసియుండిరి. ధర్మార్థకామములు, ఇహలోకమున శాంతియుత జీవితమునకు ప్రధానముగ సహకరించును. వీటి అనుష్ఠానమునకు ప్రవృత్తి మార్గమని పేరు. ఇవి భక్తి, ఉపాసన, కర్మాచరణ (నిత్య, నైమిత్తిక, కామ్య,) రూపము. చరమపురుషార్థమగు మోక్షమునకు సాధన "నివృత్తి" లేక జ్ఞానమార్గము. ఇందు ఇంద్రియార్థములనుండి వాసనలు, సంస్కారములు, సత్వరజస్తమో గుణములనుండి నివృత్తియే లక్ష్యము. ఇదియే ఋజుమార్గము. తత్త్వశాస్త్రము రెండేమాటలలో చెప్పవలెననిన ప్రవృత్తి (attachment) నివృత్తి (detachment) అని చెప్ప వచ్చును. ఈ వేదాంతమును బహుకాలము చదువవలెనందురు. అబ్బో! ఇదియేమి బ్రహ్మవిద్యయా? చదువుటకు కొన్ని జన్మలు కావలయునా? అను సూక్తులను వినుచునేయుందుము. కానీ, విషయమును విమర్శతో విభజించుకుని, (analyse) అర్థములను తేటగా, హృదయంగమముగ, విశ్వసనీయముగ బోధచేయగల సద్గురువు లభించినయెడల, గ్రహణశక్తి గల మానవునకు కొద్ది సంవత్సరములు చదివిన చాలునేమో యని నాకు తోచినది. కొన్నిజన్మలు కావలసినది సాధనకును తద్ద్వారా అనుభూతి నొందుటకు మాత్రమని విశ్వసింతును. ప్రకృతము క్రమపద్ధతులలో సాధన లేవందుననే, కొన్ని వంశపారంపర్య పద్ధతులలో పూజా విధా

నములు, సాధనప్రక్రియలు, వివిధ వికటరూపముల పరిణమించియుండుట వైదికమత అనుయాయులసంఖ్య క్షీణించుచుండుట కొక కారణమేమోనని స్ఫురించుచున్నది. చూడుడు.ప్రపంచమునక్రైస్తవులసంఖ్య820,000,000, ముస్లిములసంఖ్య 417,000,000, హిందువులనబడు వైదికమతస్థుల సంఖ్య 319,000,000, యని తెలియుచున్నది. యుగాంతరవయస్వియగు వేద మతము శతాబ్దాంతర వయస్సుగల మతములకు సంఖ్యాబలమున నింత తగ్గియుండు దుర్విధికి కారణము మత తత్త్వశాస్త్రమున పటిమలేకనా? ప్రక్రియల వైవిధ్య వైషమ్యదోషమా? ప్రచారమునందలి లోపమా? శుద్ధికర్మను నిషేధించినందుననా అను అంశములు చర్చనీయములు.

పై పేర్కొనబడిన ప్రస్థానములయందు కేవల శాస్త్రవిషయక మూలసూత్రములు మాత్రమే యథాతథముగ శాస్త్రపారిభాషిక పదముల తోడనే చర్చింపబడి యుండుటచే శంకరులుచెప్పిన తత్త్వశాస్త్రమునకు ఒక అద్వితీయప్రతిష్ఠ లభించినది. దీనిని ఆంగ్లమున Intellectualism అందురు. ప్రేమి ప్రేమికుల అనురాగ విరహ విశేషముల పురస్కరించు కొని అంగాంగివిలాస వర్ణనములతో శృంగారరసము వెల్లివిరియ సాధా రణ మానవునకు సహజముగ సిద్ధమైయున్న విషయలౌల్యమును రెచ్చ గొట్టజేయు మాటలు, పాటలు, భావములతో మధురభావమును భక్తిభావ మును చిత్రించి, రూపొందించి నిర్దేశింపబడిన ప్రక్రియలు అన్యమతస్థుల విమర్శలకు గురియైనవి. పరమతముల వారపహసించ నవకాశములేనటుల, విషయ ప్రతిపాదనకు, శాస్త్రచర్చలకు మాత్రము పీఠమునమర్చి భారతీయ తత్త్వశాస్త్ర ప్రతిష్ఠను ప్రతిష్ఠించిన శ్రీ శంకర భగవత్పాదులు పాశ్చాత్య తత్త్వవేత్తలకుకూడ ఆరాధ్యులైరి. వీరి ప్రకరణ గ్రంథములయందుగాని, ప్రస్థాన గ్రంథములయందుగాని, అర్థవాద వాక్యముల కవకాశము గల్పించు స్తోత్రముల యందుగాని, కేవల జీవేశ్వర జగత్తులు, కార్య

కారణమును మాత్రమే స్పృశించి చర్చించబడినవి. కస్తూరీ చందనలేప చారుచర్చలతో, పారమార్థికరుచి విహీనమగు నాల్కతో "పాలూ పంచదారలకన్న నీ నామ మెంతరుచిరో ఎంత రుచిరో" అని ప్రలాపింపజేయు పాటలతోగాక. సుమనో మనోహరసుమ పరిమళ ప్రశంసలతో, స్వర్ణసింహాసన రత్నఖచిత మకుటముల ప్రశంసలతోడను గాక— త్రిగుణ భస్మీకృత భస్మధారణతోడనే, చిత్తైకాగ్రతకు సహకరించు పదములతోడనే, విలాసవిన్యాస ప్రసక్తిలేకయే, జీవేశ్వర ఏకత్వమును, జగన్మిథ్యాత్వమును, విమర్శించి సన్మాత్రదర్శనము చేయించి పాఠకులచే "అహం బ్రహ్మాస్మి" యనిపించిన శ్రీ శఙ్కరుల దక్షిణామూర్తి స్తోత్రము భారతీయ తత్త్వశాస్త్రమునందలి నవనీతమే అయియున్నది.

శంకరుల బోధనాసరణి కేవల వైజ్ఞానిక విధానమున నుండును. దీనిని intellectulism అని చెప్పవచ్చును. ఇతర మతబోధకుల సరణి యందు భావముల కల్పనజేసికొని, చిత్తవృత్తుల నుద్రిక్తపరచుకొని ఆనందము నాహ్రుతము జేసికొను విధానము స్ఫురించును. దీనిని acquired emotionalism అని చెప్పవచ్చును. అనగా వివిధభక్తి ప్రక్రియలలో నొకదానిని గ్రహించి రంగస్థల నటునివలె రసభావముల నుద్రిక్తపరచుకొని శరీరమునందు ప్రకంపనములను, మనస్సునందు స్పందనములను ఉత్తేజపరచుకొని పొందు ఆహృతమగు ఆనందము. (acquired emotional pleasure which is Rajasic in essence, caused by imaginery physical gyrations and mental vibrations that ooze out amourous succulence) శంకరుల వైజ్ఞానిక సరణియందు కేవల పారమార్థిక స్ఫోరకమగు నొక గంభీరభావమును హృదయంగమముగ గ్రహించినప్పుడు, పొందు అనుభూతిచే లభ్యమగు సాత్త్వికానందమే ప్రాప్యము. ఇది సహజము, అనాహ్రుతము నగు నొక సాత్త్విక మానసోల్లాసము. This is bliss in

essence or Spiritual ecstacy but not pleasure aequired by emotions or temporal elements.

పూర్వపక్ష సిద్ధాంతములు స్వయముగా సంకల్పించి, వేసిన భారతీయ తత్త్వశాస్త్ర భవనమునకు మూల స్తంభములుగ, కోట్ల సంవత్సరముల వరకు చెదరని పునాదులపై, భారతీయులకు శాశ్వతకీర్తిజ్యోతిని ప్రసాదించిన శ్రీ శంకరులకంటే ప్రపంచమున అభినందనీయు డెవరు? తన 8 వ సంవత్సర ప్రాయముననే ఈ బ్రాహ్మీభావమును స్వానుభూతితో ఎవ్వరందించగలరు? శ్రీ శంకర పూజ్య పాదాః విజయ తేతరామ్ !

ప్రకృతము : తత్త్వత్రయ మనబడు, జీవేశ్వర జగత్తుల చర్చయే తత్త్వశాస్త్రమునకు విషయమని తెలిసికొంటిమి. ఈ మూడు అంశముల పురస్కరించి పలువురు మేధావులు వారి వారి దృక్పథములను, వాదములనుపేర (View points and theories) ప్రతిష్ఠించిరి. ఇట్టి షడ్దర్శనముల యందును, ఉపనిషద్భాష్యములయందును గాననగును. ఇట్టి వాదములను సమీకరించి, క్రోడీకరించి, విచారసాగరము, వృత్తిప్రభాకరమును తమ హిందీ గ్రంథములయందు సాధుశ్రీ నిశ్చలదాసుగారు ప్రస్ఫుటీకరించిరి. ఇవి ఆంధ్రీకరింపబడియున్నవి. వీరికి పూర్వమే శ్రీ అప్పయ్య దీక్షితుల వారు సిద్ధాంతలేశ సంగ్రహమనెడి తమ అద్వితీయ గ్రంథమున క్రోడీకరించి వెలయించిరి. జగత్తు, జీవుడు, ఈశ్వరు డను మూడు తత్త్వముల విచారణయే వేదాన్తశాస్త్ర వస్తువు గనుక ఈ వాదములను మూడు విభాగములుగ జేసికొని మనము విషయగ్రహణము జేయుట సముచితము.

I. జగద్విషయక వాదములు : (Cosmological Theories) ఇందు 1 పరిణామవాదము 2 ఆరంభవాదము 3 వివర్తవాదము ప్రధాన

ములు. వివర్తవాదమున కనుబంధముగ ప్రారంభకులకు సృష్టి దృష్టి వాదము, ప్రౌఢులకు దృష్టి సృష్టి వాదము. బోధనా సౌలభ్యమునకుగాను విభజించి తెలుపబడెను. ఈ దృష్టి సృష్టివాదమున, మరల ప్రమాతృ వివర్తము సాక్షివివర్తమనియు ద్వైవిధ్యముగలదు. విచారింతము.

II జైవవాదములు : (Psychological Theories). "సైకి" యను పదము ఆధునిక ఆంగ్లశాస్త్రములయందు మనస్సును సూచించుటకు వాడబడును. సైకాలజీ అన, మనస్తత్త్వ శాస్త్రమనియు ప్రసిద్ధమైయున్నది. కాని, ప్రాచ్యశాస్త్రముఅయందలి భావానుగుణముగ సైకి (Psyche) అను పదము జీవుని (Soul) సూచించును. కనుకనే దీనిని జైవవాదము లందుము. ఇందు బింబ ప్రతిబింబవాదము, ఆభాస వాదము, అవచ్ఛేద వాదములు ప్రధానములు. ఆభాస వాదమునందును ద్వైవిధ్యముగలదు. ఎట్లన— అద్వైతులు చెప్పునది మిథ్యాపూర్వకమగు ఆభాస (manifestation by illusion only): శాక్తేయులు చెప్పునది ఆవిష్కరణలేక విభూతిరూపమగు ఆభాస (simple manifes. tation with out any illusion). దీనినే "విభవము" నియు అందురు. N. B. ప్రాచ్యభాషలయందు "మిథ్య" యను పదమునకన్న "అధ్యారోపము" అను పదము, ఆంగ్లమున 'illusion' అను పదముకన్న 'Super imposition' అను పదము భావములను సుబోధకము జేయగలవని విశ్వసింతును.

III ఈశ్వరవిషయక వాదములు: (Theological Theories) ఇందు సగుణ నిర్గుణములు, సాకార నిరాకారములు, సవిశేష నిర్విశేషములు, కేవలాద్వైత విశిష్టాద్వైత విషయములు చర్చనీయములు.

I ఇక మొదటి విభాగమగు జగద్విషయక వాదముల ప్రయోజన మెట్టిదన :—

1. పరిణామసత్య పదార్థ మేది? పారమార్థికసత్య పదార్థమేది? అనగా నిత్యానిత్య వివేక సంప్రాప్తి.

2. కార్యస్వరూపము కారణస్వరూపము ఏకమా, భిన్నమా, అభిన్నమా? ఈ కార్యకారణము లనన్యములా? (homogeneous) అన్యములా (hetrogeneous) వీని కిటి సంబంధ మెట్టిది?

3. ఆదికారణము (first cause) ఒకటియుండెనా? అగునెడ అది ఎట్టిది? ఇదియే తత్త్వశాస్త్రమున కీలకమగు ప్రశ్న.

4. రెండవవిభాగ విచారణవలన జీవేశ్వరజగత్తు లధ్యారోపితము లగునెడల ఈ అధ్యారోప త్రితయమునకు అధిష్ఠానపదార్థ మొక్కటియేనా? అని తెలియుట.

5. తత్త్వత్రయాధ్యాస తొలగినగాని కేవలాధిష్ఠానమగు ప్రత్యగభిన్న బ్రహ్మసాక్షాత్కారము గాదను తాత్పర్యమును గ్రహించుట.

1. పరిణామవాదము : దీనిని గుణపరిణామ వాదమందురు. అనగా సత్వరజస్తమో గుణములు వికారముపొందు ప్రక్రియ. పరిణామ మన ఉపాదానమునందు కలిగెడి మార్పుచే రూపభేదము లేర్పడుట. ఉపాదానమన ఒక కార్యము దేనియందు పుట్టి కొంతకాలము స్థితినొంది మరల తన ఆవిర్భావమునకు మూలమగు అదే పదార్థమునందు లయమును బొందునో. ఆ పదార్థము ఉపాదాన మనబడును. ప్రకృతియందు గలిగిన గుణపరిణామముచేతనే ముందు బంగారము ఘటించి మనకు లభించినది. దానితో వివిధ ఆభరణములు చేయించితిమి. మరల వాటిని కరిగించితిమి. ఇప్పుడు మరల ఉపాదానమగు బంగారు లభించినది. దీనిని ద్రవ్య వికార పరిణామమందురు. అయినను యీ ద్రవ్యమున కుపాదానము

త్రిగుణాత్మకమగు మూల ప్రకృతియే యగునని గుర్తించుకొనవలయును. అనగా ప్రకృతికంటె దాని వికారములు వేరుగావని, ద్రవ్యము, పరిణామ సత్యమని పర్యవసించును. This is the theory that maintains that all causality is a process of transformation.

మూలప్రకృతి సత్త్వరజస్తమో గుణముల సామ్యస్థితి. మీమాంసకులు జెప్పిన కర్మఫల బీజములగు సంస్కారములను సాంఖ్యులు గుణములుగ విభజించిరి రజోగుణ స్వభావమగు స్పందనచే యీ సామ్య స్థితికి భంగము గలిగి ప్రకృతి "మహత్తను" సృజనయోగ్యస్థితికి వచ్చును. ఇది పరాప్రకృతి యందలి బిందుస్థితి వంటిది. రజస్సునందలి స్పందన శక్తి పరాప్రకృతియందలి నాదము వంటిది. ఈ మహత్తునుండి క్రమశః అహంకారము (sense of Egoism) పంచతన్మాత్రలు (pure elemental ultimates) పంచ మహాభూతములు (Coalesed ele. ments) అందుండి దృశ్యమాన సృష్టి జరుగుచున్నది. ప్రకృతిమాత జగత్తుగ, అందలి జీవకోటి మనుగడకు జీవభోగ్యములగు ఓషధులుగ ద్రవ్యములుగ, మార్పుజెందుటయే గుణపరిణామ ప్రక్రియ. ఇందుచేత నే పరమాత్మ పరమ దయామయుడనియు, కరుణాసింధువనియు మనము స్తుతింతుము. పరిణమించునది పదార్థమే గనుక, గుణములన పదార్థము యొక్క సూక్ష్మాతి సూక్ష్మచరమస్థితులు (The gunas may be known as Monads or the elemental ultimates which could convey life to the substances they come in contact). గనుక దీనిని గుణపరిణామ మనిరి.

కార్యము ప్రాదుర్భావము చెందుటకు ముందేకారణమునందు సూక్ష్మరూపమున నుండుననుటచే సత్కార్యవాదమనియు అనబడును. (The Theory that maintains the prior existance of the effect in its Causal form is Satkary avadam).

ఇప్పుడు ఒక అభ్యంతరము ఎదుర్కొంటూ యున్నది. పరిణామి యగు ఉపాదానము జడముగదా! అందుచే పృథక్సత్త లేదుగనుక స్వయముగా పరిణమింప నసమర్థము అని. కనుక యీ విధమగు పరిణామ వాదము అంగీకార యోగ్యముగాదని అద్వైతులు త్రోసివుచ్చిరి. మరియు ఒక కుండ తయారు చేయవలెనన్న, మృత్తిక ఉపాదానమే యగును అనగా మూలపదార్థము (material cause). ఐనను ఒక కుమ్మరి యొక్క తెలివియనునది క్రియారూపమున సహకరించని యెడల కుండకు రూపము గలుగదు, నామము ఘటించదు. ఈ తెలివినే నిమిత్త కారణ మందురు (intelligent cause). సారె, దర్ర, నీరు మున్నగునవి సహకార నిమిత్తములుగ నుపకరించినను ప్రయోజనము గలుగదు. దీనినిబట్టి యూహించిన జగత్తు రూపొందుటకు ఒక జ్ఞాతయగు, ఇచ్ఛా క్రియాశక్తి యుక్తమగు జ్ఞానతత్త్వ ముండవలయునని స్పష్టమగు చున్నది. అదియే చేతన నిమిత్తకారణము అని వేదాంతులు చెప్పగా సాంఖ్యులు మరల నొక ప్రశ్న వేసిరి. బ్రహ్మవస్తు అన్యపదార్థమింకొకటి లేదని ధృవపరచి చెప్పితిరిగదా! ఒక ఉపాదానము, దానిని ద్రవ్యము లుగ రూపొందించుట కొక నిమిత్తము రెండును గలవని చెప్పుచున్నారు. ఇది అద్వైత పదమునకు భంగము కలుగజేయుచు లేదా యనిరి. అందుకు అద్వైతులు, ఉపాదానము నిమిత్తము వేరుగావు, ఈ రెండిటి భేదములేదు, కనుక అభిన్ననిమిత్తోపాదానమే జగత్తునకు కారణమని ఉపనిషత్తులు చెప్పిన వనిరి. (undifferentiated matter and spirit as the cause of Jagat is Abhinna Nimittopadanam.) కనుక దీనిని చేతన నిమిత్తోపాదాన కారణమనిరి. ఇది వివర్తసూచకము. (This suggests the idea of Vivartha). ఇందుకు శాస్త్రములయందు ఊర్ణనాభిని (సాలెపురుగు) ఉదాహరణముగ నిచ్చిరి. అది తన శరీరమును ఉపాదానమునుండి తంతువును సృజించి అందును తానే నిమిత్తకారణ

మగుట గమనింపవలెను. పరిణమించునది అజ్ఞానము. పరిణమింప జేయునది ప్రజ్ఞానము. ఇందుచే అజ్ఞాన ప్రజ్ఞానములు మిధున రూపమగు ఏకైక పదార్థము మాత్రమేనని తెలుచున్నది. (The one only with necience and divine knowledge, as two aspects of the one; or it may be said that they are two apparent opposites which exhibit the property of Polarity and are in essence an integral whole. Polarity is the disposition in a body to exhibit opposite properties in opposite directions as the attraction and repulsion at the opposite poles of a magnet )

ఈ భావమును మనము వస్తుదృష్టితో జూచిన (deductive view) ఒకే పదార్థమే సంభావ్యము (లక్ష్యముగ లభ్యమగును). అన్యధా పరిశీలించిన (ఇప్పటి దృష్టితో) జూచిన (Inductive view) ద్వంద్వమే (duality) సిద్ధించును. ఆత్మ - అనాత్మలకు, ప్రకృతి – పురుషులకు బాధసామానాధి కరణ్యము అద్వైతులచే నంగీకరింపబడినది అనగా కారణము కార్యము రెండుగా గోచరించినప్పుడు, వీనిలో దృశ్యమును భ్రాంతిజన్యముగ, ప్రాతిభాసికముగ (transcient evolute of ignorence) అపవదించి (negation=బాధ) అధిష్ఠానమును మాత్రమే అంగీకరించుట బాధసామానాధి కరణ్యము. ఇది అద్వైతుల ప్రక్రియ. దృశ్యమును దృక్కును రెండిటిని చేర్చియుంచియె అభేదము నంగీకరించి ఏకాశ్రయత్వమును జెప్పుట ముఖ్య సామానాధి కరణ్యము. ఇది విశిష్టాద్వైతుల ప్రక్రియ. వ్యధికరణ మన రెండు భావములకు సమానమైన ఆశ్రయము. అనగా యిందు ఆశ్రయము విడిగా నుండును. ఒకరు ఒక కుర్చీపై కూర్చొని యున్నప్పుడు అతనికి ఆ కుర్చీ వేరైయుండియు ఆశ్రయముగ నుండుటను వైయ్యధికరణ్యమందురు. ద్వైతులు యిట్టి

పై య్యధికరణ్యము నంగీకరింతురు. అధికరణ మనఆశ్రయము. ఇది (concrete noun), అధికరణ్యము (abstract noun)

## కార్యమునకు (జగత్తు) కారణమునకు (చైతన్యము) భేదమా ? అభేదమా ? అనన్యత్వమా ?

కార్యమగునది జడము, కారణమగునది చైతన్యమనిశాస్త్రప్రోక్తము. పరిణామ వాదమును సాంఖ్యులు స్వీకరింతురు. వీరి మతమున జడమైన ప్రకృతి జగదాకారముగ పరిణమించును. పురుషుడు చేతనతత్త్వము, ప్రకృతి జడతత్త్వము రెండును నిత్యములు. కానీ భిన్నతత్త్వములు. కార్యాకారముగ పరిణమించునది ప్రకృతియేగానీ పురుషుడు నిర్లిప్తుడు. ఈ విధమున జడచేతనముల రెంటిని సత్యములుగను తత్త్వములుగను అంగీకరించినందున పదార్థ పరిణామవాదము అనుమాన ప్రమాణవాదులగు న్యాయవైశేషిక సాంఖ్య విశిష్టాద్వైతులు చెప్పెడి ప్రక్రియగ తెలియబడు చున్నది. ప్రళయమునందును జగత్తు ప్రకృతియందే పర్యవసించును.

అద్వైతమున ప్రకృతి ఒక తత్త్వముగ అంగీకరింపబడదు. ఆత్మ ఒక్కటియే తత్త్వము. ప్రకృతి అధ్యస్త శక్తిగ పరిగణింపబడును; జనను సృష్టిదృష్ట్యా అనిర్వచనీయమనియే చెప్పబడుచున్నది. ఆత్మాంతర్గతమై సృష్టి కార్యమున కుపకరించును. ఇది అవిద్య మాయాశబ్దములచే వ్యవహరింపబడును. తత్త్వసాక్షాత్కారానంతరము ప్రకృతి బాధింపబడి (నివృత్తమై) కేవల బ్రహ్మమాత్రమే పర్యవసించును. కార్యకారణము లకు అభేదము నంగీకరించుచో – కారణమను బ్రహ్మ సత్యము గనుక కార్యమగు జగత్తుకూడ సత్యమనియే అంగీకరించవలసి వచ్చును. "అనన్యత్వమను" పదము కార్యము కారణముకంటె వేరుగాదు. కారణ సత్తచేతనే కార్యము స్ఫురించు చుండుననుభావమును దృఢీకరించును.

కార్యమగు జగత్తు స్వతః సత్త లేనిదగుటచే అది పదార్థమేగాదని సిద్ధాంతీకరించబడినది. అందుచే జడమైన జగత్తు ద్వైతము నాపాదింప జాలదు. చేతన తత్త్వమొకటియే జగద్రూపమున భాసించుచున్నదని యర్థము.

ఒక శంక : నామరూప క్రియారహితుడగువాడు జగద్రూపమునకు పరిణమించునెడల కారణమగు పరమాత్మ గుణములు జగత్తున కేలలేవు? జగద్వికారములు, వృద్ధిక్షయములు మొదలగునవి కారణమునను ఆపాదిత ములను పక్షమున కారణము వికారము పొందనిదనియే చెప్పవలయును. లేక చైతన్యమే జడముగా పరిణమించినదను నెడల అట్లగుటలేదు. అనగా జగత్తు తన కుపాదానమగు బ్రహ్మయొక్క సచ్చిదానంద స్వరూప ముననే భాసిల్లవలయునుగానీ రాగద్వేష దుఃఖభయాదులతో గూడి యుండకూడదుగదా! అందుచే అద్వయవాదులు చెప్పునదేమన :— చైతన్యము జడరూపముగ పరిణామము పొందదు. ఒక నిమిత్తము లేక జడమునకు పరిణామ ముండదుగదా! గడ్డి జడమైనను ఆవు యందలి చైతన్యముచే పాలుగా పరిణమించు చున్నది. కానీ పాలకు గడ్డియే కారణముగాదనియు, చైతన్య ప్రభావమే పరిణామ ప్రక్రియకు మూలమనియు గ్రహించనగును. అజ్ఞాన పరిణామము చేతనే. వివర్త ప్రక్రియానుసారము జగత్తు భాసించును లేక స్ఫూర్తి నిచ్చును. కొంత స్థితికాలము గడచిన తరువాత, వివర్తముగ భాసించిన ప్రకృతియే శక్త్యాకారముపొంది చైతన్యమునందు లీనమగుటచే; అద్వితీయ చైతన్యము కేవలముగ పర్యవసించును. (The subtle appears as the gross and when the gross resolves itself into the spirit, the spirit only results.)

కార్యమును విలోమదృష్ట్యా పరికించిన పంచభూతములుగ, తన్మాత్రలుగ, అహంకారముగ, మహత్తుగ గుణత్రయముగ మార్పులచెందు పరిణామియగు. ప్రధానమనబడు, మూలప్రకృతియందే లయమగుట, మూలప్రకృతి, పరాప్రకృతి శక్తిరూపము నొంది బ్రహ్మయందు విలీనమగుట గమనించవలసినది. సాంఖ్యులు చెప్పు పరిణామప్రక్రియ యిట్టిదిగాదు. వారు కార్యకారణములు రెండును సత్యమనియే చెప్పుదురు. వేదాంతులు కారణము సదాసత్యము కార్యము ప్రాతిభాసికము గనుక అసత్యమనియు చెప్పుదురు. అనగా కార్యము కారణము లనన్యములని భావము, ఇది అద్వైత సిద్ధాంతము నందొక మూలసూత్రము.

న వయం కార్యకారణయోః అభేదం బ్రూమః।
కింతు భేదం వ్యాసేధామః (భామతి వ్యాఖ్యానపత్రిక)

అనగా మేము కార్యకారణములకు అభేదమని చెప్పము. మరేమన భేదమును నిషేధించుచున్నాము అని భావము. Cause alone exists. What you perceive as effect is nothing but the cause. ఈ భావమే అద్వైతుల పరిణామ ప్రక్రియను తెలుపునది. ఇది అజ్ఞాన పరిణామరూపమగు వివర్తభాసము. ఒకే బ్రహ్మపదార్థముయొక్క స్థూల సూక్ష్మస్థితులుగా భేదప్రతీభాస మనుటయే యగును. కానీ కార్యకారణముల కభేదముచెప్పుట యనగా రెండు నొకటని అంగీకరించుటయే. కార్యము మిథ్య. కారణముమాత్రము నిత్యసత్యమనువారికి భేదాఽభేదముల ప్రసక్తియుండదు అనగా వేదాంత పరిభాషలో కార్యము లేనేలేదు అని చెప్పుట. జగత్తును పరిణామ వాదానుసారము పరిగణించిన అభేదమనుపదము. వివర్తవాదానుసారముగ చెప్పిన అనన్యత్వమను పదము వర్తించును.

ఒక శంక : "పాదోస్య విశ్వాభూతాని, త్రిపాదస్యామృతం దివి" అను మంత్రమున పూర్ణుడగు బ్రహ్మయందు నాలుగవభాగము మేరకు భూతాదిగ, విశ్వముగ పరిణమించి వికారము పొందినట్లున్నదే, యిది స్వగతభేదమే యగుగదా ? అద్వైతుల బ్రహ్మకు స్వగతభేద మెట్లు పపన్నమగును ? ఇందుకు సమాధానము : రజ్జువునందు సర్ప మభివ్యక్త మైనట్లే అధిష్ఠానమగు బ్రహ్మయొక్క పాదభాగమున జగత్తు, వివర్తముగ ప్రశ్నించువారికి అనగా ద్వైతదృష్టి గలవారికి గోచరమగుచున్నది. అనగా అజ్ఞానపరిణామమేగానీ బ్రహ్మయం దెట్టి పరిణామమున్ను లేదని భావము. రజ్జువుకంటే సర్పమునకు స్వతంత్ర సత్తలేనట్లు ఈ అభివ్యక్త ప్రాతిభాసిక పాదమునకు (జగత్తుకు) స్వతంత్రసత్త లేదనిమాత్రము గ్రహింపనగును. ప్రాతిభాసిక కాలమున రజ్జువుకింటే సర్పము భిన్నము గానట్లు, యీ జగత్తు ప్రాతిభాసికసత్త లేనిదియే. అవిద్యాదృష్టియందు ఆకాశమున భాగములు గోచరించినట్లు అవిభాజ్యమగు బ్రహ్మయందు పాదకల్పన శ్రుతిమాతచే బోధనాసౌలభ్యము కొరకే అనుగ్రహింపబడి నది. వ్యావహారిక సత్యములో పరిణామోపాదానము వివర్తోపాదానము అను ద్వైవిధ్యము గలదు. ప్రాతిభాసిక సత్యములో పరిణామ ప్రసక్తియే లేదు. సర్వము ఆభాసయే, ఒక్క బ్రహ్మకే అభిన్న నిమిత్తోపాదానత్వము వర్తించును. కనుక పంచభూత మూలమగు జగత్తుకు పాదకల్పన ప్రాతి భాసిక కాలమునదప్ప పారమార్థికమున నుండదు.

ఇక జగత్తత్త్వ విషయమై శాక్తేయులు చెప్పు ప్రక్రియను కొంచెము తెలిసికొందము. సాపేక్షికదృష్టితో జూచినయెడల పరిణామము సత్త్వరజస్తమో గుణాత్మకమగు నీ ప్రకృతినుండియే ప్రారంభమగును. చరమదశయందు పంచీకృత పంచభూతములవరకు వచ్చి, వాటియంశల సంకల్ప, వికల్పములచేతనే (Coalition and division) సృ

కళారూప ప్రపంచోత్పత్తి యగుచున్నది. ఈ మూలప్రకృతి యంతర్గత ములగు భువర్లోక, సువర్లోక, మహాలోక, తపోలోక, సత్యలోకములని చెప్పబడు (హిరణ్యగర్భలోకమనెడి అపర సత్యలోకము) నవి అపరా ప్రకృతిభూమికలే. పరాప్రకృతికి సంబంధించిన వేవన శివ, శక్తి, సదాశివ, ఈశ్వర, శుద్ధవిద్యాతత్త్వములు. అందుచే పరిణామ ఆరంభ వాదకుల దృష్టి యీ భూమికలకు పోలేదని ఎఱుంగవలసి వచ్చును. సృష్టిక్రియ నిర్గుణ పరమాత్మయందు గలుగు క్షోభణ లేక ఇచ్ఛాశక్తి అనునార ఆద్యస్పందనతో (primordeal tumult or Stress) ప్రారంభ మగును. ఈ స్పందనచే శబ్ద, అర్థ, ప్రత్యయములు (Sounds, things and thoughts) అనబడు మాయాశక్తి విభూతులు గలుగును. ఇవి పరమాత్మయొక్క స్వరూపగతములేగాని అన్యములుగావు. ఆయనయందు గల కారణశక్తి ప్రేరణచేతనే (Causal Stress) అవి యుద్బుద్ధ మగును. ఆయన సర్వవ్యాపకుడు. కనుక ఆయనచే వ్యాప్తమగున దంతయు సత్యలోకము లేక శివలోకము, మహత్తులోక మందురు. మనము వ్యవహరించుటకు ఆయనకు పరమశివుడని పేరు (వ్యవహార నామము). ఆయన పంచకోశములను, రజోగుణాత్మకమగు ప్రాణ శక్తిని, మలిన సాత్త్వికాంశమగు మనస్సును అతిక్రమించినవాడు నిష్కలము (రూపముగాని అవయవములుగాని లేనివాడు), నిష్క్రి యుడు (అచలుడు) నిరంజనుడు (నిర్వికారుడు) ప్రపంచప్రక్రియకు ఆదికారణభూతుడు. ఇతడే పరమేశ్వరుడు లేక పరమాత్మ. ఈయన యందు పంచవిధములగు అవ్యక్తసృష్టి (unmanifest creation) జరు గును. ఇందు మొదటిది శివతత్త్వము. ఇదియు 'చిత్' లేక ప్రజ్ఞానము (Consciousness) ప్రధానము. రెండవది శక్తితత్త్వము. ఇది శివ తత్త్వమునకు భిన్నముగాని అనుటకు తరువాతిదిగాదు. శివశక్తి తత్త్వ ములు రెండును అంతర్ముఖ బహిర్ముఖములగు ఏకతత్త్వము మాత్రమే.

ఇందు ఆనందము ప్రధానము. మూడవదియగు సదాశివతత్త్వమున సత్ యొక్క అనుభవమునకు నాంది జరుగును. ఇచ్చట ఇచ్ఛాశక్తి ప్రధానముగ ప్రాదుర్భవించును. నాల్గవదియగు ఈశ్వరతత్త్వమున జ్ఞానశక్తి ప్రాదుర్భవించును. అయిదవదియగు శుద్ధవిద్యాతత్త్వమున క్రియాశక్తి ప్రధానము. ఈ అయిదు తత్త్వములున్నూ శుద్ధనిర్గుణ తత్త్వమునందు భిన్న ప్రాదుర్భావములకు నాంది వంటివి. సత్త్వరజస్తమోగుణ సంబంధములేని శుద్ధ తత్త్వములు. బీజమునకు అంకురమువంటివి. కార్యమునకు కారణ రూపములు. ఇంతవరకును శుద్ధసృష్టి గుణరహితమగు శుద్ధమాయ, లేక పరాశక్తి లేక పరాప్రకృతియందు సంభవమగు భూమికలు. ఇక మూల ప్రకృతినుండి మాయికమగు మలినసృష్టి ప్రారంభమగును. ఇటనుండి సాంఖ్యులు దెలుపు సత్త్వరజస్తమో గుణాత్మకమగు మాయాశక్తి విజృంభించును, దృశ్యమాన సృష్టికి నాందియగును. ఇది అనులోమ ప్రక్రియన జరుగును, రజోగుణ స్పందనలచే మూలప్రకృతి సామ్యావస్థయందు క్షోభ గలిగి మహత్తుగ (matter rendered suitable for creation or manifestation) అందుండి అహంకారము, అందుండి పంచ తన్మాత్రలు, అందుండి పంచమహాభూతములు, ఆవిర్భవించి ప్రకృతి తల్లి, మనము బిడ్డలముగా ప్రసవకార్య మారంభమగును. ఈ మాయ, ఆవరణ (veiling) విక్షేపము (distration) అను తనశక్తులచే, భేద భావము, నానాత్వములను కల్పించి అధిష్ఠానమును మరుగుపరచుచు కార్యరూపమునకు వచ్చును. ఇందుచే అనంతుడు పరిమితునివలెనగును (The infinite becomes apparently finite). ఈ దేశము వాడను, యీకాలమందుంటిని యని దేశకాలముల సృష్టించుకొనును (becomes limited by space and time). నేను, నాదియను భావములచే ప్రభావితుడగును. "శిష్యాచార్యతయా తథైవ పితృపుత్రాద్యాత్మనా భేదతః" అను జీవభావపూరితుడగును. పిమట 1) కాలము 2) నియతి

(దేశము) 3) రాగము (కోరిక) 4) విషయమునకు సంబంధించిన పరిమితజ్ఞానము (వికల్పము) 5) కళ (పంచీకృత పంచమహాభూత సమ్మేళనముతో జరుగు రూపకల్పన) అనబడు పంచకంచుకములు (అయిదు చొక్కాలు) తొడుగుకొని "పుణ్యముకొద్దీ పుట్టులాడయ్యా పురుషుడు" అన్నట్లు జన్మనొందును. ఇక ప్రకృతి రంగస్థలమున తెర యెత్తబడి జీవితనాటకము ప్రారంభమగును. సూక్ష్మమునుండి స్థూలమునకు, జ్ఞానమునుండి అజ్ఞానమునకు, ఆనందమునుండి అహంకారమునకు వైకుంఠపాళి పటమునందలి నిచ్చెన. పై మెట్లనుండి క్రిందిమెట్లకు అవరోహించును. కామక్రోధలోభ మోహమదమాత్సర్య పూరితుడగును. ఇక ధర్మరహిత అర్థప్రపంచము తనదే. ఇందు మూలప్రకృతికి పైగల అయిదు శుద్ధతత్త్వములు పరాప్రకృతిగ తెలియబడుట గమనీయములు.

శబ్దసృష్టి : "వాగేవ విశ్వాభువనాని జజ్ఞే" (ఐతరేయ బ్రాహ్మణము) శబ్దసృష్టి లేనిదే అర్థసృష్టి గలుగదని శాస్త్రములు చెలుపుచున్నవి. క్రైస్తవమునకూడ In the begining there was the word and the word became flesh అని చెప్పబడినది పరమాత్మ శబ్దబ్రహ్మ. ప్రపంచము శబ్దమునుండియే ప్రాదుర్భావమైనదందురు. శబ్దమన పరబ్రహ్మబోధక నాదరూపము. ఇది అనాహతము. అనగా రెండితాకిడివలన పుట్టినదిగాదు. ఇది ఒక సూక్ష్మస్పందన విశేషము. దీనిని ధ్వని యందురు. అది అంతర్నాదము లేక పరారూపనాదము. ఆ నాదమే వాక్కునకు బీజమగు బిందువు. తరువాత గలుగునది పశ్యంతి. దీనికంటే స్థూలరూపమగు తరువాతి స్థితి మధ్యమా. దీని స్థానము కంఠము. ఇది తాల్వాది స్థానములలో అచ్చట అన్యశ్రవణ యోగ్యముగ స్ఫుటమగు స్థితియే వైఖరి. ఈ వైఖరీ రూప స్థూలరూపమే గురుశిష్య పరంపరా బోధ్యబోధక సంబంధ ఆధార వాఙ్మయము — ఆమ్నాయము. ఇందు పరా

యనునది ధ్వనికి ప్రథమ స్పందన కారణరూపము. ఇదియే నాదము. పశ్యంతీ మహాబిందు తత్త్వము. ఈ శివశక్తి రూపక నాద బిందువులే తరువాత రానున్న కళకు (సృష్టికి) ఆధారము. వీనినుండియే ప్రతిబింపుదువు లుద్బుద్ధమగును. ప్రతిబిందు రూపక కామకళయే తంత్రశాస్త్రములందు కారణ ప్రితయములని చెప్పబడెను. (the three fold causes) ఇవియే ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులు, బ్రహ్మ, విష్ణు, రుద్రనామక, సృష్టి స్థితిలయ కారకశక్తులు. ప్రపంచమున ప్రతిభూతమున్ను తనకు సహజ రూపమగు నొక శబ్దమును గలిగియుండును. వీనినే బీజాక్షరములందురు (the seed sounds). బీజాక్షరములు మంత్రములకు మాతృకలు. సృష్టియందు ఈ శబ్ద బ్రహ్మమునకుగల మూలస్థానమును గ్రహించిన వారికి మంత్రముయొక్క ఆవశ్యకత లెస్సగా దెలియగలదు మాయ మంత్రమునకు వశీకృతము. మంత్రధ్యానము లేనివారికి అనుభవ జ్ఞానము ప్రాప్తించదని భావము.

శబ్దార్థముల సంబంధము : వీనినే నామరూపములందురు శబ్దము పరాశక్తి రూపము, అర్థము సర్వము ఈశ్వర స్వరూపము. శబ్దమునందే అర్థము గర్భితము. కనుకనే ఈశ్వరుడు మాయోపాధికుడని తెలియబడు చున్నాడు. నామరూపముల కేకత్వము చెప్పబడుటచే ప్రయోజనము. ఏకప్రయత్నము చేతనే రెండును అపవదింప సాధ్యపడుటయే.

ప్రతిష్ఠయన : ఏది లేనియెడల ఏది లేకయుండునో అది దానికి ప్రతిష్ఠ. వాచకము వాచ్యమునకు ప్రతిష్ఠ. శబ్దలక్ష్యమైన అర్థమునకు శబ్దము ప్రతిష్ఠ. అర్థస్వరూపుడగు ఈశ్వరునకు వాక్కు ప్రతిష్ఠ. శాక్తము బ్రహ్మను శక్తిత్వేన పరిగణించును (relativism.) అద్వైతము బ్రహ్మను స్వరూపత్వేన పరిగణించును (absolutism). కనుక శాక్తము ఉపాసనకుపక్రమింపను. అంతవరకే పరిమితము. అనగా ఉపాసనాను

కూలముగ శక్తికి గుణ కల్పనచేసి బ్రహ్మగ భావించును. శక్తిని బ్రహ్మ యొక్క ఒక గుణముగనో, ధర్మముగనో పరిగణింతురు (Inseperable Co-existence) కనుక నిది విశిష్టాద్వైతమునకు సన్నిహితము. ఇందు విమర్శ ప్రకాశములు సమ్మిళితములుగాని ఏకముగాదు (a harmoniously blended but not a single whole) అద్వైతమున విమర్శ ప్రకాశములు అవినాభావితములు; అనగా శబ్దార్థములకు, వాచ్య వాచకములకు, అభిధాన (శబ్ద) అభిధేయము (అర్థ) లకు కేవల ఏకత్వమే చెప్పబడినది. అనగా విమర్శ ప్రకాశములకు కేవల ఏకత్వమే చెప్పబడినది. (These are known as an inseperable integral whole)

శ్లో॥ వాగర్థా వివసంపృక్తౌ । వాగర్థ ప్రతిపత్తయే ।
జగతః పితరౌ వందే । పార్వతీ పరమేశ్వరౌ ॥

శ్రీ శంకరునకు సాదృశ్యుడగు తత్త్వవేత్త కవిసామ్రాట్ దేవీ ఉపాసకుడు శ్రీ కాళిదాసప్రోక్త పై శ్లోకము శబ్దార్థముల ఏకత్వమునకే అలంబన మిచ్చుచున్నది. "చిదేకశక్తిః" అను వాక్యము చిత్తే శక్తి అని తెలుపును గాని, చిత్తు యొక్క శక్తి యని గాదు.

II. ఆరంభవాదము : కార్యమగు జగత్తు కారణముండదు. అసద్రూపము అణువులనుండియే సృష్టియగునని వీరివాదము. కనుక దీనిని అసత్కార్యవాదమనియు అందురు. The effect has no cause. ఈ వాద ప్రతిపాదకులు తార్కికులగు నైయాయిక వైశేషికులు. పరమాణువుల సంయోగమువలన మహత్కార్యసృష్టి ఆరంభమగునని సిద్ధాంతీకరించినందున దీనికి ఆరంభవాదమని పేరువచ్చినది పరమాణువులు ద్వ్యణుక, త్ర్యణుక, చతురణుక, పంచాణుకాది ద్రవ్యపరంపర

నారంభించునని తార్కికుల సిద్ధాంతము. కార్యము పుట్టినప్పుడే దానికి ఉనికి ప్రాప్తించునుగాని పుట్టుటకు పూర్వము అదిలేనేలేదు. పరమాణువులు జడమగు అదృష్టముచేత (Some unseen agency which gathers these atoms) సంయోగము చెందునందురు. సంకల్ప సామర్థ్యముగల చైతన్యమే యీ సృష్టి చేయవలయునని నిర్ధరించి యీ వాదమును సేశ్వర వాదులు త్రోసిపుచ్చిరి. ఒక చైతన్యమున్నదని అంగీకరించునెడల పదార్థము - శక్తియొక్క ఆవిర్భావమే యగును. Primal matter must be primal as matter is a manifestation of sprit. మరొక విధానము : కొన్ని కారణములు కలసి, ఆ కారణములకంటే భిన్నమగు కార్యమును పుట్టించుననుట. ఉ॥ ఒక ఆభరణము అను కార్యము రూపొందించుటకు బంగారు ముక్కటియున్న చాలదు. ఒక విశ్వకర్మ, కుంపటి, సుత్తె, సమ్మెట, మున్నగునవి యుండవలయును గదా! ఈ వాదమున కార్యకారణములు భిన్నములని చెప్పబడుటచేత పరమాత్మ జగద్విషయమున కారణము కానేరదు. పరమాత్మ జ్ఞానస్వరూపుడు, అద్వితీయుడు, సర్వమునకు అభిన్న నిమిత్తోపాదాన కారణుడగుటచే—కార్యకారణముల భిన్నములని తెలుపు నీ వాదము త్రోసివేయబడెను. మరియు సర్వవ్యాప్త పరమాత్మ జగత్కారణమనియు, పరమాత్మ యందే జగత్తు ఉండుననియు చెప్పుటకు అనువుగ లేదనియు యీ వాదము నిరాకరింపబడినది. "ఏకమేవ అద్వితీయం" అని ఛాందోగ్యశివ పాఠమున జెప్పబడినట్లు పరమాత్మ ఒక్కడే, కారణమగుటకు రెండవదిలేదు అనగా ప్రపంచమను కార్యమునకు, నామరూపక్రియా రహితుడగువాడు పరమార్థమున జగత్కారణుడు కాజాలడని నిర్ధరింపబడినది.

Arambhavada is the theory that certain factors contribute for the shaping of an article; that the

effect comes to manifest, even without the 1St cause mentioned in metaphysics

III వివర్తవాదము (ఆత్మాధిష్ఠానకభ్రమః సాక్షివివర్తవాదము)

The Theory of illusion or superimposition : The illusion created by the self, on the self itself, as the substratum ఈ వాదహృదయమును గ్రహించుటకు ముందు వైద్య శాస్త్రమున చెప్పబడిన ఒక అంశమును విచారించిన విషయము సుగ్రాహ్యము కాగలదు. జడమగు ప్రకృతి (పరిణామి) పృథక్సత్తలేనిది. ఐనను రజస్తమస్సుల సంచలన (క్షోభ) ప్రభావముచే ప్రాకృతాప్రాకృతములు, దివ్యాదివ్యములు, శుభాశుభములు, మోదఖేదములు అను ద్వంద్వములు భాసింపకనిగదా శాస్త్రము తెలుపుట. ఆంగ్లమున consciousness derailed is the cause of duality అనగా చైతన్యము, ప్రసరించు స్రోతస్సుల పథము దప్పుటయే ద్వంద్వభావమునకు మిథ్యాభావములకు కారణము అని భావము. ఇది యెట్లన విచారింతము, వైద్యక్షేత్రమున (field of medicine) మానసికవ్యాధులు (psychological diseases) ఇప్పుడు బహుధా సంభవమగుచున్నవి. ఇంద్రియములు గ్రహించియున్న విషయజ్ఞానమును ఉద్వేగములద్వారా (through nervous impulses) ఒక కేంద్రమునకు (centre in brain) అందించవలసియుండగ, మరియొక కేంద్రమున కందించుట వలన గలుగు మిథ్యాజ్ఞానముచే (messages sent to wrong tele. phone numbers) యథార్థముగ లేని జబ్బులు నిజముగా యున్నట్లే బాధల కల్పించుచున్నస్థితి గలుగుచున్నది. ఉదాహరణకు అపస్మారవ్యాధిని (Hysteria) గమనింతము. ఈ వ్యాధిగలవారు యథార్థముగ పక్షవాతము వచ్చినట్లే ఒకప్రక్క కాలుచేయి పట్టుబడి కదల్చ సాధ్యపడదు. కొందరికి మూగవోయినట్లు నోట మాటరాదు ఇట్టి స్థితులు.

కొన్నినెలలవరకుకూడ అట్లేనిలచియుండి వారా యా వ్యాధిపీడితుల మనియే విశ్వసించియుందురు. ఈ వ్యాధులకు నిదానము (pathology) డాక్టర్లు ఎన్నిపరీక్షలు చేసినను తెలియబడదు. పక్షవాతరోగికి దగ్గరలో ఒక తుపాకీగుండును ప్రేల్చిన ఆ శబ్దమునకు భీతిజెంది అమ్మోయని లేచి పరుగెత్తును. మాట పడిపోయిన రోగి కొబ్బరిచెట్టుక్రింద కూర్చొనియుండ ఒక కొబ్బరికాయ రాలి నెత్తినపడిన "అమ్మో ! కొబ్బరికాయయని, తల పగిలినదిరో" అని అరచుచూ చెప్పును. ఈ ఘోరవ్యాధులు మానసిక వికార జనితములేగాని నిజముగావు. అవయవములు చచ్చుబడినట్లు, మాటరాక మూగవోయినట్లుండుటయే మిథ్యా జ్ఞానకార్యములకు ఆత్మాధిష్ఠానభ్రమ కుదాహరణముగ చాలదా ? ఒకని కొక తుపాకీ ప్రేలుడు యింకొకనికి కొబ్బరికాయదెబ్బ ప్రబోధము గలిగింప, మిథ్యాభావములు పోవుటను మనము చక్కగా గ్రహించ సహకరించగలవు. అష్టాంగ హృదయమను వైద్యగ్రంథమున మంగళాచరణ శ్లోకమును వినండి.

శ్లో॥ రాగాదిరోగాన్ సతతానుషక్తాన శేషకాయ
ప్రసృతా న శేషాన్।
ఔత్సుక్య మోహారతిదాన్ జఘానయోఽ
పూర్వవైద్యాయ నమోస్తుతస్మై॥

శరీరమున వాతపిత్త శ్లేష్మముల వైషమ్యస్థితిచే శరీరవ్యాధులు గలుగునట్లు రాగద్వేష కామాదులచే మనస్సునకు మిథ్యా స్వరూపవ్యాధులు గలుగును. వాటి నివారణకు అపూర్వవైద్యుడగు పరమాత్మకు నమస్కరించుచున్నానని భావము. మన జ్ఞానేంద్రియములు లందుండు మిథ్యాజ్ఞానమే రాగద్వేష కామాది వికారములకు, అందుచే జ్ఞానము పథముదప్పుటకు కారణమని గ్రాహ్యాంశము.

ఇక శంకరులచే ఉపనిషత్సమ్మతముగ చెప్పబడిన వివర్తవాద విచారణ జేయుదము : వివర్తమనగా వస్తువు ఒకటియై యుండ యింకొకటిగ స్ఫురించుట, ఇది యెట్లు సంభవము ? మన చూపులో దోషముండిననో. వస్తువును గోచరింపజేయు ప్రకాశమున హెచ్చుతగ్గులగు దోషముండిననో సంభవింప నవకాశమున్నది. లేక మన సంస్కార బలిమిచేత గూడ ఒకటి మరియొకటిగ భాసింపగలదు. అనగా అధిష్ఠాన వస్తువుయొక్క నిజరూపము చక్కగా తెలియబడక, అధిష్ఠాన సామాన్య జ్ఞానముచే విశేషాంశయొక్క అజ్ఞానము ప్రాప్తించి ఆ యజ్ఞానము మన సంస్కార బలిమిచే యింకొక వస్తువుగ పరిణమించి ప్రత్యక్షమగును. సంగాత్ సంజాయతే కామః కనుక యిచ్చట గ్రాహ్యాంశమేమన "మన అజ్ఞాన పరిణామ జనిత భ్రాంతి జ్ఞానమే మరియొక వస్తురూపమున స్ఫురించినదిగాని అధిష్ఠానముగు అసలు వస్తువునందు (the thing in itself) ఏ విధమగు మార్పునొందదు" అజ్ఞాన పరిణామ జనిత భ్రాంతి జ్ఞానమే మిథ్యాజ్ఞానము. ఇది గీతయందు మోహశబ్దముచే చెప్పబడినది. ఇది అసలు వస్తువుయొక్క నిజరూపము తెలియబడినప్పుడు నశించును, కనుక "అసత్" అని వ్యవహారమునకు వచ్చినది. కనుక అద్వయవాదము అజ్ఞాన పరిణామ వాదముగాని పదార్థ పరిణామ వాదముగాదు. ఈ భావమును దృఢపరచు కొనుటకు ఉదాహరణల దీసికొని పోల్చిచూచుకొందము. ఉపమానములకు కొన్ని, ఆధునిక వస్తువులు గలవుగాని శంకర భగవత్పాదులచే స్మరింపబడి, ఉచ్చరింపబడి అనాదినుండి శాస్త్రములయందు చెప్పబడినది శుక్తి (ముత్యపుచిప్ప) రజ్జువు (త్రాడు). శ్రీరాముని కరస్పర్శచే రూపొందిన వారలు సుస్థిరములై అభిజ్ఞాయోగ్యములైన ఉదాహరణములు యీ శుక్తిరజ్జువులు. కనుక వీటినే ఉదాహరణము గ్రహింతము. శుక్తికి ఒకవైపు మెఱుపుగల తెల్లని రంగు మరియొకవైపున నలుపు. హెచ్చు ప్రకాశముగల సమయముల

యందు సూర్యకాంతి శుక్తియొక్క తెల్లని ఫలకముపై బడినప్పుడు మనకు వెండివలె గన్పించును. దీనిని శుక్తిరజత భ్రాంతి యందురు. ఇచ్చట వెలుగు అధికముగ నున్న దోషముచే శుక్తియందు వెండి భాసించినది. వెండియొక్క తెలుపు మన అనుభవమున నున్నదిగనుకనే రజతభ్రాంతి గలుగుట. అనగా సంస్కార ప్రాబల్యముకూడ అజ్ఞాన పరిణామ సామగ్రిగ నుపకరించునని తెలియనగును. అజ్ఞానమునకు రెండు శక్తులు గలవు. 1) తమోగుణ ప్రాబల్యముచే గలుగు ఆవరణ శక్తి (veiling property) అనగా బుద్ధిని ఆవరించుటచే వస్తువును మరుగు పరచు శక్తి 2) రజోగుణ ప్రాబల్యముచే వస్తురూపమును మార్పుతో గోచరింపజేయు విక్షేపశక్తి (distorting property) ఆవరణ శక్తి అధిష్ఠానమును కప్పి శుక్తిజ్ఞానము లేకుండ చేయును. విక్షేపశక్తి శుక్తి యందలి తెలుపును, వెలుగునందలి మెఱుపను దోషముచే వెండిగా భాసింపజేసి భ్రాంతి జ్ఞానమును గలిగించును. రజ్జువిషయమునః త్రాడును మసకచీకటిలో చూచి పామని భ్రాంతిజెంది భయపడుదుము. ఇచ్చట త్రాడు అధిష్ఠానము, మసకవెలుతురు దోషము. లేనిదియై యుండియు ప్రాతిభాసికముగ పాముగ అధిష్ఠానమగు త్రాడుపై ఆరోపింపబడి తెలియ పడుటనే అధ్యారోపమందురు. (Super imposition). అజ్ఞానము యొక్క ఆవరణశక్తిచే ద్రష్టకు త్రాడు కనిపించలేదు. విక్షేపశక్తిచేతను ద్రష్టయొక్క సంస్కార బలముచేతను అది కట్టుగాగాక పాముగనే త్రాడుపై ఆరోపింపబడినది. ఇప్పుడు మరికొంత వెలుగు సాయము చేతనో లేక వస్తుతత్త్వ జ్ఞానముగల మరియొకరు దృఢీకరించి చెప్పినచో ఆ భ్రాంతిజన్య జ్ఞానముపోయి (అపవదింపబడి) వస్తుతత్త్వ జ్ఞానము గలిగి, అధ్యారోపింపబడినది పాముగాక అధిష్ఠానమగు త్రాడే తెలియబడును. ఈ భావమునే వాసుదేవ మననమను గ్రంథమునందు "అధ్యారోపాఽపవాదాభ్యాం నిష్ప్రపంచం ప్రపంచ్యతే" యను ప్రవచనముతో వాసుదేవ

యతీంద్రుడు తన గ్రంథమును ప్రారంభించెను. అనగా పైపై తోచి కల్పించిన పదార్థముల విచారించి, వస్తుతత్త్వము ఇది గాదని త్రోసి పుచ్చెడు ప్రక్రియతో ఆత్మతత్త్వమును స్పష్టీకరించుచున్నాను.

భ్రాంతిచే నింద్రియగోచరమైన కార్యమునకు, తాత్త్వికమగు పదార్థ మధిష్ఠానముగ తెలియవలెను. భ్రాంతికే, వేదాన్త విషయములకు వర్తించునపుడు అధ్యాసయని మరొక పేరు. ఈ యధ్యాసచే త్రాటి యందు భాసించు మిథ్యాసర్పము సత్యముగ తోచుచున్నది. శూన్యమను నెడల, శూన్యము దృగ్గోచరముగాదు. సత్యమని చెప్పునెడల, రజ్జు జ్ఞానము గలిగిన వెంటనే బాధింపబడగూడదు. సత్యవస్తువు త్రికాలాబాధితము. జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థల యందును అనుస్యూతము. కనుక నిది సత్ గాదు అసత్తు గాదు. అనిర్వచనీయమన నిట్టిదే. ఇది బౌద్ధుల అలీకమును గాదు సత్+అసత్ (సదసత్) అగును. It is a simultaneous is and is not. Maya is a comparetively gross form of the dynamic Sakti which appears in evolution. ఈ యుదాహరణలయందలి కార్యకారణముల వివరించి తెలిసికొన్నయెడల రజతమునకు శుక్తిని యావరించిన యజ్ఞానము, పామునకు త్రాడును ఆవరించిన యజ్ఞానము, పరిణామ్యుపాదాన కారణములుగ దెలియబడుచున్నవి. వెండికి ముత్యపుచిప్పయు. పామునకు త్రాడున్ను వివర్తోపాదాన కారణములని గ్రహింపవలయును. పరిణామి = కార్యరూపముగ మారి వచ్చిన పదార్థము + ఉపాదానము = మార్పుజెందిన మూలపదార్థము = పరిణామ్యుపాదానము. అసలు వస్తువు మారకుండా

* (1. అధ్యారోపము = పైనకల్పించి చూచినది; 2. అపవాదం= ఇదికాదు అని త్రోసిపుచ్చెడు ప్రక్రియ 3. నిష్ప్రపంచం = ఆత్మ తత్త్వమును 4. ప్రపంచ్యతే = స్పష్టీకరించుచున్నాను.)

మరియొక వస్తువుగా కనిపించుట వివర్తోపాదానము. అజ్ఞానము రజిత ముగ మారినదిగనుకనే పరిణామ్యుపాదానము. శుక్తి మారకయే వెండివలె కనిపించినది గనుక వివర్తోపాదానమని చెప్పబడెను. ఈ విజ్ఞానమును వేదాంతశాస్త్ర విషయమునకు వర్తింపజేసి విచారించిన ఉపమేయమగు జగత్తు బ్రహ్మను ఆవరించిన మూలాజ్ఞానము యొక్క పరిణామ ఫలిత మని-అట్టి అజ్ఞానముచే ఆవరింపబడిన పరమాత్మయొక్క వివర్తమనియు తెలియవలయును. జగద్విషయమున అజ్ఞానము పరిణామ్యుపాదానము పరమాత్మ వివర్తోపాదానమని అనగా వివర్తజ్ఞానమే ఉపాదానమని గ్రాహ్యాంశము. ఈ వివర ప్రక్రియను (process of super imposition as the result of a modification of nescience) విశ్వాసపూర్వకముగ గ్రహించిననేగాని అద్వయ సిద్ధాంతమునందు విశ్వాసము, శ్రద్ధ గలుగవు. దీనిని పరిపుష్టము జేయుటకే శఙ్కరులు మాయావాదమును ప్రతిపాదించి విపులీకరించిరి. 1-2-శ్లోకములయందు జగత్తుపై జీవునిపై మాయయొక్క ప్రభావమును, మాయా స్వరూపమును తెలుపబడినవి. 3-9-శ్లోకములయందు జీవులపై మాయా ప్రభావమును విపులీకరించి దెలిపిరి. ఈ మాయావాదము ననుసరించి సత్తాత్రైవిధ్యము అంగీకరింపబడు చున్నది. వీటివివరము యీ దిగువ సూచింపబడును. ఈ వివర్తవాదమున కనుబంధముగ స్వల్పభేదములతో మరిరెండు వాదము లున్నా చెప్పబడినవి. అవిరెండును అద్వైత సిద్ధాంత ప్రతిపాదకములే. విచారింతము :

4) సృష్టి దృష్టిప్రక్రియ; (వృత్తిప్రభాకరము) : ఇది ప్రమాత యగు చిదాభాసుని భ్రాంతిచే గలిగిన భావము. దీనిని అజాతవాదమనియు అందురు. అనగా ప్రమాతృ వివర్తము. ఇందు ముఖ్యమగు భావము దృశ్యమానమగు ఈ సృష్టియంతయు యిదివరకే (నీవు చూడకముందే) సిద్ధమైయున్నది. దీనిని మనము ఏ దృష్టితో జూచిన యెడల, దీని

ఉపాదాన, అధిష్ఠానముల తత్త్వమును (నిజరూపమును) తెలియగలమను విచారణయే ఇందలి విషయము. సూక్ష్మ గ్రాహులుగాని వారికి బోధనా సౌలభ్యమునకు ఉపాదానమును మూడు దృక్కోణముల నుండి జూచిన మూడు విధములుగ తెలియబడు సత్తలు గలవనితెలుపును.

i) ప్రాతిభాసిక సత్త : ప్రతిభాసయన భ్రమ, సత్తాయన ఉనికి. భ్రమకాలమున మాత్రమే సత్యముగ ఉనికియున్నట్లు గన్పించునది యీ సత్త. అంతరమగు స్వప్నజగత్తు బాహ్యమున నున్నశుక్తి రజతము దీనికుదాహరణలు. భ్రమజ్ఞానమునకు కారణమగు దోషము తొలగిన తరువాత ఈ జగత్తు ఉండదు కనుక త్రికాలాబాధితమగు సత్య వస్తువుగాదు (Transitory appearance). సదసత్తులలో ఒకదానిని మరియొకటిగా భావించి విశ్వసించుట అధ్యాస. ఇది ఆరు విధములగు దోషములచే ప్రాప్తించును. కనుక నిది ఆ దోషముపోయిన పోవును గానీ బ్రహ్మజ్ఞానముచే తొలగదు. చిత్తవృత్తి యందలి మార్పుచేత మాత్రమే దీనికి నివృత్తి గలుగును. ఉ॥ శుక్తియందలి రజతము చిత్తమునకు శుక్తివృత్తి ప్రాప్తించిన, రజతవృత్తి తొలగును. కనుక రజతము ప్రాతిభాసికసత్త గలిగినది మాత్రమే యగును.

ii) వ్యావహారిక సత్త : వ్యవహారమునందు గలుగు అవిద్యకు అంతఃకరణ వృత్తిచే అత్యంతనాశము (స్వరూపనాశము) ఉండదు. స్వరూప తిరస్కారము మాత్రము గలుగును. దీనికి ఉదాహరణ ఈ జగత్తు. దృష్టి సృష్టివాదు లీసత్తను అంగీకరించలేదు.

iii) పారమార్థిక సత్త : ఎయ్యది త్రికాలబాధితమో, ఎయ్యది చిత్తవృత్తిచే మార్పునుగాని నాశముగాని పొందదో, ఏది బ్రహ్మజ్ఞానముచే

మూలాజ్ఞానమను ముసుగును తొలగించుకొనిన మాత్రమే అనుభూతి పూర్వకముగ సాక్షాత్కరించునో అదియే పారమార్థికసత్త.

**N. B.** బ్రహ్మను, బహువిధ జడములను ఆశ్రయించియుండి అనాదియై. అఘటనాఘటన సమర్థమై. అనిర్వచనీయమగు భ్రాంతి కల్పనాహేతుశక్తియే మూలాజ్ఞానము.

ఈ సృష్టివాదము (1) పైనచెప్పిన త్రివిధ సత్తల నంగీకరించును. (2) బహు సంఖ్యాకులు జీవులని దెలుపును. (3) ఈ వాదమున మనస్సాక్షి బ్రహ్మ, జీవుడుగాదు. (4 ఇందు సృష్టికర్త జీవునికి భిన్నుడగు ఈశ్వరుడు.

5. దృష్టిసృష్టివాదము : (ప్రాతిభాసిక సత్తవాదము) ఇది సాక్షి వివర్తమును దెలుపు వాదము. దీనిని సాధుశ్రీ నిశ్చలదాసుగారు అంగీకరించిరి. వ్యావహారికమును కూడ స్వప్నతుల్యము అనగా జాగ్రత్తకూడ ఒక స్వప్నమువంటిదని నిరూపించుట. దీనిని సుజాతవాదమనియు అందురు. ఇది సూక్ష్మగ్రాహుల కుద్దేశింపబడినది. ఇందు ప్రధానసూత్రము "దర్శనంసృష్టిః-అదర్శనం లయః" అనగా నీవు చూచుటకుముందు సృష్టి లేదు. నీవు చూచినప్పుడే ఆకార్యము సంభవమగును. చూడనప్పుడు ప్రళయ ముండును. దృష్టియన దృక్ లేక బ్రహ్మ. అది స్వప్రకాశము. అదియే స్వీయమాయచేత జీవదృష్టికి లోపల వెలుపల అవిద్యాకార వృత్తిరూప జ్ఞానముచే జగదాకారముగ భాసించుచున్నది. కనుక దృష్టియన అవిద్యాకార వృత్తిరూప జ్ఞానమనియే మనము గ్రహించవలయును. దృశ్యమునకు ఆత్మయే అధిష్ఠానము. దృష్టివాదులకు పరిపూర్ణాత్మ ఒక్కటియే పారమార్థిము, స్వప్న జాగరస్థితులు ప్రాతిభాసికములు. అందుచే ఒక్క పారమార్థిక సత్తను మాత్ర మంగీకరింతురు. జాగ్రత్కాలమున స్థూలసూక్ష్మసృష్టి, ఆత్మనుండి స్వీయమాయాశక్తిచే జరిగి జాగ్రత్కాలము

పోయిన తరువాత ఆ మాయాశక్తి ప్రభావముచేతనే, మరల ఆత్మయందే లయమగును. ఇదియే సుషుప్తి. జగద్విషయమునను ఇట్లే సృష్టి, స్థితి. లయములను సంభవమని తెలిసికొనవలెను. ఇక జీవుని విషయమున ఏక జీవవాదమును ప్రతిపాదింతురు. ఇది బ్రహ్మజీవవాదమనియు అందురు. జగత్తునందు బహుసంఖ్యాక జీవులుగ వ్యవహరింపబడువారు సాక్షియందలి ఆభాసులే. సాధనములగు ఇంద్రియముల అపేక్ష హొందకయే స్వాజ విద్యా దృష్టిచే సాక్షాత్తుగ సర్వమును గనుమండును గావున జీవుడే (ప్రత్యగాత్మయే) సాక్షియగునుగాని బ్రహ్మసాక్షిగాదని వీరిమతము. మనస్సు ఆత్మయొక్క వివర్తము, శక్తియొక్క పరిణామమునై యున్నది. అనగా మాయావశమున పరిపూర్ణుడగు పరమాత్మయే మనస్సుగ. జగత్తుగ వివర్తము హొందుచున్నదని భావము. కనుక జగత్తుకు వివర్తోపాదానము, ఆత్మ. పరిణామోపాదానము మాయాశక్తియని తెలియ వలయును. జ్ఞానమునందు గోచరించు వస్తువునకే ఉనికిని దృష్టివాదు లంగీకరింతురు. జ్ఞానమున సాక్షిజ్ఞానము అవిద్యాప్రతిబింబము జీవుడు. విషయములచే మలినసత్వ ప్రధానమగు అంతఃకరణవృత్తి, (అవిద్య) తదవచ్ఛిన్న చైతన్యమే జీవుడు. ఇతనికి అంతఃకరణ సంబంధము లేదు. కనుక స్వప్రకాశ స్వరూపముతో సాక్షాత్తుగ సర్వమునకు దృక్కుగ నున్నాడు. అంతఃకరణముతోజేరి ప్రమాత యగుచున్నాడు. అనగా కర్తృత్వ భోక్తృత్వముల హొందుచున్నాడు. జగత్తు : మాయచే బ్రహ్మ నుండి పుట్టిన జగత్తుకూడ అనిర్వచనీయమేగాని అలీకము గాదు. రజ్జు సర్పమువలె ప్రాతిభాసికమున్నుగాదు. జీవునికి బ్రహ్మజ్ఞానము కలిగిననే జగత్తు నశించునుగాని అంతవరకు స్థిరముగనే యుండును. బ్రహ్మ జ్ఞానముచే నశించునది వ్యావహారిక సత్తాయని సృష్టిదృష్టి సిద్ధాంతము. ఇందు ప్రధానముగ రెండు సూత్రములు గలవు. 1. వ్యావహారికముగ

గోచరించు సకల పదార్థములు స్వప్నపదార్థములవలె అవిద్యాకార్యములు. అవిద్యోపహిత సాక్షివలన నివి ప్రకాశింపబడుచున్నవి. కనుక సాక్షిభాస్యములు 2. అవిద్యా పరిణామములైన సర్వజ్ఞాన జ్ఞేయములు ఏకకాలమందే ఉత్పన్నమైఏకకాలమందే నశించుచున్నవి. పదార్థము ప్రతీతి యగుటకు ముందుండదు. ప్రతీతి గలిగినప్పుడే ఉత్పన్నమగును. పదార్థమునకు జ్ఞాతసత్త యుండునుగాని అజ్ఞాతసత్త ఉపపన్నముగాదు. సత్తలు రెండేయని దృష్టివాదుల మతము. 1. ప్రాతిభాసికసత్త, సకల అనాత్మ పదార్థముల సత్త; కనుక నివి సాక్షిభాస్యములు. ప్రమాత ఇంద్రియములు, విషయములు, వాటి జ్ఞానము, ఏకకాలమందే ఉత్పన్నమగును. పరస్పర విషయ విషయీభావము ఘటిల్లదు. ఆత్మకు భిన్నముగ దోచు సర్వమూమిథ్యామాత్రమే. క్షణమాత్ర స్వప్నమునందు బహుకాల ప్రతీతిగలుగునట్లు- జాగ్రత్తుయందు స్థాయి, బహుకాలభోగ ప్రతీతి గలుగును. కనుక జాగ్రత్పదార్థములకు, స్వప్నపదార్థములకంటె విలక్షణత లేదు.

2) పారమార్థికసత్త ; ఇది త్రికాలాబాధితమగు సత్యస్వరూప సత్త,స్వరూప ప్రకాశము. ప్రమాణ, ప్రమేయ, ప్రమాతల త్రిపుటి ఘటిల్లదు. ఇదిసర్వసాక్షి.

దృష్టివాదమున జగత్తునకంతకు జీవుడు ఒకేఒక ప్రత్యగాత్మ. ఆయన దృష్టియే సృష్టి. ప్రత్యగాత్మ సమష్టి స్వరూపుడవగు నీవే యీ సృష్టియంతకును. కనుక ప్రత్యక్ సృష్టి లేక సాక్షి సృష్టిగా మనము తెలియుటలేదు. అందుచే సిద్ధాంతరీత్యా నీకేదియు బంధముగా జాలదు. ఇది తెలిసిన వానికి "ఆత్మరతి రాత్మక్రీడః ఆత్మారామః" అను సత్యము వర్తించును. చంద్రుడు చంద్రిక (వెన్నెల) ఒక్కటియే అన్నట్లు ప్రత్యగాత్మ పరమాత్మ లనన్యములే.